జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | గురువారం 02 ఏప్రిల్ 2026 | సంపుటి: 19 | సంచిక: 24 | పేజీలు: 12 | వెల: రూ.5 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , చైత్ర మాసము , తిథి: త్రయోదశి - 06:58:20 వరకు నక్షత్రంపూర్వఫల్గుణి - 15:21:17 వరకు కరణంతైతిల - 06:58:20 వరకు, గర - 19:00:31 వరకు పక్షంశుక్ల యోగంగణ్డ - 15:40:18 వరకు

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

## ప్రపంచానికి ఒరాకిల్ భారీ కుదుపు

**30వేల మంది టెక్కీల తొలగింపు**

**అందులో 12వేలమంది భారతీయులు**

న్యూయార్క్,ఏప్రిల్1(ప్రజాజ్యోతి): అమెరికా టెక్ దిగ్గజం ఒరాకిల్ మంగళవారం ఒక్కసారిగా భారీ లేఆఫ్స్‌కు శ్రీకారం చుట్టింది. ప్రపంచవ్యాప్తంగా

మిగతా1 2లో..

## నేడు నగరంలో హనుమాన్ శోభాయాత్ర

**3వేల మందితో పోలీస్ బందోబస్తు**

హైదరాబాద్,ఏప్రిల్1(ప్రజాజ్యోతి): నగరంలో హనుమత్ జయంతికి భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇకపోతే గురువారం హనుమత్ జయంతి సందర్భంగా శోభాయాత్ర నిర్వహించడం ఏటా ఆనవాయితీగా వస్తోంది.


మిగతా 2లో..

## కొత్త పట్టాదార్ రైతులకు రైతుభరోసా

కొత్తగా నమోదు చేసుకున్న రైతులకు ఊరట

వారికి కూడా రైతుభరోసాకు ప్రభుత్వం సానుకూలం

హైదరాబాద్,ఏప్రిల్1(ప్రజాజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలోని కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాలు పొందిన రైతులకు రేవంత్ సర్కార్ భారీ ఊరటనిచ్చింది. ఇప్పటివరకు పాత లబ్ధిదారులకే పరిమితమైన రైతు భరోసా పథకాన్ని, కొత్తగా భూములు కొనుగోలు చేసి పట్టా పొందిన రైతులకు కూడా వర్తింపజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా పట్టా పొందిన సుమారు 85 వేల మంది రైతులు ఉన్నారని అంచనా వేయగా, వారిలో ఇప్పటికే 62 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తులను వ్యవసాయ శాఖ ప్రస్తుతం క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. రైతుల అర్హత, భూమి వివరాలు, పట్టాదారుల నిజానిజాలను నిర్ధారించిన తర్వాత వారం, పది రోజుల్లో తుది జాబితాను సిద్ధం చేయనున్నారు. అర్హులుగా తేలిన కొత్త రైతులకు ఏప్రిల్ 15 నుంచి 20వ తేదీల మధ్య యాసంగి రెండో విడత రైతు భరోసా నిధులను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నారు. ఈ సీజన్‌లో సుమారు రూ. 9,000 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. గత వానాకాలం సీజన్‌లో లబ్ధి పొందిన ప్రతి రైతుకు, ఈ యాసంగిలో కూడా ఎటువంటి కోతలు లేకుండా పూర్తిస్థాయి పెట్టుబడి సాయం అందనుంది. 2025-26 ఖరీఫ్ సీజన్‌లో సుమారు 69.39 లక్షల మంది రైతులకు ఎకరానికి రూ. 6,000 చొప్పున మొత్తం రూ. 8,744.13 కోట్లను కేవలం తొమ్మిది రోజుల వ్యవధిలోనే పంపిణీ చేసి ప్రభుత్వం రికార్డు సృష్టించింది.



# నేటి నుంచి భూభారతి అమలు

## ఐదు మండలాల్లో ప్రయోగాత్మకం

**అధికారులతో సమీక్షించిన మంత్రి పొంగులేటి**

హైదరాబాద్,ఏప్రిల్1(ప్రజాజ్యోతి): తెలంగాణలో భూ వివాదాలకు ప్రభుత్వం చెక్ పెట్టనుంది . ఏప్రిల్ 2 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా భూభారతి సేవలు అమలు చేయనుంది. ప్రయోగాత్మకంగా 5 మండలాల్లో పోర్టల్ ప్రారంభం కానుంది. ఖమ్మం జిల్లా కూసుమంచి, భద్రాద్రి జిల్లా అశ్వరావుపేట, రంగారెడ్డి జిల్లా ఆమన్ గల్, సంగారెడ్డి జిల్లా వట్ పల్లి,నారాయణపేట జిల్లా కోస్గి మండలాల్లో భూభారతి అమలు సేవలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు పోర్టల్ ప్రారంభంపై బుధవారం అధికారులతో మంత్రి పొంగలేటి శ్రీనివాస్ రెడ్డి రివ్యూ నిర్వహించారు . ఈ సందర్భంగా భూభారతితో భూవివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ ఐదు మండలాల్లో వచ్చే ఫలితాలను బట్టి అవసరమైన మార్పులు చేసి, రెండో దశలో రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని చెప్పారు. ఎన్నికల హామీ మేరకు భూభారతి చట్టాన్ని తెచ్చామని, వ్యవసాయ భూముల క్రయవిక్రయాల సమయంలో సర్వే మ్యాపును జతపరిచే నిబంధనను కూడా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ ఐదు మండలాల్లో ప్రతీ సర్వే నంబర్‌కు ఆధార్ తరహాలోనే భూధార్ నంబర్‌ను కేటాయించనున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. ఇప్పటికే నక్ష లేని ఐదు గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేసి, భూధార్ ఇచ్చినట్లు గుర్తు చేశారు. ఒక్క క్లిక్‌తో రైతుల భూములకు సంబంధించిన పూర్తి సమాచారం లభించేలా పోర్టల్‌ను రూపొందించామని, ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ నంబర్ ద్వారా లాగిన్ అయ్యి వివరాలు పొందవచ్చని చెప్పారు. ధరణిలో 36 మాడ్యూల్స్ ఉండగా.. వాటి గందరగోళానికి చెక్?పెడుతూ భూభారతిలో అన్నింటినీ ఒకే చాప్టర్ కిందకు తీసుకువచ్చినట్లు స్పష్టం చేశారు.



కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు

## తీపి కబురు

**ఇక నేరుగా ఖాతాల్లో జీతాలు జమచేయనున్న ప్రభుత్వం**

**వేలాది మంది ఉద్యోగులకు లబ్ధిచేకూరే అవకాశం**



హైదరాబాద్,ఏప్రిల్1(ప్రజాజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలోని వేలాది మంది కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఒక తీపి కబురు అందించింది. గత కొన్నేళ్లుగా వేతనాల చెల్లింపులో ఎదురవుతున్న తీవ్ర జాప్యం, మధ్యవర్తుల అక్రమాలకు అడ్డుకట్ట వేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ఏప్రిల్ నెల నుంచి ఈ ఉద్యోగులందరికీ నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లోనే జీతాలు జమ చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. సాధారణంగా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా వేతనాలు అందుతుంటాయి. దీనివల్ల కమిషన్ల పేరిట కొంత మొత్తం కట్ అవ్వడమే కాకుండా, నెలల తరబడి

మిగతా 2లో..

## ఇరాన్‌పై 800 సార్లు యుద్ధ విమానాల దాడి

16వేలకు పైగా బాంబులు వేసిన ఫైటర్లు

వెల్లడించిన ఇజ్రాయిల్ మిలిటరీ శాఖ

న్యూఢిల్లీ,ఏప్రిల్1(ప్రజాజ్యోతి): దాదాపు నెల రోజులకు పైగా ఇరాన్, దాని మిత్ర దేశాలపై అమెరికా సహకారంతో ఇజ్రాయెల్ విరుచుకుపడుతోంది. ఈ దాడులకు సంబంధించిన వివరాలను తాజాగా ఐడీఎఫ్ పంచుకుంది. యుద్ధం ప్రారంభమైన నాటినుంచి ఇప్పటివరకు 800 సార్లు తమ యుద్ధ విమానాలు ఇరాన్ పైకి దూసుకెళ్లాయని ఇజ్రాయెల్ మిలిటరీ వెల్లడించింది. ఈ ఫైటర్‌జెట్లు 16వేలకు పైగా బాంబులను జారవిడిచినట్లు తెలిపింది. ఇరాన్ ప్రముఖ నాయకులు, మిలిటరీ కమాండర్లు, హెడ్‌క్వార్టర్లు, అణు స్థావరాలు, ఆయుధ తయారీ కేంద్రాలు, బాలిస్టిక్ క్షిపణి లాంచర్లు, ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను ధ్వంసం చేశాం. యుద్ధం మొదలైన నాటినుంచి 4వేల లక్ష్యాలపై 10వేలకు పైగా దాడులు చేశాం. దాదాపు 16వేల బాంబులను జారవిడిచాం. ఈ దాడుల్లో ఇరాన్‌కు చెందిన 2వేల మందికి పైగా సైనికులు, కమాండర్లు హతమయ్యారు. కేవలం 40 సెకన్లలోనే 40 మందికి పైగా సీనియర్

మిగతా 2లో..

## సోషల్ మీడియా వేదికగా వ్యతిరేక పోస్టులపై ఆంక్షలు

బిల్లు తీసుకురాబోతున్న కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ,ఏప్రిల్1(ప్రజాజ్యోతి): సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెడితే.. ఇకపై చర్యలు తీసుకునేందుకు కేంద్రం సమాయత్తమవుతోంది. అలాంటి పోస్టులు పెట్టే వారికి నేరుగా కేంద్రం నోటీసులు జారీ

మిగతా 2లో..

## రాష్ట్రం నిప్పుల కొలిమిలా..

ఈ వేసవిలో మండుటెండలు ఖాయం


మూడు నెలలు ఎండలు, వడగాలులు తప్పవు

సగటు కంటే ఎక్కువగా ఉష్ణోగ్రతలు నమోదు!

భారత వాతావరణశాఖ హెచ్చరిక

హైదరాబాద్,ఏప్రిల్1(ప్రజాజ్యోతి): రాష్ట్రంలో ఈ వేసవి సీజన్ మొత్తం ఎండ మంట పుట్టించనుంది. ఏప్రిల్ నుంచి జూన్ వరకు పగటి ఉష్ణోగ్రతలు సగటు కంటే ఎక్కువగా నమోదుకానున్నాయని వాతావరణ వాఖ హెచ్చరించింది. రానున్న మూడు నెలలకు దేశంలో వాతావరణ పరిస్థితులు, ఎండలు, వడగాడ్పులు, వర్షాలపై భారత వాతావరణ శాఖ(ఐఎండీ) బులెటిన్ విడుదల చేసింది. వచ్చే మూడు నెలలు రాష్ట్రం నిప్పుల కొలిమిలా మారే అవకాశం ఉంది. ఏపీతోపాటు ఒడిశా, తెలంగాణలో కొంత భాగం, పశ్చిమ బెంగాల్, బిహార్, యూపీ, ఈశాన్య రాష్ట్రాల్లో పగటి

మిగతా 12లో..



## మంగళ్‌హాట్ గోదాముపై దాడి

హోటళ్లకు చచ్చిన మేకల మాంసం

కుళ్లిన పది టన్నుల మాంసం స్వాధీనం

హైదరాబాద్,ఏప్రిల్1(ప్రజాజ్యోతి): హైదరాబాద్ నగరంలో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న మరో కల్తీ మాంసం ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. మంగళ్‌హాట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రెండు గోదాములపై

మిగతా 2లో..

## పొంగులేటి అక్రమాలపై హౌజ్ కమిటీ కోరాం

హైదరాబాద్,ఏప్రిల్1(ప్రజాజ్యోతి): రాష్ట్రంలో జరిగే మైనింగ్ స్కామ్‌ను హరీశ్‌రావు అసెంబ్లీలో ఆధారాలతో సహా బయటపెట్టారని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తెలిపారు. మైనింగ్ స్కామ్ మీద హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ చేశామని పేర్కొన్నారు. హౌస్ కమిటీ వేయడానికి సీఎం రేవంత్ రెడ్డికి ఏం సమస్య అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో పాడి కౌశిక్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. దీనిపై సీఐడీ ఎంక్వైరీ వేస్తామని ప్రభుత్వం చెబుతోందని.. మంత్రి మీద సీఐడీ ఎంక్వైరీ వేస్తే న్యాయం ఎలా జరుగుతుందని ఆయన ప్రశ్నించారు.

మిగతా 2లో..

కడియం ఏ పార్టీలో ఉన్నాడో తెలపాలన్నాం

ఇవన్నీ అడిగితే కేసులతో వేధింపులా?

మీడియా సమావేశంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి



# సంపాదకీయం

## ట్రంప్ చితిమంటల్లో ప్రపంచం విలవిల !

పశ్చిమాసియా యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో అంతుచిక్కడం లేదు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు. అయితే ఈ యుద్ధం వల్ల ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థ అతలాకుతలం అవుతున్నా అగ్రరాజ్యం అమెరికా పట్టించుకోవడం లేదు. అమెరికా షరతులకు లొంగేది లేదని ఇరాన్ కరాఖండిగా చెప్పడంతో ఎటు వెళుతుందో చెప్పలేని పరిస్థితి ఏర్పడింది. పరిస్థితి ఇలాగే ఉంటే పశ్చిమాసియా సంక్షోభంతో ప్రపంచంలో తలెత్తే ఆర్థిక సమస్యల గురించి చర్చ మొదలైంది. నెల రోజులు దాటిన యుద్ధంతో చమురు నుంచి ఆహారం వరకు ప్రభావితం అవుతున్నాయి. అమెరికాకు మంగళవారం నాటి వరకు 36 బిలియన్ డాలర్లకు పైగా నష్టం జరిగింది. ప్రతి సెకనుకు 11,574 డాలర్లు ఖర్చు అవుతున్నాయి. ట్రంప్‌కు వ్యతిరేకంగా అమెరికాలో గడచిన తొమ్మిది నెలల్లో మూడుసార్లు అక్కడి కార్మికవర్గం ప్రదర్శనలు చేశారు. ఎవరినైనా అదుపులోకి తెచ్చుకోవాలంటే అంతర్జాతీయ సూత్రాలను పక్కన పెట్టు, జనం మీద బాంబులు వేసి చంపు, దేశాలను నాశనం చేయి, అప్పుడు జనం నిరాశతో లొంగిపోతారనే అమెరికా అనుసరిస్తున్న విధానం ప్రపంచ దేశాలకు గుదిబండగా మారాయి. అమెరికా అడుగుజాడల్లో నడుస్తున్న ఇజ్రాయిల్ కూడా రెచ్చిపోవడం దారుణం. ఇదే క్రమంలో భారత ఆర్థిక వ్యవస్థ దిగజారుతుండటం ఆందోళనకరం. మన ఆర్థిక వ్యవస్థ త్వరలోనే ఐదు ట్రిలియన్ డాలర్ల మైలురాయిని చేరుకుంటుందన్న మోడీ లక్ష్యానికి గండిపడినట్లే. ఎందుకంటే మన ఆర్థిక వ్యవస్థ కూడా ప్రపంచ దేశాల మీద ఆధారపడి నడుస్తోంది. దీనికితోడు చమరు దిగుమతులపై ప్రభావం కారణంగా దేశంలో ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా తయారయ్యింది. చరిత్రలోనే ఎన్నడూ లేనివిధంగా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకపు విలువ 95కి పడిపోయింది. నరేంద్రమోడీ అధికారంలోకి వచ్చేనాటికి 2013లో డాలర్‌తో రూపాయి విలువ పోలిస్తే 62గా ఉండేది. రూపాయి విలువ అత్యంత ప్రమాదకర స్థాయికి చేరిందని అప్పట్లో నిర్మలా సీతారామన్, మోడీ విమర్శించారు. ఇప్పుడు అంతా బాగుందని పార్లమెంట్ సాక్షిగా ఆర్థిక మంత్రి ప్రకటించడం విడ్డూరం. డాలర్ పడిపోతున్న సమయంలో సైతం రూపాయి విలువ దిగజారడం, ఆసియా లోనే అత్యంత అధ్వాన స్థితికి చేరుకోవడం కేంద్రం వైఫల్యాన్ని చాటిచెప్పేదే. పశ్చిమాసియాలో యుద్ధ ప్రభావంతో ఆర్థిక సూచీల వృద్ధి మందగించిందని కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ తన తాజా నివేదికలో ప్రకటించింది. వాస్తవానికి యుద్ధం ప్రారంభానికి ముందే మన ఆర్థిక వ్యవస్థ ఆందోళనకర స్థితిలో ఉంది. దేశీయ ముడి చమురు పరిశ్రమ గత 24 నెలల్లో 20 నెలలు కుంచించుకుపోయింది. ప్రస్తుత ఎల్‌పిజి, పెట్రో ఉత్పత్తుల సంక్షోభానికి, తద్వారా ఆర్థిక రంగానికి ముప్పుగా పరిణమించిందనేది నిర్వివాదాంశం. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు రెండంకెల స్థాయిలో క్షీణిస్తున్నాయి. ఎగుమతులు గత కొన్ని నెలలుగా 5 శాతం నుండి 7 శాతం ప్రతికూల వృద్ధిని నమోదు చేస్తున్నాయి.సరుకుల ఎగుమతులు 0.8 శాతం పతనమై 36.61 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. పశ్చిమాసియా సంక్షోభం, అమెరికా విధిస్తున్న కొత్త టారిఫ్‌లు భారత తయారీ రంగానికి, ముఖ్యంగా ఐటి, ఫార్మా ఎగుమతులకు గొడ్డలి పెట్టుగా మారాయి. ఉత్పత్తికి డిమాండ్ తగ్గిపోయిందని ఈ గణాంకాలన్నీ చెబుతూనే ఉన్నాయి. కేంద్రం చెబుతున్నట్టు 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యాన్ని చేరుకోవాలంటే దేశ జిడిపి కనీసం 8 నుండి 9 శాతం స్థిరమైన వృద్ధిని నమోదు చేయాలి. వాస్తవంగా 5 శాతానికి మించదనేది నిపుణుల వాదనగా ఉంది. స్టాక్ మార్కెట్‌కు ఈ యేడాది 'బ్లాక్ ఇయర్'గానే మిగిలిపోయింది. లక్షల కోట్ల సంపద ఆవిరైంది. విదేశీ పెట్టుబడిదారులు గత ఏడాది కాలంలో రూ.1.80 లక్షల కోట్ల నిధులను వెనక్కి తీసుకోవడం మార్కెట్లను అగాథంలోకి నెట్టేసింది. పశ్చిమాసియాలో అమెరికా–ఇజ్రాయిల్ రుద్దిన యుద్ధం మనదేశాన్ని గణనీయంగా దెబ్బతీసింది.ద్రవ్యోల్బణం, నిరుద్యోగం సామాన్యుల జీవితాలను అల్లకల్లోలం చేస్తున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరిలో రిటైల్ ద్రవ్యోల్బణం 3.2 శాతానికి ఎగిసి 10 నెలల గరిష్ట స్థాయికి చేరుకోవడం ప్రమాద ఘంటికగా చూడాలి. ప్రస్తుత ఆర్థిక వ్యవస్థ విద్యావంతులకు సరిపడా ఉద్యోగాలను సృష్టించలేక పోతోంది. ప్రభుత్వ విధానాలు కొన్ని కార్పొరేట్ సంస్థల లాభాలకూ, కుబేరుల సంపద పెరుగుదలకూ ఉపయోగపడుతున్నాయి. అసమానతలు తీవ్రమవుతున్నాయి. సామాన్యులు, మధ్యతరగతి వర్గాలు దారిద్ర్యంలోకి నెట్టబడుతున్నారు. ప్రజల కొనుగోలు శక్తి పడిపోవడం, చిన్న పరిశ్రమలు కునారిల్లడం ఇందుకు నిదర్శనం. వాస్తవ సమస్యలను గుర్తించి పరిష్కరించినప్పుడే దేశానికి నిజమైన ఆర్థిక పురోగతి సాధ్యం. ఇరాన్‌పై దాడుల తరువాత అనేక దేశాల్లో స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. వాటి విలువ ఎంత అన్నది స్పష్టంగా చెప్పలేము. మన దేశంలో రూ.51 లక్షల కోట్లు నష్టపోయినట్లు అంచనా, ఇంకా పతనం కొనసాగితే నష్టాలు పెరుగుతాయి. ఈ ఏడాది చివరి నాటికి అమెరికా మాంద్యంలోకి వెళ్లేందుకు 37 శాతం అవకాశాలున్నట్లు పోలీ మార్కెట్ అంచనా వేసింది. కార్పొరేట్ కంపెనీలు పెరిగిన ఖర్చులను వినియోగదారుల మీద మోపితే ద్రవ్యోల్బణం పెరుగుతుంది, పెట్టుబడులు పెట్టేవారు ఆచితూచి అడుగేస్తారు, నియామకాలు తగ్గిపోతాయి. పశ్చిమాసియా సంక్షోభాన్ని ట్రంప్ ఎలా ముగిస్తాడో తెలియదు. స్వస్థి పలకటం అనివార్యం, అయితే అది అమెరికా నిర్దేశించినట్లు కాదు. ఇప్పుడు ఇరాన్ తన షరతులను ముందుకు తెస్తున్నది, ఇది ట్రంప్ కలలో కూడా ఊహించి ఉండడు.

కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు

# తీపి కబురు

మొదటిపేజీ తరువాయి..

జీతాలు రాక కార్మికులు ఇబ్బందులు పడేవారు. తాజా నిర్ణయంతో మున్సిపాలిటీలు, గురుకులాలు, విద్యా సంస్థలు, ఆరోగ్య శాఖ , మైనార్టీ సంక్షేమ శాఖల్లో పనిచేసే వేలాది మందికి లబ్ది చేకూరనుంది. నేరుగా ఖాతాల్లో జమ కావడం వల్ల పారదర్శకత పెరుగుతుంది.ప్రభుత్వ శాశ్వత ఉద్యోగులకు ప్రస్తుతం ఏ విధంగానైతే 'ఇంటిగ్రేటెడ్ ÷నాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్' ద్వారా జీతాలు అందుతున్నాయో, అదే విధానాన్ని కాంట్రాక్ట్ సిబ్బందికి కూడా వర్తింపజేస్తున్నారు. దీని కోసం ఇప్పటికే అన్ని జిల్లాల అధికారులు సిబ్బంది ఆధార్ కార్డులను వారి బ్యాంక్ ఖాతాలతో అనుసంధానం చేసే పక్రియను పూర్తి చేశారు. ఉన్నతాధికారులకు ఇందుకు సంబంధించిన డేటాను కూడా పంపడం జరిగింది. ముఖ్యంగా మున్సిపాలిటీల్లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులు, టెక్నికల్ వర్కర్లు గతంలో అనేక కష్టాలు పడేవారు. స్థానిక పన్నులు వసూలైతేనే జీతాలు ఇస్తామనే నిబంధనలతో అధికారులు వారిపై ఒత్తిడి తెచ్చేవారు. టా÷–గ్గ÷ట్లు పూర్తికాకపోతే నెలల తరబడి వేతనాలు ఆగిపోయేవి. దీంతో కార్మికులు తమ నిత్యవసరాల కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అప్పులపాలయ్యేవారు. ఇప్పుడు ప్రభుత్వం నేరుగా నిధులు విడుదల చేయనుండటంతో, పన్నుల వసూళ్లతో సంబంధం లేకుండా ప్రతి నెలా ఒకటో తేదీనే జీతం వచ్చే అవకాశం ఏర్పడింది.



## ప్రపంచానికి ఒరాకిల్ భారీ కుదుపు

మొదటిపేజీ తరువాయి..

పనిచేస్తున్న సుమారు 1.62 లక్షల మంది సిబ్బందిలో 18 శాతం, అంటే దాదాపు 30,000 మందిని తొలగించినట్లు సమాచారం. వీరిలో ఏకంగా 12,000 మంది భారతదేశానికి చెందిన ఉద్యోగులే కావడం గమనార్హం. అమెరికా కాలమానం ప్రకారం మంగళవారం ఉదయం 6 గంటలకు వేలాది మంది ఉద్యోగులకు ఒకేసారి లేఆఫ్ మెయిల్స్ పంపించారు. కంపెనీ పునర్వ్యవస్థీకరణలో భాగంగా వారి రోల్స్ అవసరం లేదని పేర్కొంటూ తొలగింపు ఉత్తర్వులు జారీ చేశారు. మార్చి 31నే వారి చివరి పనిదినంగా ప్రకటించడంతో పాటు, కంపెనీ ల్యాప్‌టాప్‌లు, సిస్టమ్‌ల యాక్సెస్‌ను వెంటనే నిలిపివేయడం ఉద్యోగులకు షాక్ ఇచ్చింది. ఈ లేఆఫ్స్ ప్రభావం భారత్‌పై తీవ్రంగా పడింది. ఒరాకిల్ ఇండియాలో సుమారు 30,000 మంది ఉద్యోగులు పనిచేస్తుండగా, వారిలో గణనీయమైన శాతం ఈ కోతలకు గురైనట్లు సమాచారం. అమెరికా, కెనడాలో తొలగించిన ఉద్యోగుల్లో కూడా పెద్ద సంఖ్యలో భారతీయులే ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా మేనేజీరియల్ స్థాయిలో ఉన్న ఉద్యోగులే ఎక్కువగా ఈ వేటుకు గురైనట్లు సమాచారం. ఇది ఒక్క విడత మాత్రమేనని, ఇంకా మరిన్ని లేఆఫ్స్ ఉండే అవకాశం ఉందన్న వార్తలు ఉద్యోగుల్లో ఆందోళన పెంచుతున్నాయి. ఏ సమయంలోనైనా మరో చేదు వార్త వినాల్సి వస్తుందేమోనని ఐటీ ఉద్యోగులు టెన్షన్ పడుతున్నారు. ఒరాకిల్ ప్రస్తుతం నష్టాల్లో లేదు. ఇటీవల ముగిసిన త్రైమాసికంలో కంపెనీ లాభాలు గత ఏడాదితో పోలిస్తే 95శాతం పెరిగి




6.13 బిలియన్ డాలర్లకు చేరాయి. అయితే, కంపెనీ ఇప్పుడు ఎఐ డేటా సెంటర్ రంగంలో భారీగా పెట్టుబడులు పెట్టుతోంది. సుమారు 156 బిలియన్ డాలర్ల ప్రాజెక్ట్ చేపట్టగా, అందులో భాగంగా ఇప్పటికే 50 బిలియన్ డాలర్లు అప్పు తీసుకుంది. ఈ నేపథ్యంలో ఖర్చులను తగ్గించేందుకు ఉద్యోగాల కోతలు విధిస్తున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ చర్యల ద్వారా కంపెనీకి దాదాపు 10 బిలియన్ డాలర్ల వరకు నగదు ఆదా అవుతుందని అంచనా. ఇక తొలగించిన ఉద్యోగులకు కంపెనీ కొన్ని పరిహారాలు ప్రకటించింది. అదనంగా మూడు నెలల జీతం,కంపెనీలో పని చేసిన ప్రతి ఏడాదికి 15 రోజుల జీతం, మిగిలిన సెలవులను నగదుగా మార్చుకునే అవకాశం,కార్మిక చట్టాల ప్రకారం గ్రాట్యుటీ.అయితే, ఈ ప్రయోజనాలు కంపెనీ నిర్దేశించిన గడువులోపు రాజీనామా చేసిన వారికే వర్తిస్తాయని పేర్కొన్నారు.

## నేడు నగరంలో హనుమాన్ శోభాయాత్ర

మొదటిపేజీ తరువాయి..

ఏప్రిల్ 2న హనుమాన్ శోభాయాత్ర ప్రశాంతంగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు సిటీ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఉత్సవ నిర్వాహకులతో సమన్వయ సమావేశం నిర్వహించాక పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రధాన యాత్రలో సుమారు 168 శోభాయాత్రలు కలవనున్న నేపథ్యంలో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకో కుండా సుమారు 3వేల మంది పోలీసు సిబ్బందితో పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు.యాత్ర నిర్వహణలో వలంటీర్లకు తగిన శిక్షణ ఇచ్చి, రోప్ పార్టీ సభ్యులను అధిక సంఖ్యలో ఏర్పాటు చేసుకోవాలని నిర్వాహకులకు సీపీ సూచించారు. ఫ్లై ఓవర్లు, రైల్వే బ్రిడ్జిల వద్ద తగిన జాగ్రత్తలు పాటించాలని, ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ముందస్తు మళ్లింపులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గౌలిగూడ రామమందిరాన్ని దర్శించుకున్న సీపీ సజ్జనార్ అక్కడి నుంచి తాడ్‌బండ్ హనుమాన్ దేవాలయం వరకు ఉన్న 12 కిలోమీటర్ల శోభాయాత్ర మార్గాన్ని వాహనంపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో రోడ్లపై చెత్తాచెదారం, మట్టికుప్పలు, రాళ్లు లేకుండా, రోడ్డుపైకి వచ్చే చెట్టుకొమ్మలు తొలగించే పనులు చేస్తున్నారు. ప్రజలు శాంతియుతంగా యాత్ర జరిగేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# ఇరాన్‌పై 800 సార్లు యుద్ధ విమానాల దాడి

మొదటిపేజీ తరువాయి..

అధికారులను అంతమొందించాం అని ఐడీఎఫ్ వెల్లడించింది. మరో 5వేల కొత్త టార్గెట్లను కూడా గుర్తించినట్లు తెలిపింది. ఇరాన్, దాని అనుబంధ గ్రూప్‌లు తమపై బెదిరింపులకు పాల్పడుతున్నాయని, వాటిని అడ్డుకోవడమే తమ లక్ష్యమని ఐడీఎఫ్ పునరుద్ఘాటించింది. మరోవైపు అమెరికా సెంట్రల్ కమాండ్ కూడా యుద్ధంపై స్పందించింది. ఇరాన్‌లోని భూగర్భ లక్ష్యాలను కూడా ఛేదించినట్లు వెల్లడించింది. ఇందుకు సంబంధించిన ఓ వీడియోను తాజాగా విడుదల చేసింది.



## అడుగంటుతున్న జూరాల ప్రాజెక్ట్

మహబూబ్‌నగర్, ఏప్రిల్1(ప్రజాజ్యోతి): ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు ప్రాణాధారమైన జూరాల ప్రాజెక్టు ప్రస్తుతం డెడ్ స్టోరేజీకి చేరుకోవడంతో పాలమూరు రైతాంగం ఆందోళన చెందుతోంది. దీంతో సాగునీటితో పాటు, తాగునీటి కష్టాలు తప్పేలా లేవు. ఎండలు ముదురుతున్న కొద్దీ ప్రాజెక్టులో నీటి మట్టం అట్టడుగుకు పడిపోవడంతో కోయిల్ సాగర్ లిఫ్ట్ మోటార్లకు నీరు అందడం లేదు. దీని ప్రభావం కోయిల్ సాగర్ చివరి ఆయకట్టుపై తీవ్రంగా పడుతోంది, సాగునీరు అందక చేతికి వచ్చిన పంటలు ఎండిపోయే స్థితికి చేరుకోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో కోయిల్ సాగర్ ఆయకట్టును ఆదుకోవడానికి తక్షణమే నీటిని విడుదల చేయాలని స్థానిక ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ప్రభుత్వాన్ని , సంబంధిత మంత్రిని కోరారు.మరోవైపు, రాష్ట్రంలో నెలకొన్న ఈ సాగునీటి సంక్షోభాన్ని పరిష్కరించేందుకు తెలంగాణ ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టింది. నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి జూరాలకు నీటిని విడుదల చేయించేందుకు ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగానే నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తో ఫోన్ లో మాట్లాడి, జూరాలకు కనీసం 5 టీఎంసీల నీటిని తక్షణమే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

# పొంగులేటి అక్రమాలపై హౌజ్ కమిటీ కోరాం

మొదటిపేజీ తరువాయి..

మంత్రిని సీఐడీ అధికారులు ప్రశ్నించే అవకాశం ఉంటుందా అని పాడి కౌశిక్ రెడ్డి అడిగారు. అందుకే పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశామని తెలిపారు. అయితే దానం నాగేందర్; కడియం శ్రీహరితో ముఖ్యమంత్రి మాట్లాడించారని చెప్పారు. దానం నాగేందర్ నోటికొచ్చినట్లు మాట్లాడి బెదిరించారని తెలిపారు. అన్నం పెట్టిన కేసీఆర్ గురించి కడియం శ్రీహరి తప్పుగా మాట్లాడారని పాడి కౌశిక్ రెడ్డి మండిపడ్డారు. కడియం శ్రీహరికి కేసీఆర్ ఏం తక్కువ చేశారని ప్రశ్నించారు. సిట్టింగ్‌ను కాదని కడియం శ్రీహరికి కేసీఆర్ టికెట్ ఇచ్చారని గుర్తుచేశారు. అందుకే నువ్వు ఏ పార్టీలో ఉన్నావని కడియం శ్రీహరిని అడిగామని తెలిపారు. తనతోపాటు బీఆర్ఎస్ సభ్యులందరూ అడిగారని,ఇది తప్పా అని నిలదీశారు. కాంగ్రెస్ వాళ్ల దగ్గర ఎందుకు కూర్చున్నావని ప్రశ్నించాం.. అది తప్పా అని ప్రశ్నించారు. నువ్వు ఏ పార్టీ పక్షాన మాట్లాడుతున్నావని కడియం శ్రీహరిని అడిగామన్నారు. కానీ కాంగ్రెస్ ఎమ్మెల్యే అందరూ నన్ను టా÷–గ్గ÷ట్ చేశారని పాడి కౌశిక్ రెడ్డి తెలిపారు. తెలంగాణ ప్రజల పక్షాన నిలబడినందుకు తనను టార్గెట్ చేశారని అన్నారు. నిరుద్యోగుల పక్షాన ఉద్యోగాలు అడిగినందుకు టార్గెట్ చేస్తున్నావా అని ప్రశ్నించారు. పెన్షన్లు ఎందుకు పెంచలేదని ప్రశ్నిస్తే టార్గెట్ చేస్తున్నావా అని నిలదీశారు. ప్రజల కోసం పోరాడుతున్నందుకే తన గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఎథిక్స్ కమిటీకి కాంగ్రెస్ నేతల తిట్లు కనిపించవా అని ప్రశ్నించారు. దానం తిట్లు ఎథిక్స్ కమిటీకి రావా అని అడిగారు. అసెంబ్లీలో కాంగ్రెస్ నేతలు మాట్లాడిన బూతులు అందరూ చూశారని తెలిపారు. కడియం శ్రీహరి బీఆర్ఎస్‌లో ఉంటే కేసీఆర్, హరీశ్‌రావును ఎందుకు విమర్శించారని ప్రశ్నించారు. హామీలపై మేం ప్రశ్నిస్తే మమ్మల్ని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు టార్గెట్ చేశారని తెలిపారు. ఎన్ని ఇబ్బందులు పెట్టినా ప్రజల కోసం పోరాడుతూనే ఉంటామని స్పష్టం చేశారు.

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అవినీతిని బయటపెడితే ప్రభుత్వం స్పందించడం లేదని కోరుట్ల ఎమ్మెల్యే కల్వంకుట్ల సంజయ్ మండిపడ్డారు. మైనింగ్‌పై జరుగుతున్న అవినీతిపై హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. సభాసంఘం వేయాలని అసెంబ్లీలో బీఆర్ఎస్ డిమాండ్ చేసిందని గుర్తుచేశారు. ఎమ్మెల్యే సంజయ్ మీడియాతో మాట్లాడుతూ.. నిజమైన నాయకులంటే పార్టీ లైన్‌లో ఉండాలి.. కానీ పార్టీ మారిన మనిషిని మీ భుజాల మీద



ఎత్తుకుంటున్నారని మండిపడ్డారు.. తోటి శాసనసభ్యుడిని తిట్టేందుకు మంత్రులకు మైక్‌లు ఇచ్చారని అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో మంత్రులు ఒక్కరైనా సబ్జెక్ట్ మాట్లాడారా అని ప్రశ్నించారు. స్వర్ణకారుల కష్టాల గురించి ఒక్కరైనా మాట్లాడారా అని అడిగారు. అవినీతి మంత్రిని, పార్టీ మారిన వ్యక్తిని వెనుకేసుకొచ్చారని తెలిపారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అయితే మా వెనుకాల కూర్చోవాలి కదా అని ప్రశ్నించారు. కడియం శ్రీహరి వంటి నాయకుడి మీరు వెనుకేసుకొస్తారా అని కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కడియం శ్రీహరి ఏ పార్టీ అని మేం తప్పకుండా అడుగుతామని తెలిపారు. తొలిసారి అసెంబ్లీకి వచ్చిన ఎమ్మెల్యేలు రాజ్యాంగ విలువలు కాపాడాలని సూచించారు. అసెంబ్లీలో చర్చ చూసి పిల్లలు నవ్వుకుంటున్నారని అన్నారు. సభలో పాలసీల గురించి మాట్లాడుతున్నామా? అని అడిగారు. మనం చర్చించాల్సింది ప్రజల సమస్యల గురించి మాత్రమే అని స్పష్టం చేశారు.


తెలంగాణ ప్రభుత్వము
రెవెన్యూ (భూసేకరణ) విభాగము
నిర్మల్ జిల్లా రాజపత్రము
అథారిటీచే ప్రకటించబడినది

రాజపత్రం సంఖ్య: 02/2026 తేది: 24-03-2026

జిల్లా కలెక్టర్ కార్యాలయం-నిర్మల్
ఫారం –VI (నోటిఫికేషన్)
(భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం-2013) (కేంద్ర చట్టం నెం.30/2013) యొక్క సెక్షన్ 11(1) రూల్ (19) సబ్ సెక్షన్ (1) అనుసరించి

కలెక్టర్ కార్యాలయము ఉత్తర్వు నెం.జి1/931/2024 తేది:24-03-2026
ప్రత్యేక ఉప కలెక్టర్ కార్యాలయము
ఉత్తర్వు నెం.ఎల్.ఎ/సి/73/2024 తేది: 07-03-2026
గెజిట్ నెం. 02/2026 తేది:24-03-2026

భూసేకరణ, పునరావాస, పున:స్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టం, 2013 (చట్టం 30/2013) సెక్షన్ 11 (1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పున:స్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 19(1) ప్రకారం నిర్మల్ జిల్లా సర్నాపూర్ –జి మండలం గొల్లమాడ గ్రామ పరిధిలో ఈ దిగువ షెడ్యూలు నందు చూపబడిన విస్తీర్ణం ఎకరముల (9.25) గుంటల భూమి ప్రజా ప్రయోజనార్థమై అనగా కాళేశ్వరం ప్రాజెక్టు లక్ష్మీ నరసింహస్వామి లిఫ్ట్ ఇరిగేషన్ ప్యాకేజీ నెంబరు. 27 క్రింద క్యాచ్ వాటర్ డ్రెయిన్ గొల్లమాడ పెద్ద చెరువు, స్వర్ణ బ్రాంచ్ @ యు.టి. 7.450 నిర్మాణము కొరకు అవసరమున్నదని తెలంగాణ ప్రభుత్వం/ జిల్లా కలెక్టర్, నిర్మల్ గారు భావిస్తున్నారు. భూసేకరణ, పునరావాస, పున:స్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టం, 2013 (చట్టం 30/2013) సెక్షన్ 6(2) మరియు 10ఎ ను అనుసరించి మినహాయింపు, చాప్టర్ (2)లోని సామాజిక ప్రభావ అధ్యయన నివేదిక మరియు చాప్టర్ 11 లోని ఆహార భద్రత మరియు పరిరక్షణ వంటి అంశములు వర్తించవు.

::షెడ్యూల్::

గ్రామము: గొల్లమాడ మండలము:సర్నాపూర్ జిల్లా: నిర్మల్

| క్రమ సంఖ్య | సర్వే నెం. | వర్గీకరణ/ భూ స్వభావం | భూ ప్రతిపాదనకు ప్రతిపాదించిన విస్తీర్ణం | పహాని క్రమము పేర్లు | ఎంజాయ్‌మెంట్ క్రమము అనుభవదారులు | విస్తీర్ణం | ఇతర వివరములు (బావులు,నిర్మాణములు చెట్లు) | [illegible] |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 |
| 1 | 51 /అ | పట్టా | 0.23 | అలిశెట్టి లంబడి లావణ్య భర్త పేరు భూపతి | అలిశెట్టి లంబడి లావణ్య భర్త పేరు భూపతి | 0.23 | లేవు | |
| 2 | 51 /అ1 | పట్టా | 0.24 | ఎల్మెట్టి శ్రీను తండ్రి పేరు పెద్ద నర్సయ్య | ఎల్మెట్టి శ్రీను తండ్రి పేరు పెద్ద నర్సయ్య | 0.24 | లేవు | |
| 3 | 52 | పట్టా | 0.05 | కాపెల్లి చిన్న లస్మన్న తండ్రి పేరు లస్మన్న | కాపెల్లి చిన్న లస్మన్న తండ్రి పేరు లస్మన్న | 0.05 | 1-మామిడి చెట్టు | |
| 4 | 61 /1/3 | పట్టా | 0.06 | ఎల్మెట్టి గంగాధర్ తండ్రి పేరు గంగారాం | ఎల్మెట్టి గంగాధర్ తండ్రి పేరు గంగారాం | 0.06 | లేవు | |
| 5 | 61/ 1/1 | పట్టా | 0.05 | ఎల్మెట్టి మహేష్ తండ్రి పేరు గంగారాం | ఎల్మెట్టి మహేష్ తండ్రి పేరు గంగారాం | 0.05 | లేవు | |
| 6 | 61/ 1/2 /1 | పట్టా | 0.12 | ఎల్మెట్టి సహదేవ్ తండ్రి పేరు గంగారాం | ఎల్మెట్టి సహదేవ్ తండ్రి పేరు గంగారాం | 0.12 | లేవు | |
| 7 | 62/ 2/1 | పట్టా | 0.01 | ఎలిశెట్టి రామకృష్ణ తండ్రి పేరు పండరి | ఎలిశెట్టి రామకృష్ణ తండ్రి పేరు పండరి | 0.01 | లేవు | |
| 8 | 62/ అ | పట్టా | 0.02 | లంబడి గజేందర్ తండ్రి పేరు గంగారాం | లంబడి గజేందర్ తండ్రి పేరు గంగారాం | 0.02 | 1-టేకు చెట్టు | |
| 9 | 62/ ఆ | పట్టా | 0.11 | ఎలిశెట్టి లంబడి భూపతి తండ్రి పేరు ఎలిశెట్టి లంబడి నర్సయ్య | ఎలిశెట్టి లంబడి భూపతి తండ్రి పేరు ఎలిశెట్టి లంబడి నర్సయ్య | 0.11 | [illegible] | |
| 10 | 142 | పట్టా | 0.04 | దేశ్పాండే హన్మంత్ రావు తండ్రి పేరు వెంకట్‌రావు | దేశ్పాండే హన్మంత్ రావు తండ్రి పేరు వెంకట్‌రావు | 0.04 | లేవు | |
| 11 | 199 /1 | పట్టా | 1.02 | దేశ్‌పాండే వెంకటేశ్వర్‌రావు తండ్రి పేరు హన్మంత్‌రావు | దేశ్‌పాండే వెంకటేశ్వర్‌రావు తండ్రి పేరు హన్మంత్‌రావు | 1.02 | 01-బోరు బావి | |
| 12 | 199 /2 | పట్టా | 1.02 | దేశ్‌పాండే రాజేశ్వర్ రావు తండ్రి పేరు దేశ్ పాండే హన్మంత్‌రావు | దేశ్‌పాండే రాజేశ్వర్ రావు తండ్రి పేరు దేశ్ పాండే హన్మంత్‌రావు | 1.02 | లేవు | |
| 13 | నర్సి నాలా | ప్రభుత్వ భూమి | 5.08 | ప్రభుత్వ భూమి (వాగు) | ప్రభుత్వ భూమి (వాగు) | 5.08 | లేవు | |
| | | మొత్తం: | 9.25 | | | 9.25 | | |

భూసేకరణ, పునరావాస, పున:స్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్ట పరిహార హక్కు చట్టం, పునరావాస, 2013 (చట్టం 30/2013) సెక్షన్ 11(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పున:స్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్ట పరిహార నియమావళి 2014 రూల్ 19(1)ని అనుసరించి సంబంధిత వ్యక్తులందరి దృష్టికి ఇట్టి విషయాన్ని తెస్తూ ఈ ప్రకటన జారీ చేయడమైనది.

సదరు చట్టంలోని సెక్షన్ 12లో గల అధికారాలను అనుసరించి జిల్లా కలెక్టర్ నిర్మల్ గారు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎల్ఏ యూనిట్-1, నిర్మల్ మరియు వారి సిబ్బందికి సదరు భూమిలో ప్రవేశించి సర్వే మరియు ఇతర పనులు చేపట్టుటకు అధికారమివ్వమైనది. ఇట్టి భూసేకరణకు అవసరమైన భూముల యొక్క నక్షా సదరు కార్యాలయము నందు కార్యాలయపు పని వేళలలో పరిశీలించవచ్చును.

సదరు చట్టంలోని సెక్షన్ 11(4) ననుసరించి కలెక్టర్, నిర్మల్ గారి అనుమతి లేకుండా షెడ్యూల్‌లో ప్రకటించిన భూములకు సంబంధించి క్రయ, విక్రయాలు లేదా ఏ విధమైన లావాదేవీలు జరుపరాదని తెలియజేయడమైనది.

సదరు చట్టంలోని సెక్షన్ 15 ననుసరించి ప్రతిపాదిత భూసేకరణపై ఏమైన అభ్యంతరములు గాని, ఆక్షేపణలు గాని ఉన్న ఎడల సంబంధిత వ్యక్తులు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎల్ఏ యూనిట్-1, నిర్మల్ గారి ఎదుట అభ్యర్థనలు దాఖలు (60) రోజుల లోపు చేసుకోవచ్చును.

సం/- భూసేకరణ అధికారి మరియు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ఎల్.ఏ) యూనిట్-1,నిర్మల్
సం/- అదనపు పాలనాధికారి, (రెవిన్యూ) నిర్మల్
సం/- జిల్లా పాలనాధికారి నిర్మల్

DIPR RO.No.1367/LA/PP/Advt/Pub/2025-26

3

ఫిర్యాదు దారులతో నిండి పోయిన భైంసా పోలీస్ క్యాంపు కార్యాలయం

– తక్షణమే సమక్షలకు పరిష్కార మార్గం చూపిన ఎస్పీ డాక్టర్ జి జానకిషర్మిల

**ఖానాపూర్ ఏప్రిల్ 1(ప్రజా జ్యోతి) :** నిర్మల్ జిల్లాలోని డివిజన్ల వారీగా సోమవారం నిర్మల్ కేంద్రంగా ప్రతి బుధవారం బైంసా కేంద్రంగా పోలీస్ శాఖ సంబంధించిన ఫిర్యాదులను స్వీకరించే కార్యక్రమం నిర్వీ రామంగా కొనసాగుతుంది ఈ మేరకు బుధవారం జిల్లా ఎస్పీ డాక్టర్ జి జానకి షర్మిలనిర్వహించిన భైంసా క్యాంపు కార్యాలయంలోఫిర్యాదు దారులు పోటెత్తారు ప్రజలు తమ సమస్యలను నేరుగా ఎస్పీకి తెలియజేయాలనే ఉద్దేశంతో భైంసా సబ్ డివిజన్ లోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు వచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిలప్రతి ఒక్క ఫిర్యాదుదారుడి సమస్యను ఎంతో ఓర్పుతో తెలుసుకొని సంబంధిత పోలీసు అధికారులకు వెంటనే విచారణ జరిపి, న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని సమస్యల పరిష్కారంలో ఎలాంటి ఆలస్యం లేకుండా పనిచేయాలని, బాధితులకు న్యాయం జరిగేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఉన్నత స్థాయి అధికారులను నేరుగా కలిసే విధానాన్ని ప్రవేశపెట్టిన ఎస్పీ జానకి షర్మిలకు ఫిర్యాదుదారులు కృతజ్ఞతలు తెలిపారు

## సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రికి ఐఎన్టీయూసీ లేఖ

మెడికల్ బోర్డు కొనసాగింపు, ఉద్యోగాల పరిరక్షణపై స్పష్టత కోరుతూ కోర్ కమిటీ ఆందోళన



**మంచిర్యాల, ఏప్రిల్ 1 (ప్రజా జ్యోతి) :** సింగరేణి కార్మికుల ప్రధాన డిమాండ్ల పరిష్కారం, కార్పొరేట్ మెడికల్ బోర్డు నిర్వహణ, ఇప్పటివరకు ఉద్యోగాలు పొందిన వారి పరిరక్షణ వంటి కీలక అంశాలపై రాష్ట్ర ముఖ్యమంత్రికి ఐఎన్టీయూసీ లేఖ రాసింది. ఈ విషయాన్ని ఐఎన్టీయూసీ సీనియర్ కేంద్ర ఉపాధ్యక్షులు జెట్టి శంకర్రావు తెలిపారు. ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్, తెలంగాణ రాష్ట్ర మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ బి. జనక్ ప్రసాద్ ముఖ్యమంత్రికి లేఖ రాసి, సింగరేణి కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరినట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి ప్రస్తుతం కేరళ రాష్ట్ర ఎన్నికల పర్యటనలో ఉన్నందున, వారు తిరిగి వచ్చిన వెంటనే అపాయింట్మెంట్ తీసుకుని సమస్యల పరిష్కారంపై చర్చించనున్నట్లు తెలిపారు.

లేఖ నేపథ్యంలో ఐఎన్టీయూసీ కోర్ కమిటీ సమావేశం నిర్వహించగా, సభ్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర శాసన మండలిలో ఉపముఖ్యమంత్రి చేసిన ప్రకటనల వల్ల సింగరేణి మెడికల్ బోర్డు ద్వారా ఉద్యోగాలు పొందుతున్న కార్మిక కుటుంబాల్లో అనిశ్చితి నెలకొందని పేర్కొన్నారు. సభ్యులు వివరాల ప్రకారం, 2000 నుండి 2014 వరకు కేవలం 3,800 మంది ఉద్యోగాలు పొందగా, 2018 నుండి క్రమబద్ధంగా నిర్వహించిన మెడికల్ బోర్డు ద్వారా 13,119 మంది డిపెండెంట్లు ఉద్యోగాలు పొందినట్లు తెలిపారు. ఇటీవల జరిగిన పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో సింగరేణి ప్రాంత కార్మికులు కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చి సుమారు 95 శాతం వరకు అభ్యర్థులను గెలిపించారని, అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు జిల్లాల పరిధిలోని 12 నియోజకవర్గాల్లో సంపూర్ణ మద్దతు అందించి 10 మంది ఎమ్మెల్యేల విజయానికి కారకులయ్యారని పేర్కొన్నారు. కార్పొరేట్ మెడికల్ బోర్డు నిర్వహణపై ఉపముఖ్యమంత్రి చేసిన తాజా ప్రకటనలతో కార్మికుల్లో అసంతృప్తి పెరుగుతోందని, ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని కోరారు. ఫిబ్రవరి 8న భూపాలపల్లి మున్సిపల్ ఎన్నికల సభలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు మెడికల్ బోర్డును నిరంతరం కొనసాగిస్తామని స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఇదే సమయంలో ప్రత్యర్థి యూనియన్లు, ముఖ్యంగా బీఆర్ఎస్ అనుబంధ టిబిజికెఎస్ వంటి సంఘాలు ఆందోళనలు చేపడుతున్నాయని పేర్కొన్నారు. కార్మికుల్లో నమ్మకం పెంపొందించేందుకు మెడికల్ బోర్డును కొనసాగించడంతో పాటు సొంతింటి పథకం, అలవెన్సులు, ఆదాయ రీయింబర్స్మెంట్ తదితర 15 ప్రధాన డిమాండ్లను వారం నుంచి పది రోజుల్లో పరిష్కరించాలని కోర్ కమిటీ కోరింది. అవసరమైతే ప్రభుత్వంపై తీవ్ర ఆందోళనలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమావేశంలో నిర్ణయించారు. కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం ఐఎన్టీయూసీ కట్టుబడి ఉందని నేతలు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సీనియర్ కేంద్ర ఉపాధ్యక్షులు నరసింహారెడ్డి, పి. ధర్మపురి, త్యాగరాజన్, కాంపెల్లి సమ్మయ్య, జెట్టి శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.


## ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు కలగాలని కల ఉంటుంది

– జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ

– మేయర్ ధర్ని మధుకర్

ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశం

– లబ్ధిదారులకు శుభాకాంక్షలు



**మంచిర్యాల, 1 ఏప్రిల్ (ప్రజా జ్యోతి) :** మంచిర్యాల నియోజకవర్గంలోని మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 49వ డివిజన్లో ఫర్జానా బేగం, రుబీనా నహీద్ నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు గారి సతీమణి, జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, మేయర్ ధర్ని మధుకర్ కలిసి ఇళ్లను ప్రారంభించి లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు కలగాలని కల ఉంటుందని, ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఆ కలలు సాకారం అవుతున్నాయని పేర్కొన్నారు. రెండో విడతలో కూడా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కానున్నాయని, అర్హులైన ప్రతి లబ్ధిదారుడు ఇల్లు నిర్మించుకునేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల ద్వారా ఫర్జానా బేగం, రుబీనా నహీద్ లాంటి పేద కుటుంబాలకు సురక్షితమైన నివాసం లభించడం సంతోషకరమని నాయకులు పేర్కొన్నారు. ఇంతకాలం అద్దె ఇళ్లలో లేదా ఇబ్బందికర పరిస్థితుల్లో నివసించిన వారు ఇప్పుడు స్వంత గృహాల్లోకి ప్రవేశించడం తమ జీవితాల్లో ఒక ముఖ్యమైన మైలురాయిగా భావిస్తున్నారని తెలిపారు. అనంతరం లబ్ధిదారులు మాట్లాడుతూ తమకు ఇందిరమ్మ ఇళ్లు కల్పించినందుకు ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, సురేఖ గార్లకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# చైత్రపూర్ణిమ, హనుమద్విజయోత్సవం





- నేడు హనుమద్విజయోత్సవం (హనుమజ్జయంతి) సందర్భంగా ప్రత్యేకం
- తిరుమల తిరుపతి దేవస్థాన ఆచార్య పురుషులు శ్రీ ఉ.వే శ్రీ మాన్ వీరవల్లి కుమార శ్రీ నివాస రాఘవాచార్యుల శిష్యులు ఇందూర్తి ఆచార్య కళ్యాణ్

**నిర్మల్ జిల్లా ప్రతినిధి, ఎప్రిల్ 1, (ప్రజాజ్యోతి) :** ఉత్తరాది వారికి చైత్ర పూర్ణిమ హనుమజ్జయంతి" దీనినే మనవారు హనుమద్విజయోత్సవం అంటారు. ఒరియా ప్రజలు మేష సంక్రాంతినాడు హనుమజ్జయంతి జరిగినట్లు భావిస్తారు. తమిళనాట మార్గశిర అమావాస్య నాడు హనుమజ్జయంతిని నిర్వహిస్తారు. మార్గశిరంలోనే శుద్ధ త్రయోదశి తిథిని కన్నడ ప్రజలు జరుపుకుంటారు. ఆనాడే తెలుగునాట హనుమద్వ్రతం చేసుకునే ఆచారం ఉంది. జ్యేష్ఠమాసంలో సువర్చలా హనుమంతుల కల్యాణం నిర్వహిస్తారు. హనుమంతుని భక్తులకు ఎన్నడూ అపజయం లేదు. ఓటమి లేదు. లక్ష్యసాధనలో తనకంటూ ఒక నిర్దుష్ట మార్గాన్ని ఆచరణాత్మకంగా ప్రకటించిన కార్యసాధకుడు. అమేయ బలపరాక్రమ సంపన్నుడైనా అంతా రామనామ మహిమ అనే ఒక్కమాటతో అచంచలమైన స్వామిభక్తిని ప్రకటించే దాసానుదాసుడు. ఇన్ని సుగుణాల కలబోత కనుకనే ఆంజనేయుడు అందరి దైవం. చైత్రపౌర్ణమికి భక్తులు హనుమద్దీక్షా స్వీకారం చేస్తారు. హనుమద్దీక్షా పరులకు శారీరక మానసిక రుగ్మతలు, భూత ప్రేత పిశాచ బాధలు తొలగి సుఖ శాంతులు కలుగుతాయి అని ప్రగాఢ విశ్వాసం. దీక్షా నియమాలను పాటించగలిగే వారందరూ ఈ దీక్షాస్వీకారానికి అర్హులే.

**ఆలోక్య వేదశాస్త్రాణి సర్వాణ్యపి మహర్షిభి :** ఇదమేకం సు నిర్ణీతం దైవం హనుమత్ పరం. హనుమంతుని కంటే గొప్పదైవం లేదని మహర్షులందరూ నిర్ణయించారంటుంది వానరగీత. కలియుగంలో హనుమను ఒక్కడిని సేవిస్తే సకల దేవతలనూ ఉపాసించినట్లే అని ఈశ్వరుడే స్వయంగా చెప్పాడు. హనుమజ్జయంతినాడు ఆంజనేయుని పూజిస్తే సకల శుభాలు లభిస్తాయి. తెలుగువారి దేవుడని మనం ఘనంగా చెప్పుకోదగినవాడు. శ్రీ హనుమంతుడు. అంజనాదేవి, కేసరి దంపతులకు చిరకాలం సంతానం కలగలేదు. భర్త అనుమతి తీసుకుని అంజన వేంకటాద్రికి వెళ్లి శివుని కోసం తపస్సు చేసింది. వాయువు ఆమెకు రోజూ ఒక ఫలం ఆహారంగా అందించేవాడు. ఆ ఫలం మాత్రమే తింటూ ఆమె వేయి సంవత్సరాలు తపస్సు చేసినట్లుగా పరాశర సంహిత చెబుతోంది. అంజన తపస్సు చేయడం వల్ల ఏడుకొండలలో ఒక కొండకు అంజనాద్రి అని పేరువచ్చినట్లు బ్రహ్మాండపురాణంలో ఉందని పెద్దలు చెప్పుతుంటారు.

ప్రసిద్ధం యాతు శైలోయం అంజనేనామతస్తప

అంజనాచల ఇత్యేవ నాత్రకార్యావిచారణా. : పూర్వం ఒక పండుగ రోజున పార్వతీ పరమేశ్వరులు వేంకటాద్రికి వచ్చారు. అక్కడి వాతావరణానికి పులకించిన పార్వతి భర్తతో మనమిద్దరం వానర రూపాలలో క్రీడిద్దాం అని కోరింది. శివుడు సరేనన్నాడు. పార్వతి గర్భం ధరించింది. శివ పురాణంలో ని కుమార ఖండంలో చెప్పినట్లు శివతేజస్సు పార్వతి గర్భం నుంచి సంతాన రూపంలో బయటకు వస్తే అది దేవతలను, దానవులను కూడా సమానులను పీడిస్తుంది. అందుకే పార్వతి తన గర్భంలో ఉన్న రుద్రవీర్యాన్ని భరించమని అగ్నికిచ్చింది. అగ్నికూడా భరించలేక వాయువుకిచ్చాడు. వాయువు ఆ రుద్రవీర్యాన్ని చాలాకాలం భరించి భద్రపరిచాడు.ఆ తర్వాత సంతానం కోసం వేంకటాద్రిపై తపస్సు చేస్తున్న అంజనాదేవి చేతిలో ఒకనాడు ఫలం రూపంలో ఆ రుద్రవీర్యాన్ని ఉంచాడు. అంజన గర్భం ధరించింది. భర్తకు దూరంగా తపస్సులో ఉన్న తనకు గర్భం ఎలా వచ్చిందా అని ఆమె చింతిస్తూ ఉండగా శివుని వాణి. వినవచ్చింది.

మాభూతే వ్రతభంగోయం విషాద వరాననే

దేవ ప్రసాదాత్తే గర్భే మహావ్యక్తిర్భవిష్యతి

అంజనా! నీవు ఉత్తమురాలివి. నీకు శీలభంగం కాలేదు. ఈశ్వరానుగ్రహం వల్ల నీ గర్భం నుంచి ఒక మహానుభావుడు పుడతాడు. నీ పేరు మీదుగా ఆంజనేయుడని పేరు పొందుతాడు. నీ భర్తకు కూడా ఈ విషయం చెబుతాను. అతడు నిన్ను ఆదరిస్తాడు అన్న ఆకాశవాణి పలుకులకు అంజనాదేవి సంతోషించింది. ఈ విషయం శివుడి ద్వారా తెలుసుకున్న అంజన భర్త కేసరి కూడా బ్రహ్మానందం పొందాడు.

వైశాఖే మాసి కృష్ణాయాం దశమీ మంద సంయుతా

పూర్వప్రోక్త పదాయుక్తా తథా వైధృతి సంయుతా

తస్యాం మధ్యాహ్న వేళాయాం జనాయామాస వై సుతం

పూర్వాభాద్రా కుంభరాశే మధ్యాహ్నే కర్కటాంశకే

ఈ విదంగా ఆంజనేయుని జననకాలం గురించి పరాశర సంహిత ప్రకారం ఆనాడు వైశాఖ మాస కృష్ణ దశమి శనివారం, మధ్యాహ్న వేళ కర్కాటక లగ్నం. పూర్వాభాద్ర నక్షత్రంలో వైధృతి యోగంలో అంజనాదేవి ఆంజనేయునికి జన్మనిచ్చింది. ఆయన జననం పొందిన స్థలమే ఏడుకొండలలో ఒకటైన ఈనాటి అంజనాద్రి అని చెప్పవచ్చు.

# ఖానాపూర్ మున్సిపల్ చైర్మెన్ వైస్ చైర్మన్ ఎన్నికకు పగడ్బందీ ఏర్పాట్లు

జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు వెల్లడి







**ఖానాపూర్ ఏప్రిల్ 1(ప్రజాజ్యోతి) :** గత రెండుసార్లు వాయిదా పడ్డ నిర్మల్ జిల్లా ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్ల ఎన్నిక ఈనెల 4న శనివారం జరగనున్నందున ఏర్పాట్లను స్వయంగా జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఆయన, ఖానాపూర్ మున్సిపల్ కార్యాలయంలో, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక జరగనున్న నేపథ్యంలో ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని అన్నారు. ఎన్నికైన కౌన్సిలర్లకు పార్టీల వారిగా సీటింగ్ ఏర్పాటు చేసి, త్రాగునీరు అందించాలని పేర్కొన్నారు. తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని వివరించారు. మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో ట్రాఫిక్, పార్కింగ్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్గా బాధ్యతలు చేపట్టి, తొలిసారి ఖానాపూర్ మున్సిపల్ కార్యాలయానికి వచ్చినందున అదనపు కలెక్టర్ను, మున్సిపల్ కమిషనర్, తదితర అధికారులు శాలువాతో సన్మానించారు. ఈ సమావేశంలో సీపీవో జీవరత్నం, మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్, తహసిల్దార్ సుజాత, ఎంపీడీవో రమాకాంత్, తో పాటు ఖానాపూర్ పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ అజయ్ కుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఖానాపూర్ పట్టణంలోని వివిధ హనుమాన్ దేవాలయాల్లో జయంతి ఉత్సవాలు

సామూహిక హనుమాన్ చాలీసా మహా అన్నదాన కార్యక్రమం



**ఖానాపూర్ ఏప్రిల్ 1(ప్రజా జ్యోతి) :** కలియుగ ఆరాధ్య దైవం శ్రీశ్రీశ్రీ వీర హనుమాన్ జయంతి సందర్భంగా నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలోని ఉత్తర వాహిని పవిత్ర గౌతమినదా తీరా వివిధ ప్రాంతాల్లో గల దేవాలయాల్లో నేడు గురువారం ఉదయం 5 గంటల నుంచి ప్రత్యేక పూజ పంచామృత సింధూర ఫల అభిషేకాలతో పాటు రుద్ర సహిత పంచసూక్త పారాయణలు విశేష అష్టోత్తర శతనామాలతో పాటు హనుమాన్ చాలీసా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివిధ ఆలయాల అర్చకులు తెలిపారు ఆలయాలను ఇప్పటికే ముస్తాబు చేశారు సందర్భంగా ఖానాపూర్ పట్టణంలోని అత్యంత ప్రాచీనమైన శ్రీరాంనగర్లోని సీతారామ ఆంజనేయ స్వామి ఆలయంలో తిమ్మాపూర్ శాంతినగర్ వడ్డెవాడ ఆలయంలో పద్మావతి నగర్లోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ఆలయ ప్రాంగణంలోని ప్రసన్నాంజనేయ ఆలయంలో గాంధీనగర్ లోని ఆంజనేయ ఆలయంతో పాటు శివ సాయి క్షేత్రం జంగల్ హనుమాన్ ప్రాంగణంలో నూతనంగా నిర్మాణమైన సంకట విమోచన పంచముఖ ఆంజనేయ ఆలయం కొమరం భీమ్ చౌరస్తాలో ప్రత్యేక పూజలు ఆలయ పండితులు కీర్తి రాఘవ శర్మ నిమ్మగడ్డ నాగరాజు శర్మ వేద పండితులు ప్రసన్నాంజనేయ చండీ ఉపాసకులు నిమ్మగడ్డ సందీప్ శర్మ నిమ్మగడ్డ శ్రీనివాస్ శర్మతో పాటు రామోజీల రామకృష్ణ శర్మ పంచముఖ ఆలయ అర్చకులు తిరునగరి నందకిషోర్ ఆచార్యులు ప్రత్యేక అర్చన నైవేద్య హారతి మంత్రపుష్పం తీర్థప్రసాద వితరణ చేసి భక్తులకు పంచనున్నారు ఈ సందర్భంగా వివిధ ఆలయాల్లో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని సైతం నిర్వహిస్తున్నట్లు ఆయా ఆలయాల నిర్వాహకులు తెలిపారు ప్రతి ఏటా జరిగే హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయాల్లో భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులై ఆయురారోగ్యాలు అష్టైశ్వర్యాలతో మెలగాలని యజ్ఞాచార్యులు చక్రపాణి వాసుదేవా చార్యులు వేద పండితులు చక్రపాణి నరసింహమూర్తిలు కోరుతున్నారు హనుమాన్ జయంతి సందర్భంగా పట్టణాల్లోని అన్ని దేవాలయాల్లో ఆంజనేయ దీక్ష పరులతో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి కృపకు పాత్రులవుతారు.

# గూడెం క్షేత్రంలో వైభవంగా గిరి ప్రదక్షిణ





**దండపల్లి, ఏప్రిల్ 1 (ప్రజా జ్యోతి) :** మంచిర్యాల జిల్లా దండపల్లి మండలంలోని గూడెం శ్రీ రమాసహిత సత్యనారాయణ స్వామి క్షేత్రంలో గిరి ప్రదక్షిణ బుధవారం అత్యంత భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. గోదావరి తీరంలోని శ్రీ భక్తాంజనేయ స్వామి ఆలయ వ్యవస్థాపక అర్చకులు పెరంబుదూరి హరీష్ ఆధ్వర్యంలో భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా గోదావరి తీరంలోని ఆంజనేయ స్వామి ఆలయం నుంచి భక్తులు కాలినడకన యాత్రగా బయలుదేరారు. స్వామివారి నామస్మరణతో గూడెం గుట్ట పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. గుట్ట చుట్టూ గిరి ప్రదక్షిణ చేస్తూ భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. లోక కళ్యాణార్థం నిర్వహించిన ఈ కార్యక్రమంలో బత్తుల చందు, చుంచు సత్తన్న, కర్నాల శ్రీకాంత్, గొల్ల మల్లేష్, కనగంటి కుమార్, కర్నాల అంజన్న, అక్కల సతీష్, వేముల అశోక్, అల్లాం లింగన్న, బత్తుల అజయ్, బత్తుల రక్షిత్, చుంచు సంతోష్, అల్లం మనీష్ తదితరులు పాల్గొన్నారు.





## గ్రామ, మండలలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక గ్రామసభలు

– ప్రత్యేక అధికారి జీవరత్నం వెల్లడి

**ఖానాపూర్ ఏప్రిల్ 1 (ప్రజాజ్యోతి) :** ఖానాపూర్ మండల కేంద్రంతో పాటు ప్రతి గ్రామ పంచాయతీలలో గురువారం గ్రామసభలు నిర్వహించి ప్రజా సమస్యలు పరిష్కరించాలని మండల ప్రత్యేక అధికారి జీవరత్నం అన్నారు ఈ మేరకు ఖానాపూర్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో పాటు పంచాయతీ కార్యదర్శులు వీఆర్వోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు తెలంగాణ ప్రజా ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా గురువారం రెండున గ్రామ సభలలో పంచాయతీ సర్పంచ్లు పాలకమండలి సభ్యులు గ్రామ అధికారులు నిర్వహించాలని అన్నారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమాకాంత్ ఎమ్మార్వో సుజాత ఎంపీ ఓ రత్నాకర్ రావు ఎంఈఓ సంధ్యారాణి సిడిపిఓ శ్రీలత ఆసూరి రమాదేవి జీఎల్వి ప్రసాద్ మురళి తదితర ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.



## ఆధునిక యంత్రాలతో వ్యవసాయ పనులు సులువు

– జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ జిల్లా ప్రతినిధి, ఎప్రిల్ 1, (ప్రజాజ్యోతి) :** వ్యవసాయ పనుల్లో ఆధునిక యంత్రాల వాడకం వల్ల వ్యవసాయ పనులు సులభతరం అవుతాయని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మంగళవారం కలెక్టరేట్ ప్రాంగణంలో, సారంగాపూర్ మండలం కౌట్ల (బి) రైతు సంఘానికి 3 లక్షల 50 వేల సబ్సిడీతో మంజూరైన డ్రోన్, పనిముట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వ్యవసాయ పనుల్లో ఆధునిక వ్యవసాయ పనిముట్లు భాగస్వామ్యం చేయడం వల్ల రైతులు ఎంతో లాభం పొందుతారని, పనులు అన్ని తక్కువ కాలంలో, తక్కువ శ్రమతో పూర్తవుతాయని పేర్కొన్నారు. దీనివల్ల రైతుకు సమయం, డబ్బు ఆదా అవుతాయని అన్నారు. మరింతమంది రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, హార్టికల్చర్ అధికారి రమణ, ఇతర అధికారులు, రైతులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మిత్రుల ఔదార్యం



**దండేపల్లి, ఏప్రిల్ 1 (ప్రజాజ్యోతి) :** మండలం లోని మామిడిపల్లి గ్రామానికి చెందిన రంగు సామ్రాట్ ఇటీవల గుండె పోటుతో అకాల మరణం పొందాడు. అతనిది నిరుపేద కుటుంబం పైగా అతనికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారి భవిష్యత్ కోసం అతని మిత్రుడు శీనునాయక్ ఆధ్వర్యంలో, తెలంగాణ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ అసోసియేషన్ ఆధ్వర్యంలో దాతల నుంచి రూ.6,61, 203 విరాళాలు సేకరించాడు.. సేకరించిన మొత్తాన్ని సామ్రాట్ భార్య శైలజకు బుధవారం అందించారు..వీరితో పాటు..అతనితో పదోతరగతి చదివిన మిత్రులు కూడా ఆర్థిక సహాయం అందిచనున్నారు..పెద్ద మొత్తం లో మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన మిత్రులను పలువురు అభినంధించారు.

## 24 గంటల నిరవధిక దీక్ష గోడ ప్రతులు విడుదల

**మంచిర్యాల, ఏప్రిల్ 1 (ప్రజా జ్యోతి) :** మంచిర్యాల పట్టణంలోని బాయ్స్ హైస్కూల్ గ్రౌండ్లో ఈ నెల 7వ తేదీన నిర్వహించనున్న 24 గంటల నిరవధిక దీక్షకు సంబంధించిన గోడ ప్రతులను జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గత 40 సంవత్సరాలుగా దేశం, రాష్ట్రంలో బీసీల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నిరంతరం ఉద్యమాలు కొనసాగుతున్నప్పటికీ, దేశాన్ని ఎక్కువ కాలం పాలించిన కాంగ్రెస్ పార్టీగానీ, ప్రస్తుతం అధికారంలో ఉన్న బీజేపీ గానీ, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ గానీ బీసీల సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యాయని విమర్శించారు. ఇప్పటికైనా బీసీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మంచిర్యాల జిల్లాలోని బీసీ కులాలు, బీసీ వాదులు ఈ దీక్షకు పెద్ద ఎత్తున సంఘీభావం తెలియజేసి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గుమ్ముల శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు గజ్జెల్లి వెంకటయ్య, తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షులు మహేష్ వర్మ, వేముల అశోక్, మంచెర్ల సదానందం, చెలిమెల అంజయ్య, రామగిరి రాజన్న చారి తదితరులు పాల్గొన్నారు.

## "సలేశ్వరం జాతరకు.. ఐదు క్వింటల్ బియ్యం వితరణ"

- 18 సంవత్సరాల నుంచి శ్రీనివాస చారిటబుల్ ట్రస్ట్‌కి అందజేస్తున్నాం
- కౌన్సిలర్ సుంకరి నిర్మల బాలరాజ్



**అచ్చంపేట ఏప్రిల్ 1 (ప్రజా జ్యోతి)** నాగర్ కర్నూల్ జిల్లా తెలంగాణ రాష్ట్ర అమర్నాథ్ యాత్రగా ప్రసిద్ధి చెందిన.. సల్లేశ్వరం జాతరకు అచ్చంపేట కౌన్సిలర్ సుంకరి నిర్మల బాలరాజ్ 5 కింటల్లా బియ్యాన్ని ట్రస్ట్ కి అందజేశారు. బుధవారం ఈ సందర్భంగా సుంకరి నిర్మల బాలరాజ్ మాట్లాడుతూ సలేశ్వరం జాతరకు వెళ్లే భక్తుల అన్నదానం కొరకు 18 సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం ఐదు కింటల్లా బియ్యానికి అన్నదాన కార్యక్రమానికి నాగర్ కర్నూల్ ట్రస్ట్ అధినేత శ్రీనివాస్ కి ఇవ్వడం జరుగుతుందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. అందులో భాగంగానే అచ్చంపేట పట్టణంలో శ్రీనివాస్ కి సలేశ్వరం జాతర నేపథ్యంలో ఐదు కింటల బియ్యాన్ని ఆయనకు అందజేశారు. తమకు శివుని పైన అపర ప్రేమ ఉందని తద్వారా ప్రతిరోజు ఉదయాన్నే దినచర్యలో భాగంగా అచ్చంపేట పట్టణంలోని శివాలయాలను సందర్శించిన అనంతరం వేరే కార్యక్రమాలు చూసుకుంటానని కౌన్సిలర్ సుంకరి నిర్మల బాలరాజు వ్యాఖ్యానించారు. అదేవిధంగా అచ్చంపేట పుర పరిధిలోని పురాతన ఆలయాలను వెలుగులోకి తీసుకొని వస్తున్నానని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సుంకరి నిర్మల బాలరాజ్ ట్రస్టు చైర్మన్ శ్రీనివాస్, కాలనీవాసులు సుంకరి లింగం, సుందరి మహేష్ కాలనీవాసులు భక్తులు తదితరులు ఉన్నారు

## మహబూబ్‌నగర్ జిల్లాలో నెలరోజుల పాటు 30, 30(ఎ) పోలీస్ యాక్ట్ అమలు

- అనుమతి లేకుండా ధర్నాలు, ర్యాలీలపై నిషేధం - ఎస్పీ జానకి హెచ్చరిక



**మహబూబ్‌నగర్, ఏప్రిల్ 1 (ప్రజా జ్యోతి బ్యూరో):** జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా ఏప్రిల్ 1 నుండి 30వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా 30, 30(ఎ) పోలీస్ యాక్ట్--1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ ధరవత్ జానకి ప్రకటించారు. ఈ సందర్భంగా ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగులు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే చర్యలు, ప్రజా ఆస్తులకు నష్టం కలిగించే కార్యక్రమాలు పూర్తిగా నిషేధమని హెచ్చరించారు. అనుమతి లేకుండా ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా ప్రజలు పోలీసులకు సహకరించి శాంతి భద్రతల పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఎస్పీ కోరారు.

## నాణ్యత లోపంతో సీసీరోడ్ల నిర్మాణం

- అభివృద్ధి పేరుతో ప్రజా ధనం వృధా, పాలకుల నిర్లక్ష్యమే ప్రధాన కారణం







**మల్దకల్ ఏప్రిల్ 01(ప్రజా జ్యోతి):**మల్దకల్ మండలంలోని ఉలిగేపల్లి గ్రామంలో పాలకుల నిర్లక్ష్యంతో గ్రామంలో నిర్మించిన సిసి రోడ్ల నాణ్యత తీవ్రంగా లోపించిందని నడిగడ్డ హక్కుల పోరాట సమితి గ్రామ నాయకులు ఆరోపించారు. అభివృద్ధి పేరుతో ప్రజాధనాన్ని పాలకులు వృధా చేస్తున్నారని గత రెండు రోజుల క్రితం గ్రామంలో నాణ్యత లేని సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టారని మండిపడ్డారు. నాసిరకం మెటీరియల్ తో రోడ్లు వేసిన రెండు రోజులకే కంకర తేలిపోవడం, పగుళ్లు వచ్చి నాణ్యత లోపించిందన్నారు. దీంతో గ్రామంలో ఎలాంటి నాణ్యత లేకుండా హడావుడిగా రోడ్ల నిర్మాణం పనులు ముగించడం వారి పాలనకు ఇదే నిదర్శనం అని తెలిపారు. నాసిరకం రోడ్లు వేయడం ద్వారా గ్రామంలో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని వెంటనే ఈ విషయంపై జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి గ్రామ నాయకులు లక్ష్మన్న, భూపతి నాయుడు, ఆశన్న, తిమ్మప్ప, తదితరులు పాల్గొన్నారు.

## శిలాఫలకం కే పరిమితమైన 51లక్షల రూపాయల



**కొల్లాపూర్ ఏప్రిల్ 1 ప్రజా జ్యోతి** గత సంవత్సరం గాజ సబ్ ప్లాన్ నిధుల కింద 51 లక్షల రూపాయలు మంజూరు అయినవి వాటిని మంత్రి జూపల్లి కృష్ణారావు గాజ కాలనీకీ వచ్చి శంకుస్థాపన చేయడం జరిగింది, కానీ ఇప్పటికీ 51 లక్షల రూపాయలో ఒక్క రూపాయి కూడ ఖర్చు చేయలేదు ఒక్క పని కూడా గాజ కాలనీలో ఈ మధ్య కాలంలో సబ్ ప్లాన్ నిధులను టెండర్ వర్క్ అన్నీ మార్చి నెల పోతే మళ్లీ బిల్లులు రావు. అన్నే ఉద్దేశంతో ప్రజలను గ్రామంలో నిమ్మించడం కోసం కాంగ్రెస్ పార్టీ నాయకులు హడావుడి చేస్తున్నారు అందులో భాగంగా ఇంకో కొత్త ప్రస్తావన మొదలుపెట్టిన ఇండిపెండెంట్ గ్రామ సర్పంచి మరియు నాయకులు, నేను ప్రతి వాడ్డులో అండర్ డ్రైనేజీ చేసిన తర్వాతనే సీసీ రోడ్ల నిర్మాణం జరగాలని మాట్లాడుతున్నారు. ఒక్క పక్క కాంగ్రెస్ పార్టీ నాయకులు సీసీ రోడ్ల నిర్మాణశీ చేస్తాం అంటున్నారు మరో పక్క సర్పంచ్ వద్దు మేము అండర్ డ్రైనేజీ వేసిన తర్వాతనే సిసి రోడ్లు వేయాలని, వీరిద్దరి మధ్యలో గ్రామ అభివృద్ధి దూరం అవుతుందని ప్రజలు మరి గాజ కాలనీ వాసులు అంటున్నారు. అండర్ డ్రైనేజ్ వేస్తా అని చెప్తున్నా నాయకుడు మాకు వీలు ఉన్నప్పుడు డ్రైనేజ్ పనులు చేస్తానని మాట్లాడుతున్నాడు, మరొక్క పక్కనేమో కాంగ్రెస్ పార్టీ నాయకులు సిసి రోడ్డు వేస్తాం కానీ గ్రామ సర్పంచి మాకు గ్రామ పంచాయతీ నుంచి తీన్మానం ఇస్తలేరు అన్నీ కాంగ్రెస్ పార్టీ నాయకులు అంట్టున్నారు. అన్నీ హిట్ల ఈ విధశీగా ఒక్కరి మీద ఒకరు మాట్లాడడం జరుగుతుంది, కాబట్టి ఇండిపెండెంట్ నాయకుడు కాంగ్రెస్ పార్టీ ఇద్దర్ నాయకులు ఒక్కటే అన్ని ప్రజలు గుర్తుంచుకోవాలి. ఇట్టి గాజ గూ సబ్ ప్లాన్ నిధులతో ఇప్పుడన్నా కాలనీ అభివృద్ధి జరిగే విధంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మరియు అధికారులు ప్రత్యేక చొరవతో తీసుకొని పనులు జరిగే విధంగా దృష్టి పెట్టాలని గ్రామ ప్రజలు కోరారు.

## గ్రామ, వార్డు సభలు విజయవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**గద్వాల ఏప్రిల్ 01(ప్రజా జ్యోతి ప్రతినిధి):** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 2న నిర్వహించనున్న గ్రామ,వార్డు సభలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత అధికారులకు పిలుపునిచ్చారు. బుధవారం జిల్లాలోని అన్ని మండలాల ప్రత్యేక అధికారులు,తహసీల్దారులు,మండల అభివృద్ధి అధికారులు,పురపాలక సంఘాల కమిషనర్లు తదితరులతో గూగుల్ మీట్ ద్వారా ఆయన సమీక్ష నిర్వహించారు. షెడ్యూల్ ప్రకారం గ్రామ,వార్డు సభలను ఉదయం 9 గంటలకు ప్రారంభించాలని,సభలకు హాజరయ్యే ప్రజా ప్రతినిధులు,ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సభల్లో సంబంధిత శాఖల అధికారులు,మహిళా సంఘాల సభ్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. అమల్లో ఉన్న సంక్షేమ పథకాలతో పాటు ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన కొత్త పథకాలు,అభివృద్ధి పనులపై ప్రజలకు వివరాలు తెలియజేయాలని సూచించారు. ఆయా పథకాల లబ్ధిదారుల వివరాలను ఇప్పటికే మండలాలకు పంపించినందున వాటిని సభల్లో వెల్లడించాలన్నారు. కొంతమంది లబ్ధిదారులతో ప్రత్యక్షంగా మాట్లాడించి,వారి అభిప్రాయాలను సేకరించాలని సూచించారు. బాల్య వివాహాలు వంటి సామాజిక సమస్యలపై కూడా చర్చించాలన్నారు. సభల్లో ప్రజలు ప్రస్తావించే సమస్యలను నమోదు చేసి,పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**వేసవిలో తాగునీటి సమస్యల నివారణకు చర్యలు**

వేసవి కాలంలో జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో వృద్ధులు, చిన్నారులు ఇబ్బంది పడకుండా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచి,వడదెబ్బ బాధితులకు తక్షణ వైద్య సహాయం అందించాలని సూచించారు. దాతల సహకారంతో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని,గ్రామ పంచాయతీలు, పురపాలక సంఘాల్లో పనిచేస్తున్న మల్టీపర్పస్ కార్మికులు పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ చేసుకునేలా ప్రోత్సహించాలని తెలిపారు. 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైళ్ల క్లియరెన్స్,పరిశుభ్రత చర్యలను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. గురుకుల పాఠశాలలు,వసతి గృహాలను తరచూ సందర్శించి పర్యవేక్షణ చేయాలని మండల అధికారులకు సూచించారు. జనాభా గణనకు సంబంధించిన శిక్షణ ఇప్పటికే పూర్తయ్యిందని,ప్రభుత్వం నిర్దేశించిన విధి విధానాల ప్రకారం ముందుకు సాగాలని అన్నారు. ప్రజలకు సేవలందించడంలో అధికారులు ఎల్లప్పుడూ ముందుండాలని,జిల్లా యంత్రాంగం తరపున అవసరమైన సహకారం అందిస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు,జిల్లా పంచాయతీ అధికారి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## మహాలక్ష్మీ పథకం - మహిళల ప్రయాణ స్వేచ్ఛకు మార్గదర్శి







**గద్వాల ఏప్రిల్ 01(ప్రజా జ్యోతి ప్రతినిధి):** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేసిన మహాలక్ష్మి పథకం మహిళల జీవితాల్లో గణనీయమైన మార్పులు తీసుకొచ్చింది. ఆరు గ్యారంటీలలో భాగంగా మహిళలకు రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడి నుంచైనా ఎక్కడికైనా ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం ద్వారా వారి ముఖాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

**కోట్లాది ప్రయాణాలతో ముందుకు**

మహాలక్ష్మి పథకం అమలులోకి వచ్చిన తర్వాత ఆర్టీసీ బస్సులు మహిళలతో నిండిపోతున్నాయి. పేద,మధ్యతరగతి మహిళలకు ఈ పథకం గొప్ప వరంగా మారింది. గతంలో ఆర్థిక ఇబ్బందుల వల్ల బంధువుల ఇళ్లకు వెళ్లలేకపోయిన వారు ఇప్పుడు స్వేచ్ఛగా ప్రయాణిస్తున్నారు. పుణ్యక్షేత్రాలకు వెళ్లే వారి సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది.

**గద్వాల జిల్లాలో 1.73 కోట్ల ప్రయాణాలు**

ఈ ఏడాది మార్చి 31 నాటికి జోగులాంబ గద్వాల జిల్లాలో 1 కోటి 73 లక్షల 16 వేల మంది మహిళలు పల్లె వెలుగు,ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని వినియోగించుకున్నారు. టీజీఎస్ఆర్టీసీ జారీ చేసిన జీరో టికెట్ల ద్వారా రూ. 62.80 కోట్ల విలువైన ప్రయాణాన్ని మహిళలు ఎలాంటి చార్జీలు లేకుండా చేశారు.

**సత్సంబంధాలకు బలం**

ఈ పథకం వల్ల మహిళలు బంధువులు,స్నేహితులతో కలిసి పుణ్యక్షేత్రాలు, విహారయాత్రలు,విద్యా పర్యటనలకు వెళ్లే అవకాశం పొందుతున్నారు. దీంతో వారి మధ్య సత్సంబంధాలు మరింత బలపడుతున్నాయి. ధరూర్‌లో పనిచేస్తున్న విజయలక్ష్మి మాట్లాడుతూ,"ఇప్పుడు ఎప్పుడైనా మా ఊరు అచ్చంపేటకు ఉచితంగా,సురక్షితంగా ప్రయాణించగలుగుతున్నాను. ఇది మా వంటి ఉద్యోగినులకు ఎంతో ఉపయోగకరం"అని అన్నారు.

**సురక్షిత ప్రయాణం - మహిళల ఆనందం**

గద్వాల మండలం రేపల్లెకు చెందిన డి.వి.లక్ష్మి మాట్లాడుతూ,"ప్రైవేట్ వాహనాల కంటే ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించడం ఇప్పుడు సురక్షితంగా అనిపిస్తోంది. ఉచిత ప్రయాణ సౌకర్యం ఎంతో ఉపయుక్తంగా ఉంది"అని తెలిపారు.

**అన్ని వర్గాలకు లాభం**

రాజోలి మండలం తాండ్రపాడు గ్రామానికి చెందిన మాణిక్యమ్మ మాట్లాడుతూ, "వృద్ధులకు కూడా ఈ పథకం ఎంతో ఉపయోగపడుతోంది. తీర్థయాత్రలు,బంధువుల ఇళ్లకు వెళ్లడం సులభమైంది. ఖర్చులు కూడా ఆదా అవుతున్నాయి"అని తెలిపారు. మొత్తంగా మహాలక్ష్మి పథకం మహిళల ఆర్థిక భారం తగ్గించడమే కాకుండా,వారి సామాజిక జీవనాన్ని విస్తరింపజేస్తూ ప్రజా సంక్షేమంలో కీలక పాత్ర పోషిస్తోంది. (ముకుందరావు)

## ఆన్‌లైన్ ఇసుక విధానం కఠినంగా అమలు

- కలెక్టర్ ఖుష్బూ గుప్తా హెచ్చరికలు - మూసాపేట్ మండలంలో విస్తృత పర్యటన, పలు శాఖల తనిఖీలు





**మహబూబ్‌నగర్, ఏప్రిల్ 1 (ప్రజా జ్యోతి బ్యూరో) :** జిల్లాలో ఇసుక బుకింగ్, సరఫరా పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోనే నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా స్పష్టం చేశారు. ఏప్రిల్ 1 నుండి మాన్యువల్ కూపన్‌ల జారీ పూర్తిగా నిషేధమని, ఎవరైనా ఉల్లంఘిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బుధవారం మూసాపేట్ మండలంలో విస్తృత పర్యటన నిర్వహించిన కలెక్టర్, ముందుగా తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి "మన ఇసుక వాహనం" ద్వారా ఇసుక బుకింగ్ ప్రక్రియను పరిశీలించారు. భూ భారతి దరఖాస్తులపై సమీక్ష నిర్వహించి పెండింగ్‌లో ఉన్న సమస్యలను నిర్ణీత గడువులో పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. తదుపరి మండల కేంద్రంలోని చౌకధర దుకాణాన్ని సందర్శించి లబ్ధిదారులతో మాట్లాడి సన్నబియ్యం నాణ్యతపై సమాచారం తెలుసుకున్నారు. బియ్యం నాణ్యత సంతృప్తికరంగా ఉందని లబ్ధిదారులు తెలియజేశారు. ఏప్రిల్, మే, జూన్ నెలల ఉచిత బియ్యం పంపిణీ ఏప్రిల్ 30 వరకు కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు. ఇందిరమ్మ పథకం కింద నిర్మిస్తున్న ఇళ్లను పరిశీలించిన కలెక్టర్, లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణ పురోగతి, బిల్లుల చెల్లింపులపై వివరాలు తెలుసుకున్నారు. పోల్కంపల్లి లో ఇసుక రీచ్ తనిఖీ పోల్కంపల్లి గ్రామంలోని ఇసుక రీచ్‌ను సందర్శించిన కలెక్టర్, ఇసుక కేటాయింపు, రవాణా విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. రోజువారీ బుకింగ్స్, రవాణా చార్జీలు, కార్మికులకు చెల్లింపులు వంటి అంశాలపై అధికారులను ప్రశ్నించారు. అక్రమ తవ్వకాలకు ఎలాంటి అవకాశం లేకుండా కట్టుదిట్టంగా పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు.

**ఎరువుల దుకాణం తనిఖీ -- రైతులకు భరోసా**

పోల్కంపల్లి పి.ఏ.సి.ఎస్ ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేసిన కలెక్టర్, యూరియా ఆన్లైన్ బుకింగ్ యాప్‌పై వివరాలు తెలుసుకున్నారు. రైతులకు ఎరువులు సమయానికి అందుతున్నాయా, నిల్వలు సరిపోతున్నాయా అనే అంశాలను పరిశీలించారు. సరఫరాలో ఎలాంటి లోపాలు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించి, అన్ని వివరాలను క్రమం తప్పకుండా నమోదు చేయాలని సూచించారు. ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ హరిప్రియ, ఆర్డీవో నవీన్, పౌర సరఫరాల అధికారులు, మైన్స్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాదుల రక్షణ చట్టం బిల్లు ఆమోదం


- సీఎం చొరవకు న్యాయవాదుల కృతజ్ఞతలు
- పాదయాత్ర ఫలితం సాధించిన న్యాయవాదుల పోరాటం



**మహబూబ్‌నగర్, ఏప్రిల్ 1 (ప్రజా జ్యోతి బ్యూరో):** న్యాయవాదుల రక్షణ చట్టం బిల్లు శాసనసభలో ఆమోదం పొందడం న్యాయవాదుల దీర్ఘకాల పోరాటానికి ఫలితమని మహబూబ్‌నగర్ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు అనంతరెడ్డి పేర్కొన్నారు. బుధవారం మహబూబ్‌నగర్ బార్ అసోసియేషన్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. న్యాయవాదుల పాదయాత్రకు స్పందించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో ఈ బిల్లు కేబినెట్‌లో ఆమోదం పొందిన తరువాత మార్చి 30న శాసనసభలో అన్ని పక్షాల మద్దతుతో ఆమోదించబడిందని తెలిపారు. రాష్ట్రంలోని న్యాయవాదుల తరఫున ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో అలంపూర్ న్యాయవాదుల సంఘం చేపట్టిన పాదయాత్ర ఈ చట్టం సాధనలో కీలక పాత్ర పోషించిందన్నారు. నవంబర్ 9, 2025న ప్రారంభమైన పాదయాత్ర నవంబర్ 14న భూత్పూర్ చేరిందని, ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యేలు మద్దతు తెలుపుతూ చట్టం తీసుకురావడంలో సహకరిస్తామని హామీ ఇచ్చారని వివరించారు. తదనంతరం రెండో విడత పాదయాత్ర భూత్పూర్ నుండి సెక్రటేరియట్ వరకు కొనసాగించి, ఫిబ్రవరి 27న ముఖ్యమంత్రిని కలిసి వినతి పత్రం సమర్పించామని తెలిపారు. ఆ తరువాత కేబినెట్ ఆమోదంతో పాటు శాసనసభలో కూడా బిల్లు ఆమోదం పొందిందన్నారు. ఈ చట్టం ప్రకారం న్యాయవాదులపై దాడులు జరిగితే నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేయడంతో పాటు, డీఎస్పీ స్థాయి అధికారి విచారణ చేపట్టేలా నిబంధనలు ఉన్నాయని తెలిపారు. న్యాయవాదులకు అవసరమైనప్పుడు పోలీస్ రక్షణ కల్పించే విధంగా చట్టం రూపొందించబడిందని చెప్పారు. గవర్నర్ ఆమోదం అనంతరం ఈ చట్టం అమల్లోకి రానుంది. ఈ సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీధర్ రావు, ఉపాధ్యక్షుడు వెంకటయ్య, సంయుక్త కార్యదర్శి నాగోజి, మీడియా ప్రతినిధి తగిలి కృష్ణ, కార్యవర్గ సభ్యుడు రాఘవేందర్, సీనియర్ మహిళ న్యాయవాది ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# శిథిలావస్థలో పరకాల గ్రంథాలయం

**- సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే రేవూరి**



**పరకాల, ఏప్రిల్ 01, (ప్రజా జ్యోతి) :** హనుమకొండ జిల్లా పరకాల పట్టణంలోని ప్రభుత్వ గ్రంథాలయం శిథిలావస్థకు చేరుకుని విద్యార్థులు, నిరుద్యోగుల్లో ఆందోళన కలిగిస్తోంది. పాత భవనం కావడంతో పైకప్పు పెచ్చులు ఊడిపడుతూ ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని భయం నెలకొంది. రోజుకు సుమారు 300 మందికిపైగా పాఠకులు వినియోగిస్తున్న ఈ గ్రంథాలయానికి సరైన సౌకర్యాలు లేకపోవడం సమస్యగా మారింది.

కొత్త భవనం నిర్మించాలని గతంలో పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ పరిష్కారం లేకపోవడంతో మంగళవారం విద్యార్థులు, నిరుద్యోగులు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డిని కలిశారు. బొచ్చు రాజు స్వేరో ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేసి గ్రంథాలయాన్ని పాత మున్సిపల్ కార్యాలయానికి తరలించాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్, సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశాలు ఇచ్చారు. పాత మున్సిపల్ కార్యాలయంలో డిజిటల్ లైబ్రరీ, వైఫై సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఈ నిర్ణయంపై విద్యార్థులు, నిరుద్యోగులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. పోటీ పరీక్షలకు అనుగుణంగా కొత్త పుస్తకాలు అందుబాటులోకి తేవాలని, శాశ్వతంగా ఆధునిక గ్రంథాలయ భవనం నిర్మించాలని పాఠకులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్యాలయంలో త్రైత శకం కాలసూచిక ఆవిష్కరణ

**- డిప్యూటీ కమిషనర్ రాముల సునీత చేతుల మీదుగా ఆవిష్కరణ**





**హనుమకొండ, ఏప్రిల్ 01 (ప్రజా జ్యోతి) :** హనుమకొండ దేవాదాయ ధర్మాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో త్రైత శకం కాలసూచికను డిప్యూటీ కమిషనర్ రాముల సునీత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, త్రైత శకం కాలసూచికలో ఆధ్యాత్మిక అంశాలను సమగ్రంగా, సరళమైన భాషలో పొందుపరిచినట్లు తెలిపారు. శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు అందించిన జ్ఞానం ఇందులో విశదంగా వివరించబడిందని పేర్కొన్నారు. జీవాత్మ, ఆత్మ, పరమాత్మల విశిష్టతలను స్పష్టంగా వివరిస్తూ, "యుగాది" అనే పదం "ఉగాది"గా ఎలా మారిందో అర్థసహితంగా వివరించారని స్వామివారిని కొనియాడారు. అలాగే చైత్రమాసం నుండి ఫాల్గుణమాసం వరకు తెలుగు సంప్రదాయ కాలమానాన్ని ప్రతిబింబించే విధంగా ఈ కాలసూచిక రూపొందించ బడినందుకు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీసీ కార్యాలయ సూపరింటెండెంట్ గౌరీ శంకర్, ఏసీ కార్యాలయ సూపరింటెండెంట్ కుమారస్వామి, ఇందు జ్ఞాన వేదిక ఎల్కతుర్తి శాఖ అధ్యక్షులు సదానిరంజన్ సిద్ధాంతి, సభ్యులు రాకేష్, స్రవంతి, రాణి, క్షేత్రగ్న, దివిజ, తనుష, ఋషి, మోక్షజ్ఞ తదితర అధికారులు పాల్గొన్నారు.

# మాజీ జెడ్పిటిసి వంగాల యాకమ్మ మృతి బిఆర్ఎస్ పార్టీకి తీరనిలోటు

**- రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు**



**రాయపర్తి ఏప్రిల్ 01 ప్రజా జ్యోతి :** మాజీ జడ్పీటీసీ వంగళ యాకమ్మా పార్థివా దేహానికి నివాళ్లు అర్పించి, కన్నీటి పర్యాంతం అయిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు .వరంగల్ జిల్లా రాయపర్తి మండలం కోలన్ పల్లి గ్రామంలో రాయపర్తి మండల మాజీ జడ్పీటీసీ వంగళ యాకమ్మా బుధవారం ఉదయం గుండె పోటుతో మరణించగా వారి పార్థివా దేహానికి పూల మాల వేసి, ఘనంగా నివాళ్లు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించిన రాష్ట్ర మాజీ మంత్రివర్యులు, పాలకుర్తి బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జఎర్రబెల్లి దయాకర్ రావు ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# గుంటుపల్లి లచ్చమ్మ మృతికి ఘనంగా నివాళులర్పించిన బిఆర్ఎస్ నాయకులు



**రాయపర్తి ఏప్రిల్ 01 ప్రజా జ్యోతి :** వరంగల్ జిల్లా రాయపర్తి మండలం బురాన్ పల్లి గ్రామంలోగ్రామ పార్టీ ప్రధాన కార్యదర్శి గుంటిపల్లి కిషన్ అమ్మమ్మ గుంటిపల్లి లచ్చమ్మ బుధవారం అనారోగ్యంతో మరణించగా రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు వారి పార్థివదేహానికి పూల మాల వేసి, నివాళ్లు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి రాయపర్తి మండల మాజీ జడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు,మండల పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షులు గుగులోత్ జాజు నాయక్, మండల పార్టీ నాయకులు లేతకుల రంగా రెడ్డి, ఐత రామ్ చందర్, గజావెల్లి ప్రసాద్, సంకినేని ఎల్లస్వామి,తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో సేవా స్ఫూర్తి పెంపు లక్ష్యంగా నిత్యావసరాల పంపిణీ






**హసన్‌పర్తి, ఏప్రిల్ 1 (ప్రజాజ్యోతి) :** హసన్‌పర్తి మండల కేంద్రంలోని సుజాత విద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో బుధవారం మానసిక వికలాంగుల అనాథాశ్రమానికి సుమారు 1500 కిలోల నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆకుతోట శాంతారాం కర్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ అన్నదానం అన్నింటికంటే గొప్పదని తెలిపారు. ప్రతి ఏడాది కూరగాయల ఉత్సవం సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి కూరగాయలు, బియ్యం తదితర నిత్యావసరాలను సేకరించి వివిధ ఆశ్రమాలకు అందజేస్తున్నామని చెప్పారు. ఈసారి వినూత్నంగా మానసిక వికలాంగులను పాఠశాలకు ఆహ్వానించి విద్యార్థులకు ప్రత్యక్ష అవగాహన కల్పించామని పేర్కొన్నారు. విద్యార్థుల్లో సేవాభావం చిన్ననాటి నుంచే పెంపొందించడమే లక్ష్యమని తెలిపారు.

అలాగే ప్రకృతి, పర్యావరణంపై అవగాహన కల్పించేందుకు పాఠశాలలో పలు కార్యక్రమాలు చేపడుతున్నామని, విద్యార్థులకు చదువుతో పాటు జీవన నైపుణ్యాలు పెంపొందించేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. మానసిక వికలాంగుల ఆశ్రమ నిర్వాహకులు మాట్లాడుతూ గత రెండు దశాబ్దాలుగా సుమారు 70 మంది వికలాంగులను సంరక్షించి వారికి విద్య అందించి స్వయం జీవనానికి సిద్ధం చేయడం విశేషమని పేర్కొన్నారు. నిర్వాహకురాలు సుజాత సేవలను ప్రశంసించారు. ఆశ్రమ నిర్వాహకురాలు సుజాత మాట్లాడుతూ గత పదిహేనేళ్లుగా ఈ పాఠశాల విద్యార్థులు ఆశ్రమానికి సహాయం అందిస్తున్నారని తెలిపారు. ఈసారి ఆశ్రమ వాసులను పాఠశాలకు ఆహ్వానించి ప్రత్యక్షంగా పరిచయం చేయడం ప్రత్యేకమని పేర్కొంటూ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప ప్రధానోపాధ్యాయులు గూడూరు లక్ష్మీనారాయణతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# అమెరికా సంస్థతో కిట్స్‌కు అవగాహన ఒప్పందం



**హసన్‌పర్తి, ఏప్రిల్ 1(ప్రజాజ్యోతి) :**
వరంగల్ కాకతీయ సాంకేతిక విజ్ఞాన సంస్థ విద్యా ప్రాముఖ్యతను మరింత విస్తరించేందుకు అమెరికాకు చెందిన సంస్థతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు పరిశ్రమల ఆధారిత శిక్షణ, ఆవిష్కరణలకు అవకాశాలు కల్పించనున్నట్లు ప్రిన్సిపాల్ అశోకరెడ్డి తెలిపారు. అమెరికాకు చెందిన సంస్థ వ్యవస్థాపకుడు, ఇదే కళాశాల పూర్వ విద్యార్థి అవినాష్ పులి ఆధ్వర్యంలో ఈ ఒప్పందం కుదిరింది. తయారీ, సమాచార సాంకేతికం, ఔషధ రంగం తదితర విభాగాల్లో విశాల అనుభవం కలిగిన ఆయన పలు అంతర్జాతీయ సంస్థల్లో పనిచేసి సాంకేతిక అభివృద్ధికి తోడ్పడ్డారని వివరించారు. ఈ సందర్భంగా

**ముగ్గురు విద్యార్థులకు శిక్షణ నియామక పత్రాలు**

ఆవిష్కరణ, పరిశోధన, వ్యాపార అభివృద్ధి కేంద్రం ఆధ్వర్యంలో కొత్త కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారు. ఈ కేంద్రం ద్వారా విద్యార్థులకు ఆలోచనలను కార్యరూపంలోకి తీసుకురావడం, పరిశ్రమ నిపుణుల మార్గదర్శకత్వం పొందడం, వాస్తవ సమస్యలకు పరిష్కారాలు కనుగొనడం వంటి అవకాశాలు లభించనున్నాయి. కార్యక్రమంలో భాగంగా ముగ్గురు విద్యార్థులకు శిక్షణ నియామక పత్రాలను అవినాష్ పులి అందజేశారు. ప్రణతి రెడ్డి గుడిపాటి, శ్రీనికేత్ నూక, హర్షిత్ సుతారి ఈ అవకాశాన్ని పొందారు. ఈ సహకారం ద్వారా కృత్రిమ మేధస్సు, యాంత్రికీకరణ వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాల్లో విద్యార్థులకు ప్రత్యక్ష అనుభవం కల్పించడం ప్రధాన లక్ష్యమని అవినాష్ పులి తెలిపారు. పూర్వ విద్యార్థుల సహకారంతో ప్రస్తుత విద్యార్థులను సమాజానికి ఉపయోగపడేలా తీర్చిదిద్దడంలో ఈ కార్యక్రమం దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధికారులు, పూర్వ విద్యార్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం



**నర్సంపేట ఏప్రిల్ 1 (ప్రజా జ్యోతి) :** నర్సంపేట మున్సిపల్ పరిధి మహేశ్వరంలోని అంగన్వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ నర్సంపేట ప్రాజెక్ట్ సీపీడీఓ మధురిమ ఆధ్వర్యంలోఅంగన్వాడి పిల్లల తల్లులతో వంటల పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మి రామానంద్ ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ గారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గర్భిణీ బాలింత స్త్రీలతోపాటు ప్రీస్కూల్ పిల్లలకు కూడా ప్రతిరోజు పాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని.. దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలు పిల్లలకు అందజేయడం ద్వారా నేటి ఆరోగ్యవంతమైన పిల్లలు రేపటి ఆరోగ్యవంతమైన పౌరులుగా తీర్చిదిద్దబడతారని తెలిపారు. అదేవిధంగా అంగన్వాడి కేంద్రాలలో వంట గదుల పరిశుభ్రత, తాగునీటి శుద్ధి మరియు పరిసరాల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని అంగన్వాడి సిబ్బందికి సూచించారు. సీడీపీఓ మాట్లాడుతూ. అంగన్వాడీ కేంద్రంలో గర్భిణీగా నమోదైనప్పటినుండి 5 సంవత్సరాల పిల్లల వరకు పౌష్టికాహారం అందించడంతో పాటు ఆటపాటల విద్యను అందిస్తున్నామని.. ప్రతి అంగన్వాడీ కేంద్ర పరిధిలో గల పిల్లలను అంగన్వాడీ కేంద్రానికి వచ్చేటట్లు ఆల్మస్సీ కమిటీ చైర్మన్, సభ్యులు సహకారం అందించాలని కోరారు.. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫుడ్ ఎగ్జిబిషన్ ను మున్సిపల్ చైర్ పర్సన్ మరియు కౌన్సిలర్స్, సీడీపీఓ గార్లు పరిశీలించారు. అనంతరం వంటలు చేసిన పిల్లల తల్లులకి మున్సిపల్ చైర్ పర్సన్, సీడీపీఓ బహుమతులను ప్రధానం చేశారు.

అదేవిధంగా 14,15వ వార్డులోని మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ పారిజాతం, మున్సిపల్ కౌన్సిలర్స్ ఏపూరి శ్రీనివాస రెడ్డి, బుస శిరీష రాజు, శ్రీరామోజు రోజారాణి, పొన్నాల మనీష ప్రకాష్, అంగన్వాడీ టీచర్స్ నల్లా భారతి, రాధ, శిరీష, కవిత, రమ, సజాత, రాణి, అరుణ, సుశీల, పద్మ, కళ్యాణి, అంగన్వాడీ పిల్లల తల్లులు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**ఎస్సై పోచంపల్లి సతీష్**



**చిట్యాల (ప్రజా జ్యోతి) ఏప్రిల్ 1 :** సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న తరుణంలో సైబర్ నేరగాళ్లు తమదైన శైలిలో ప్రజలను మోసం చేస్తున్నారని వీటి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చిట్యాల ఎస్సై పోచంపల్లి సతీష్ హెచ్చరించారు. బుధవారం స్థానిక ప్రాథమిక వ్యవసాయ కేంద్రం ఆవరణంలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఎస్సై పలు సైబర్ నేరాలపై వివరిస్తూ డిజిటల్ అరెస్ట్ ఫ్రాడ్, ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్, రిమోట్ యాక్సెస్ యాప్ ఫ్రాడ్, బ్యాంకు కేవైసీ అప్డేట్ ఫ్రాడ్ లపై ప్రజలు అపరిచిత ఫోన్ కాల్స్ పై మాట్లాడరాదు అని అన్నారు, తక్కువ పెట్టుబడి ఎక్కువ లాభాలతో టెలిగ్రామ్ వాట్సాప్ గ్రూప్ ల ద్వారా వచ్చిన లింకులను ఓపెన్ చేయరాదని తెలిపారు, ఎనీ డిస్క్ టీం యువర్ వంటి యాప్లను సంబంధంలేని వ్యక్తులతో పంచుకోరాదని తెలిపారు, బ్యాంకు తదితర ఖాతాల నిమిత్తం ఓటిపి వంటివి అడిగినప్పుడు సమాచారం తెలుసుకొని అందించాలని సూచించారు. అనంతరం సీసీటీవీల ఏర్పాటుకు లారీ యూనియన్ ల సహకారం. నేరాల నియంత్రణకు సీసీటీవీ ల పాత్ర కీలకమైనదని ఎస్ఐ అన్నారు చిట్యాల లారీ యూనియన్ వారు తమ బాధ్యతగా 20 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు ముఖ్య ప్రదేశాల్లో సీసీ టీవీ కెమెరాల ఏర్పాటుకు వినియోగించనున్నట్లు ఎస్ఐ తెలిపారు. సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 నెంబర్‌కు కాల్ చేయాలని (సైబర్ గౌట్ ఇన్) వెబ్సైట్లోనైనా ఫిర్యాదు చేయాలని కోరారు.

# వైద్యులపై దాడులు సహించరాదు శాంతి భద్రతలకు విఘాతం కలిగించరాదు




**నర్సంపేట ఏప్రిల్ 1 (ప్రజా జ్యోతి) :** నర్సంపేట పట్టణంలోని వరంగల్ రోడ్డుకు గల వేద స్కానింగ్ సెంటర్ కి డాక్టర్ ములుగు సతీష్ రెఫర్ చేసిన కడుపు నొప్పితో బాధపడుతున్న ఒక అమ్మాయికి స్కానింగ్ చేసి రిపోర్టు ఇవ్వగా అట్టి రిపోర్టు తప్పుగా ఇచ్చారని ఆరోపిస్తూ తేదీ:22.03.2026 రోజున ఆ అమ్మాయి యొక్క కుటుంబ సభ్యులు నలుగురు వేద స్కానింగ్ సెంటర్ వద్దకు వచ్చి డాక్టర్ పై దాడి చేయగా అట్టి విషయంలో డాక్టర్ పై దాడి చేసిన మోడెం విద్యాసాగర్ ని నర్సంపేట పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించనైనది. వైద్యులపై దాడులు సహించం. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించం. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే తీవ్ర పరిమాణాలు తప్పవు అని తెలిపారు.

# నర్సంపేట మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం

**- మున్సిపల్ చైర్ పర్సన్ పెండం శ్రీ లక్ష్మి రామానంద్**

**నర్సంపేట ఏప్రిల్ 1 (ప్రజా జ్యోతి) :**
నర్సంపేట మున్సిపాలిటీలో విలీన గ్రామాలైన నాగుర్లపల్లి, పర్శునాయక్ తండా 16వ వార్డును మున్సిపల్ యంత్రాంగంతో సందర్శించిన మున్సిపల్ చైర్ పర్సన్ పెండం శ్రీలక్ష్మి రామానంద్ స్థానిక వార్డు కౌన్సిలర్ బానోతు నవీన్ నాయక్ గ్రామంలోని డంపింగ్ యార్డ్, బతుకమ్మ ఆడుటస్థలం, పల్లె దవాఖాన, మట్టి రోడ్లను, డ్రైనేజ్ వ్యవస్థను, వారు పరిశీలించారు. విలీనమైన గ్రామ ప్రజల ఫిర్యాదులను పరిష్కరించేందుకు మరియు పౌర సేవలను సమర్థవంతంగా అందించేందుకు మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరు అందిస్తామని. పారిశుధ్యం పట్ల ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేస్తామని.. అవసరమున్న చోట వీధి దీపాల ఏర్పాటు చేస్తామని..



పార్టీలకతీతంగా ఎలాంటి బేషజాలం లేకుండా 16వ వార్డు అభివృద్ధి కోసం కావాల్సిన నిధులను ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు ముఖ్యులు మేఘ్య నాయక్, శంకర్ నాయక్, క్రాంతి కుమార్, కొర్ర రాహుల్, కొర్ర రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

# సన్న బియ్యం పంపిణీలో పాల్గొన్న కౌన్సిలర్లు



**పరకాల, ఏప్రిల్ 01, (ప్రజా జ్యోతి):** దేశంలో ఎక్కడా లేనివిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం పేదవాడి ఆకలి తీర్చడానికి సన్న బియ్యం పథకం ప్రతి పేదవాడికి కడుపునిండా అన్నం పెడుతున్నటువంటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈనెలతో మూడు నెలల రేషన్ బియ్యాన్ని ఒకేసారి వేయడం జరుగుతుంది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డిలకు కౌన్సిలర్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరకాల మున్సిపాలిటీ కౌన్సిలర్లు కొయ్యడ శ్రీనివాస్, బండి శ్రీధర్, సుధమల్ల రమేష్, కాంగ్రెస్ నాయకులు స్వామి, బండి రాజేందర్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ఆక్రమణలోకి వెళ్లిన పాత బాట

**- పునరుద్ధరణకు రైతుల వినతి**



**హసన్‌పర్తి, ఏప్రిల్ 1 (ప్రజాజ్యోతి) :** హసన్‌పర్తి మండలం వంగపహాడ్ గ్రామ శివారు సర్వే నంబరు 324 నుంచి దామెర మండలం వెంకటాపురం గ్రామ హద్దుల వరకు పూర్వకాలంలో నక్షలో ఉన్న 33 అడుగుల బాట ప్రస్తుతం ఆక్రమణకు గురైనట్లు రైతులు తెలిపారు. ఈ బాటను తక్షణమే సర్వే చేసి హద్దులు నిర్ణయించి పునరుద్ధరించాలని వారు కోరారు. ఈ మేరకు వంగపహాడ్, భైరన్‌పల్లి, దామెర, వెంకటాపురం గ్రామాలకు చెందిన దాదాపు 50 మంది రైతులు హసన్‌పర్తి మండల తహసీల్దార్ పూజారి కిరణ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమానికి మండలంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు డాక్టర్ బండి రజినికుమార్ హాజరయ్యారు. రైతుల విజ్ఞప్తిపై స్పందించిన తహసీల్దార్ సంబంధిత రెవెన్యూ అధికారికి వెంటనే సర్వే నిర్వహించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జట్టి రవీందర్, రాజగోపాల్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, చేరలు, కుమార్, సారయ్య, రాజకుమార్, విక్రమ్, బిక్షపతి, రాజయ్య, రాజు, సూరయ్య, స్వామి, రవి తదితరులతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

# పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

**- అంగన్వాడీ కేంద్రంలో ఉత్సాహంగా వంటల పోటీలు**



**నెక్కొండ, ఏప్రిల్ 01 (ప్రజా జ్యోతి) :** మండల పరిధిలోని పనికర గ్రామంలో గల అంగన్వాడీ కేంద్రంలో శిశు అభివృద్ధి సేవల సంస్థ నర్సంపేట విభాగం ఆధ్వర్యంలో వంటల పోటీలు అత్యంత ఉత్సాహంగా సాగాయి. ప్రజా పాలన తొంభై తొమ్మిది రోజుల ప్రణాళికలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి శిశు అభివృద్ధి పథక అధికారి మధురిమ ముఖ్య అతిథిగా విచ్చేశారు. పర్యవేక్షకురాలు నజ్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆహార ప్రదర్శనను ఆమె పరిశీలించి, గర్భిణీలు మరియు చిన్నారుల ఆరోగ్య సంరక్షణలో బలవర్థకమైన ఆహారం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా మధురిమ మాట్లాడుతూ, మహిళలు గర్భిణీలుగా నమోదైనప్పటి నుంచి శిశువుకు ఐదేళ్ల వయసు వచ్చే వరకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా సంపూర్ణ పౌష్టికాహారంతో పాటు ఆటపాటల ద్వారా నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి కేంద్రం పరిధిలోని చిన్నారులను క్రమం తప్పకుండా అంగన్వాడీలకు పంపేలా స్థానిక స్థాయి పర్యవేక్షణ కమిటీ సభ్యులు చొరవ చూపి సహకరించాలని ఆమె కోరారు. తల్లులు తమ పిల్లల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షకులు నజ్మా, భాగ్యమ్మలతో పాటు అంగన్వాడీ ఉపాధ్యాయులు నల్లా భారతి, శిరీష, అరుణ, విజయలలిత, వీరమ్మ, రాధాబాయి, పలువురు తల్లులు మరియు చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వేసవిలో ప్రతి ఒక్కరి దహార్తి తీర్చేందుకే

# చలి వేంద్రాలు



**తుంగతుర్తి, ఏప్రిల్ 1, (ప్రజా జ్యోతి) :** వేసవికాలంలో ప్రతి ఒక్కరి దాహార్తిని తీర్చేందుకే చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు గ్రామ సర్పంచ్ చింతకుంట్ల మనోజ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని రావులపల్లి గ్రామంలో బస్టాండ్ ఆవరణంలో చలివేంద్రాన్ని గ్రామ పెద్దలు, వార్డు సభ్యులతో కలిసి సర్పంచ్ చింతకుంట్ల మనోజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వేసవి దృష్ట్యా ప్రజలు తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అజిత ప్రసాద్,బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు కేతిరెడ్డి గోపాల్ రెడ్డి, గ్రామ వార్డు సభ్యులు పత్తి శోభ, చిలుకూరు సునీత, చిన్నగుంట్ల సైదులు, జోగునూరు దేవరాజ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 1న "కార్మికుల నల్ల జెండా దీక్ష"



**భూదాన్ పోచంపల్లి, ఏప్రిల్ 01 (ప్రజాజ్యోతి) :** మండలంలోని దంతూర్ గ్రామంలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా కార్మికులు నిరసన చేపట్టారు. నల్ల జెండాలు ధరించి ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పీవైఎల్ పోచంపల్లి పట్టణ కార్యదర్శి పగడాల శివ మాట్లాడుతూ, పాత 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు కోడ్‌లుగా మార్చడం వల్ల కార్మిక హక్కులు దెబ్బతింటాయని, ఉద్యోగ భద్రత, కనీస వేతనం వంటి హక్కులు ప్రమాదంలో పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. కొత్త చట్టాలు కార్పొరేట్‌లకు అనుకూలమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో గోరుగంటి ముత్యాలు, పోతగళ్ల బాలయ్య, కొత్త బాబు, పందుల సత్తయ్య, గోరుగంటి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## జులూరులో పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం

**– రబీకి సిద్ధం కావాలి – పర్సన్ ఇంచార్జ్ కంచర్ల వెంకట్ రెడ్డి**



**భూదాన్ పోచంపల్లి, ఏప్రిల్ 1 (ప్రజాజ్యోతి):** మండలంలోని జులూరు గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పర్సన్ ఇంచార్జ్ కంచర్ల వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో, సీఈఓ రెబ్బస్ నర్సింహా అధ్యక్షతన సమావేశం జరిగింది. సమావేశంలో సంఘ లావాదేవీలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై విస్తృతంగా చర్చించారు. గత ఖరీఫ్ సీజన్‌లో పీఏసీఎస్ ద్వారా సుమారు 14 వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసి, రూ.33 కోట్లకు పైగా రైతులకు చెల్లింపులు చేసినట్లు అధికారులు తెలిపారు. రాబోయే రబీ సీజన్‌కు రైతులు ముందుగానే సిద్ధంగా ఉండాలని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను వినియోగించుకుని తమ ధాన్యాన్ని విక్రయించుకోవాలని రైతులకు సూచించారు. రైతులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం విక్రయించేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు మరియు రైతులు పాల్గొన్నారు.

## యాదగిరి మృతి పార్టీకి తీరనిలోటు

**మాజీ ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి**



**ఆలేరు ఏప్రిల్ 1 ప్రజా జ్యోతి :** బేతి యాదగిరి మృతి బిఆర్ఎస్ పార్టీకి తీరని లోటు అని మాజీ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ గొంగిడి సునీత మహేందర్ రెడ్డి అన్నారు. బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణ కేంద్రంలో మాజీ కౌన్సిలర్ రాములు తండ్రి యాదగిరి అనారోగ్యంతో మరణించగా వారి పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించరూ. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేష్, కౌన్సిలర్ యాటా శివ కుమార్, మహేందర్, శ్రీనివాస్,రాజు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## బియ్యం పంపిణీ చేసిన మున్సిపల్ చైర్పర్సన్ బాలమణి



**ఆలేరు ఏప్రిల్ 1 ప్రజాజ్యోతి :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మున్సిపల్ పరిధిలోని బీసీ కాలనీలో రేషన్ షాప్ నూతనంగా ఏర్పాటు చేయడంతో బుధవారం ఆలేరు మున్సిపల్ చైర్ పర్సన్ బీజా నీ బాలమణి భాస్కర్ హాజరై లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ జట్ట నీరజ సిద్ధులు, బోట్ల సంపత్, నరేందర్, శ్రీకాంత్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## 5000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేత



**ఆలేరు ఏప్రిల్ 1 ప్రజాజ్యోతి :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణ కేంద్రానికి చెందిన బిఆర్ఎస్ సీనియర్ నాయకులు సోషల్ మీడియా కన్వీనర్ ప్రీతం బన్నీకి హెర్నియా సర్జరీ కావడంతో బుధవారం నాలుగో వార్డ్ కౌన్సిలర్ బీజానీ కళ్యాణి మధు వారిని పరివర్శించి 5000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. వారి వెంబడి సీస సత్తయ్య, టింకు, ఉదయ్ ఉన్నారు.

## 50 కిలోల బియ్యం అందజేత



**ఆలేరు ఏప్రిల్ 1 ప్రజాజ్యోతి :** యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండల కేంద్రంలో బిర్లా ఫౌండేషన్ చైర్మన్ బీర్ల అనిత సహకారంతో, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బుగ్గ కొమురయ్య ఆధ్వర్యంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన గ్రామపంచాయతీ సిబ్బంది భోగారం మొగులయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి 50 కిలోల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు భూమండ్ల శ్రీనివాస్, ఇస్తారి, మల్లేష్ ,సిద్ధులు, ఉప్పలయ్య, అశోక్, జహంగీర్, ఉదయ్, మహేష్, మధు, సిద్ధులు, నాగులు, రంజిత్ మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

## నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలి

**– సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు చింతపల్లి బయన్న**



**నార్కట్ పల్లి, ఏప్రిల్ 1 (ప్రజా జ్యోతి) :** కేంద్రంలో రెండోసారి బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 29 కార్మిక చట్టాలను సవరణ చేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకురావడం కార్మికుల పొట్ట కొట్టినట్టేనని అన్నారు. ఏప్రిల్ ఒకటి నుండి నాలుగు లేబర్ కోడ్లు అమల్లోకి వస్తున్నాయని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడానికి వ్యతిరేకంగా ఏప్రిల్ ఒకటో తేదీని భారత జాతీయ కార్మిక సంఘాల పిలుపునందుకొని ఈరోజు కార్మికులందరూ కలిసి బ్లాక్ డే ను ప్రకటించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు మెడబోయిన నరసింహ,చెరుకు శ్రీకాంత్, మధు,శ్రీను, రాజేష్,వెంకన్న, శ్రీను,సైదులు తదితరులు పాల్గొన్నారు.

## బ్యాంకులో మద్యం పార్టీలు లంచాలు తీసుకుని రాత్రిపూట లోన్లు?



- రాత్రి వేళలో రహస్య లోన్లు
- మద్యం మత్తులో బ్యాంకు పనులు

**మోత్కూరు మే 1 (ప్రజాజ్యోతి) :** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మండల కేంద్రంలోని పిఏసిఎస్ (ప్రైమరీ అగ్రికల్చరల్ కోఆపరేటివ్ సొసైట్ ) బ్యాంకులో సంచలన ఘటన వెలుగులోకి వచ్చింది. బ్యాంకు ఉద్యోగులు విధి నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తూ అర్ధరాత్రి వేళల్లో చైర్మన్ ఛాంబర్లో మద్యం సేవిస్తున్నారనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. స్థానిక రైతులు, ప్రజల ఆరోపణల ప్రకారం, బ్యాంకు ఉద్యోగులు ప్రైవేట్ వడ్డీ వ్యాపారులు, దళారులతో కలిసి రాత్రి సమయంలో బ్యాంకు కార్యాలయంలోనే మద్యం విందులు నిర్వహిస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా, కొంతమంది ఉద్యోగులు దళారుల వద్ద లంచాలు తీసుకుని అర్ధరాత్రి వేళల్లోనే రహస్యంగా రుణాలు మంజూరు చేస్తున్నారనే తీవ్ర ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఘటనల వల్ల నిజాయితీగా రుణాల కోసం బ్యాంకుకు వచ్చే రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకులో పారదర్శకత లేకపోవడం వల్ల సాధారణ ప్రజలు నష్టపోతున్నారని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై వెంటనే విచారణ జరిపి, సంబంధిత ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు, స్థానిక ప్రజలు ప్రభుత్వ అధికారులను డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా బ్యాంకుల్లో క్రమశిక్షణను కట్టుదిట్టం చేయాలని వారు కోరుతున్నారు.

## పౌల్ట్రీ కార్పోరేట్ సంస్థల వలన తీవ్ర ఆర్థిక ఇబ్బందులు






**– సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన చికెన్ షాప్ యాజమానులు**

**మిర్యాలగూడ, ఏప్రిల్ 01, (ప్రజాజ్యోతి) :** పౌల్ట్రీ కార్పొరేట్ సంస్థలు అనుసరిస్తున్న విధానాల వలన తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గురువారం చికెన్ షాప్ ఓనర్లు సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ కు వినతిపత్రం అందజేశారు. చికెన్ షాప్ ఓనర్స్ అండ్ ట్రేడర్స్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు బంద్ లో భాగంగా షాపులు మూసివేసి బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సబ్ కలెక్టర్ కు వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా చికెన్ షాప్ ఓనర్స్ అసోసియేషన్ మిర్యాలగూడ అధ్యక్షుడు నరేందర్ రెడ్డి మాట్లాడుతూ పౌల్ట్రీ రంగంలో కార్పొరేట్ సంస్థలు కమిషన్ తగ్గించడం వలన అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అన్నారు. గతంలో కరోనాతో పౌల్ట్రీ రంగం అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నామని, ఇప్పుడు కార్పొరేట్ సంస్థల వైఖరితో తమ పరిస్థితి మరీ ఘోరంగా ఉందని, కరెంట్ బిల్లులు, పనివాళ్ళ జీతాలు,షాపు అద్దెలు వెళ్లడం లేదని, షాపులు నిర్వహించటం దుర్భరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ బాధలను, ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి కమిషన్ పెంచే విధంగా పౌల్ట్రీ కార్పొరేట్ సంస్థలపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి రాంబాబు, పేలపోలు శ్రీనివాస్, రియాజ్ భాయ్, తిరుమల రావు, షఫీ, కార్యవర్గ సభ్యులు చికెన్ షాపుల యజమానులు పాల్గొన్నారు.

## అనుమతులులేని లక్కీడ్రా స్కీమ్‌లు పెడితే చర్యలు తప్పవు..!

**– వాడపల్లి ఎస్ ఐ శ్రీకాంత్ రెడ్డి**



**దామరచర్ల, ఏప్రిల్ 01, (ప్రజాజ్యోతి) :** ప్రభుత్వ అనుమతులు లేకుండా లక్కీ డ్రా స్కీం అంటూ నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వాడపల్లి ఎస్సై ఏమిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి హెచ్చరించారు. గ్రామాలలో పండుగలు, తిరునాళ్ళని దృష్టిలో పెట్టుకొని ప్రజల అమాయకత్వాన్ని ఆశలను అడ్డుపెట్టుకొని కొంతమంది వ్యక్తులు ఆకర్షణీయమైన బహుమతులు ఇస్తామని ఆశ చూపుతూ లక్కీ డ్రా అంటూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని అలాంటి వారిపై నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. లక్కీ స్కీమ్ ల పేరిట బ్రోచర్లు విడుదల చేస్తే, అరెస్టులు చేస్తామని హెచ్చరించారు. అనుమతుల్లేని ఇలాంటి లక్కీ డ్రా వ్యవస్థను నమ్మి డబ్బులు చెల్లించి మోసపోవద్దని ప్రజలను కోరారు. మండలంలో ఎక్కడైనా ఇలా లక్కీ డ్రాల పేరిట వసూళ్లకు పాల్పడే వారి సమాచారం తెలిస్తే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఇది హెచ్చరికగా భావించి అప్రమత్తంగా ఉండాలని కోరారు.

## లేబర్ కోడ్స్ రద్దు చేయాలని నల్ల బ్యాడ్జీలతో నిరసన




**నాంపల్లి, ఏప్రిల్, 01 (ప్రజా జ్యోతి):** బీజేపీ ప్రభుత్వం ఇటీవల తెచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్ ను వెంటనే వెనక్కి తీసుకోవాలని లేకపోతే ప్రభుత్వంపై కార్మిక వర్గం సమస్యల పోరాటాలు చేస్తుందని సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు చిన్నపాక లక్ష్మీనారాయణ హెచ్చరించారు. బుధవారం నాంపల్లిలో లేబర్ కోడ్స్ అమలు చేయడాన్ని వ్యతిరేకిస్తూ నల్ల బ్యానర్ తో నిరసన వ్యక్తం చేశారు. కార్మికులకు వ్యతిరేక కార్మిక హక్కులను కాలరాసే ఈ లేబర్ కోడ్స్ రద్దు చేసేంత వరకు పెద్ద ఎత్తున సమరశీల పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా తమ విధానాలు మార్చుకోకపోతే ప్రజా ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి, సిఐటియు మండల కన్వీనర్ ఏదుళ్ళ సునీత, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు రేవెల్లి యాదయ్య, మరియమ్మ, లలిత, నీలిమ, రాములమ్మ, ఈరమ్మ, పార్వతమ్మ, సులోచన, నాగమ్మ, వెంకటయ్య, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు గిట్టుబాటు ధర అందేలా చూడండి..!

- సబ్ కలెక్టర్ కు రైతు సంఘం ఫిర్యాదు
- రైతాంగాన్ని ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం
- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి



**మిర్యాలగూడ, ఏప్రిల్ 01, (ప్రజాజ్యోతి) :** రైతాంగాన్ని ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, గిట్టుబాటు ధర కల్పించకుండా మిల్లర్లు రైతులను దోపిడి చేస్తున్నారంటూ, గిట్టుబాటు ధర అందేలా చూడాలంటూ గురువారం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ఆధ్వర్యంలో రైతు సంఘం నాయకులు సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులను చిన్నచూపు చూస్తుందన్నారు. రైతు భరోసా సకాలంలో ఇవ్వడంలో విఫలమైందన్నారు. పంట పెట్టుబడులు పెరిగాయని, సకాలంలో యూరియా అందక రైతులు అష్ట కష్టాలు పడి పంటలు పండించాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఇన్ని కష్టాలకు ఓర్చి అప్పులు చేసి రైతులు పంటలు పండిస్తే గిట్టుబాటు ధర చెల్లించడంలో రైస్ మిల్లర్లు రైతులకు అన్యాయం చేస్తున్నారన్నారు. కోతల సీజన్ ప్రారంభంలో జె ఎస్ ఆర్, చింట్లు, హెచ్ఎంటి తదితర సన్నరకంధాన్యాలకు క్వింటాకు 2750 రూపాయల ధర చెల్లించిన మిల్లర్లు, కోతలు ఎక్కువై ధాన్యం విపరీతంగా రావడంతో సిండికేట్ గా మారిన మిల్లర్లు రకరకాల కొర్రీలు పెట్టి ధరను అమాంతం క్వింటాకు 2450 రూపాయలు చెల్లిస్తామని, ఇష్టమైతే ఇవ్వండి లేకపోతే లేదంటూ రైతులను ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. రైతుల ఆరుగాలం శ్రమను దోపిడీ చేసేందుకు ప్రయత్నిస్తున్న మిల్లర్లపై చర్యలు తీసుకొని గిట్టుబాటు ధర కల్పించేలా సబ్ కలెక్టర్ కృషి చేయాలని కోరారు. పెరిగిన సాగు వ్యయం దృష్టిలో ఉంచుకొని క్వింటాకు మూడు వేల రూపాయలు చొప్పున చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు రాగిరెడ్డి మంగారెడ్డి, మండల అధ్యక్ష కార్యదర్శులు పోలేపల్లి గోవింద్ రెడ్డి, కోట్ల శ్రీనివాస్ రెడ్డి, పాల్వాయి రామ్ రెడ్డి, మల్లు గౌతమ్ రెడ్డి, రవి నాయక్, పిల్లుట్ల సైదులు, లక్ష్మీనారాయణ, రామచంద్రు తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణీ స్త్రీలకు చిన్నారులకు శ్రేష్టమైన ఆహారాన్ని అందించాలి

**సర్పంచ్ కుంచం ఇందిరా నరసయ్య**



**మునగాల ఏప్రిల్ 01 ప్రజాజ్యోతి :** మునగాల మండలం నరసింహులగూడెం గ్రామంలోనీ అంగన్వాడి ఒకటో సెంటర్ ను మొదటి పోషక ఆహార ఆరోగ్య దినోత్సవం సందర్భంగా కేంద్రాన్ని సందర్శించారు ఈ సందర్భంగా సర్పంచ్ ఇందిరా నరసయ్య మాట్లాడుతూ గర్భిణి స్త్రీలకు బాలింతలకు మరియు చిన్నారులకు శ్రేష్టకరమైన పోషక ఆహారం అందించాలని గర్భిణీ స్త్రీలకు తగిన ఆరోగ్య సూచనలు చేయాలని వారికి ఎప్పటికప్పుడు మంచి ఆహారం తీసుకునే విధంగా అంగన్వాడి టీచర్ మరియు ఆయాలు ఆరోగ్య సూత్రాలు తెలపాలని వారికి సూచించారు అంగన్వాడీలో పిల్లల సంఖ్య పెరిగే విధంగా తల్లులు చిన్నారులలను ప్రభుత్వ అంగన్వాడి కేంద్రానికి పంపించే బాధ్యతలు తీసుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మొగిలిచర్ల సీతారాములు అంగన్వాడీ టీచర్ నందిపాటి సృజనారాణి ఆయా అనసూయ గర్భిణీ మరియు బాధిత స్త్రీలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రతి ఒక్క విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకోవాలి

**– సర్పంచ్ అమర బోయిన మట్టయ్య**




**మునగాల, ఏప్రిల్ 01 (ప్రజాజ్యోతి) :** మునగాల మండలం గణపవరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో "ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట" కార్యక్రమాన్ని బుధవారం గ్రామ సర్పంచ్ అమరబోయిన మట్టయ్య ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అనేక రకాల సౌకర్యాలను కల్పిస్తున్నదని తెలిపారు. జూన్ నెల నుంచి విద్యార్థులకు ఉదయం అల్పాహారం పథకాన్ని కూడా ప్రారంభిస్తున్నందున ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకోవాలని పిలుపునిచ్చారు. పాఠశాల ప్రిన్సిపల్ పందిరి నర్సిరెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉన్నారని, విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధతో నాణ్యమైన విద్యాబోధనతో పాటు డిజిటల్ విద్యను కూడా అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుందరి, శ్రీనివాసరావు, కొల్లు వెంకటేశ్వర్లు, గల్లా ఉపేందర్, గజ్జల వెంకటరెడ్డి, జయలక్ష్మి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు. విద్యార్థినీ, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

### నేటి నుండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం
# ఇందల్వాయిలో హెచ్పీవీ వ్యాక్సిన్ ప్రారంభం






**ఇందల్వాయి ( ప్రజా జ్యోతి ) ఏప్రిల్. 1** ఇందల్వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెచ్పివి గర్భాశయ క్యాన్సర్ నిరోధక వ్యాక్సిన్ ను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇందల్వాయి వైద్యాధికారిని డాక్టర్ షారోన్ షైని క్రిస్టినా ప్రారంభించారు. హెచ్ పి వి అనగా హ్యూమన్ పాపిలోమా వైరస్. ఈ వైరస్ వలన గర్భాశయ క్యాన్సర్ రావడానికి అవకాశం ఉంటుంది కావున 14 సంవత్సరాల వయసు గల ఆడపిల్లలందరికీ ఈ హెచ్ పి వి వ్యాక్సిన్ వేయించాలని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రెండు నెలల వరకు ఈ వ్యాక్సిన్ అందుబాటులో ఉంటుంది. కావున ప్రతి పాఠశాలలో చదివే పిల్లలు 14 సంవత్సరాల వయసు గల పిల్లలందరూ ఈ వ్యాక్సిన్ వేయించుకోవాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ వ్యాక్సిన్ కు వేయించుకోవడానికి వచ్చేటప్పుడు ఆధార్ కార్డు కుటుంబ పెద్ద అంగీకార పత్రము తల్లి లేదా తండ్రిని తీసుకొని రావలెను. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి వై. శంకర్ ఆరోగ్య పర్యవేక్షకులు దేవపాలం, ఆరోగ్య కార్యకర్త శారద, వేణుగోపాల్ పాల్గొన్నారు.

# దళారులను నమ్మి మోసపోవద్దు
### సర్పంచ్ బోయిని శంకర్
### – పీపీసీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**బాన్సువాడ ఆర్సి, ఏప్రిల్ 1 (ప్రజా జ్యోతి)** బీర్కూరు మండలంలోని దామరంచ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో పిపిసి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక సర్పంచ్ బోయిని శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆరుగాలంం శ్రమించి పండించిన ధాన్యాన్ని చివరి దశలో దళారులకు విక్రయించి మోసపోవద్దని సూచించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన పిపిసి కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని విక్రయిస్తే, ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర (ఎం ఎస్ పి) ప్రకారం రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా నగదు జమ అవుతుందని తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ నాగరాజు, మాజీ చైర్మన్ కమలాకర్ రెడ్డి, తహసీల్దార్ సవాయి సింగ్, సంఘ ఐసి కార్యదర్శి వెంకటేష్, గ్రామ నాయకులు, మాజీ సర్పంచ్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# బీర్కూర్‌లో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం
### – రైతులకు మద్దతు ధర, సౌకర్యాలపై హామీ: డీసీఓ రామ్మోహన్



**బాన్సువాడ ఆర్సి, ఏప్రిల్ 1 (ప్రజా జ్యోతి)** బీర్కూర్ మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో వరి కొనుగోలు కేంద్రాన్ని డీసీఓ రామ్మోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కలెక్టర్ నుండి మిల్లులకు అనుమతులు వచ్చిన వెంటనే కొనుగోలు ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా గన్నీ సంచులు, హమాలి, లారీలు సమృద్ధిగా అందుబాటులో ఉంచుతామని హామీ ఇచ్చారు. వరి నాణ్యతలో ఫెయిర్ అవరేజ్ క్వాలిటీ (ఎఫ్ ఏ క్యూ) శాతం సరిగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు. దళారులను నమ్మి మోసపోవద్దని హెచ్చరిస్తూ, ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర (ఎం ఎస్ పి) నేరుగా రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ అవుతుందని పేర్కొన్నారు. రైతులు నేరుగా కొనుగోలు కేంద్రాలకు వరి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఆఫీసర్ కవిత, పర్సన్ ఇన్‌చార్జ్ జి. నర్సింలు, గ్రామ సర్పంచ్ ధర్మ తేజ, ఏఎంసీ వైస్ చైర్మన్ యామ రాములు, దామరంచ సర్పంచ్ బోయిని శంకర్, నాయకులు మియాపురం శశికాంత్, మేకల విటల్, ఇంగురాములు, అంబిలి బసవరాజు పటేల్, మాజీ ఎంపీపీ గాండ్ల రఘు, గొండ్ల శ్రీను గ్రామ ప్రజా ప్రతినిధులు, రైతులు, సంఘ కార్యదర్శి మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూములు కబ్జాల బారిన?
### – అధికారుల నిర్లక్ష్యంపై అగ్రహాశీ



**రాజంపేట ఏప్రిల్ 01 (ప్రజా జ్యోతి)** మండల కేంద్రంలో ప్రభుత్వ భూములు, వ్యవసాయ పంట కాలువలు వరుసగా కబ్జాలకు గురవుతున్నప్పటికీ సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయం పక్కన ఉన్న పంట కాలువతో పాటు పలు ప్రాంతాల్లో పంచాయతీ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. రాజంపేట మండలంగా ఏర్పడినప్పటి నుంచి గ్రామలో ఉన్న ప్రభుత్వ స్థలాలు క్రమంగా కబ్జాల పాలవుతున్నాయని, రెవెన్యూ మరియు పంచాయతీ అధికారులు స్పందించకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ఈ కబ్జాలు అధికారుల కనుసన్నల్లోనే జరుగుతున్నాయా అన్న అనుమానాలు గ్రామస్తుల్లో వ్యక్తమవుతున్నాయి. ఇలానే కొనసాగితే రాబోయే రోజుల్లో గ్రామంలో ప్రజలకు నడవడానికి కూడా స్థలం లేకుండా పోతుందని భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని యువత హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు ప్రత్యేక దృష్టి సారించి రాజంపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ భూములను గుర్తించి వెంటనే ఆక్రమణలను తొలగించి రక్షించాలని ప్రజలు, యువత కోరుతున్నారు. లేదంటే రాబోయే రోజుల్లో భారీ స్థాయిలో ఆందోళనలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.

# ఎమ్మెల్యేను కలిసిన గ్రామ పాలకవర్గం
### – సర్పంచ్ డోకి లచ్చయ్య





**రామారెడ్డి ఏప్రిల్ 01 (ప్రజా జ్యోతి)** రామారెడ్డి మండలం ఇసనపల్లి గ్రామపంచాయతీ నూతన పాలకవర్గం కొలువుదీరిన సందర్భంగా గ్రామ అభివృద్ధి దృశ్య పలు అభివృద్ధి సంక్షేమ పథకాల కొరకు నిధులు కేటాయించాలని స్థానిక ఎమ్మెల్యే మదన్మోహన్ రావు ను మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ తమ గ్రామంలోని నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణం, అదేవిధంగా అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, నూతన పైప్ లైన్, ముఖ్యంగా వేసవి సమీపిస్తున్న సందర్భంగా నీటి కొరత లేకుండా గ్రామ పాలకవర్గానికి సహకరించాలని బుధవారం ఎమ్మెల్యేను కలవడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ డోకి లచ్చయ్య, ఉప సర్పంచ్ తుమ్మల రమేష్, పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రధాని నరేంద్ర మోడీ
# దిష్టిబొమ్మను దగ్ధం చేసిన టీయుసీఐ నాయకులు








**ఇందల్వాయి( ప్రజా జ్యోతి ) ఏప్రిల్. 1** డిచ్పల్లిమండలంలోనికార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్ ల అమలును నిరసిస్తూ, రాష్ట్రంలో అమలు చేయమని ముఖ్యమంత్రి ప్రకటించాలని డిమాండ్ చేస్తూ టీయూసీఐ ఆధ్వర్యంలో డిచ్ పల్లి మండల కేంద్రంలో కార్మికులతో ర్యాలీ నిర్వహించి, తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ప్రధాని నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేయడం జరిగింది. ఈ సందర్భంగా టీయుసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ మాట్లాడుతూ భారత కార్మిక వర్గాన్ని నరేంద్ర మోడీ ఏప్రిల్ 1న ఫూల్స్ చేశారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం 4 లేబర్ కోడ్ ల అమలుతో కార్మికుల జీవితాల్లో ఏప్రిల్ 1 బ్లాక్ డే మారనుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయబోమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించాలన్నారు. కార్పొరేట్ కంపెనీల యాజమాన్యాలకు ఊడిగం చేసేలా, కార్మికుల హక్కులను, చట్టాలను కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం 29 చట్టాలను 4 లేబర్ కోడ్ లుగా మార్పు చేసిందన్నారు. ఈ కోడ్ లు అమలైతే దశాబ్దాలుగా పోరాటం చేసి సాధించుకున్న హక్కులను కార్మికులు కోల్పోతారన్నారు. పని గంటలు పెరిగి, వారి న్యాయమైన డిమాండ్లను, సమస్యలను కూడా పరిష్కరించుకోలేని పరిస్థితికి నెట్టబడతారన్నారు. ఇప్పటికైనా మోడీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వ విధానాలను విమర్శిస్తున్న కాంగ్రెస్ పార్టీ, రేవంత్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలో ఈ కోడ్ ల అమలును నిలిపివేయాలన్నారు. ఈ విషయమై ముఖ్యమంత్రి ప్రకటన చేయాలన్నారు. లేనిచో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఆందోళనలను ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టియుసిఐ జిల్లా సహాయ కార్యదర్శి డి.కిషన్, జిల్లా నాయకులు మురళి, రవి, అమూల్య, సుజాత, ఇంతియాజ్, రమేష్, జాకీర్, నవీన్, జమున, పుష్ప, గంగమణి, లక్ష్మి, జ్యోతి, కవిత, ఉమ, నిర్మల, కాజా, శ్రీనివాస్, మన్మేష్ తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపుపై వివాదం?
### – అర్హులకే న్యాయం చేయాలన్న డిమాండ్





**రాజంపేట ఏప్రిల్ 01 (ప్రజా జ్యోతి)** మండల కేంద్రంలోని బోరుగడ్డ ప్రాంతంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీ వ్యవహారం వివాదాస్పదంగా మారింది. లబ్ధిదారులకు పొజిషన్ సర్టిఫికెట్లు అందజేసి నెల రోజులు గడిచినా, కనీస మౌలిక వసతులు లేకపోవడంతో వారు ఇళ్లలోకి వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. తాగునీరు, విద్యుత్, సీసీ రోడ్లు వంటి సౌకర్యాలు లేకపోవడంతో "పట్టాలు ఇచ్చి బాధ్యతలు విస్మరించారు" అంటూ లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చీకట్లో జీవనం ఎలా సాగించాలనే ఆందోళనతో వెంటనే సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు. ఇదిలా ఉండగా, ఇళ్ల కేటాయింపులో అవకతవకలు జరిగాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రాజకీయ పార్టీలు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటుండగా, ప్రజలు గందరగోళానికి గురవుతున్నారు. అర్హులైన వారికి కాకుండా అనర్హులకు ఇళ్లు కేటాయించారని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. గ్రామానికి చెందిన కొందరు బాధితులు తమ పేర్లు జాబితాలో ఉన్నప్పటికీ తొలగించారని, ఇల్లు లేక అద్దె ఇళ్లలో నెలకు రూ. 3000 చెల్లిస్తూ జీవనం సాగిస్తున్నామని నాకు నలుగురు కూతుర్లు గతంలో తాసిల్దార్ కార్యాలయంలో చాలాసార్లు తాసిల్దార్ జానకి మేడం కలిసి నాకూ ఒక్క గుంట భూమి లేదు ఇల్లు లేదు నాకు నలుగురు కూతుర్లు ఉన్నారు మేడం నా పైన దయ తలసి నాకు డబుల్ బెడ్ రూమ్ ఇవ్వమని చాలాసార్లు వేడుకున్నాను గాని నాపైన మమకారం మోపలేదు హైమద్, పేర్కొన్నారు. కొత్త బీసీ కాలనీలో ప్లాట్లు పొందిన కొందరికి మళ్లీ ఇళ్లు కేటాయించారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో లబ్ధిదారుల జాబితాను పునఃసమీక్షించి, సమగ్ర సర్వే నిర్వహించి అర్హులకే ఇళ్లు కేటాయించాలని స్థానిక సర్పంచ్ సహా ప్రజాప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి కేటాయింపులపై విచారణ జరిపి అవకతవకలను వెలికితీసి, నిజమైన అర్హులకు న్యాయం చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. అలాగే మౌలిక వసతులు వెంటనే కల్పించి గృహప్రవేశాలకు మార్గం సుగమం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

### రక్తదాన శిబిరంతో
# ఆదర్శంగా నిలిచిన ధర్మారావుపేట గ్రామం
### – తల సేమియా వ్యాధి చిన్నారుల కోసం రక్తదాన శిబిరం
### – ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు, ఐవిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎర్రం చంద్రశేఖర్





**కామారెడ్డి ప్రతినిధి ఏప్రిల్ 01. (ప్రజాజ్యోతి)** కామారెడ్డి జిల్లా సదాశివ నగర్ మండలం ధర్మరావుపేట గ్రామంలో తల సేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం కామారెడ్డి రక్తదాతల సమూహం మరియు ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవిఎఫ్) ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ షేక్ ఉమర్,ఉప సర్పంచ్ అశోక్ రెడ్డి, వార్డు సభ్యులు,యువజన సంఘాల సహకారంతో నిర్వహించిన రక్తదాన శిఖరం విజయవంతం కావడం జరిగిందని ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్,రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు,ఐవిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎర్రం చంద్రశేఖర్ లు తెలియజేశారు. 47 సార్లు రక్తదానం చేసి ఆదర్శంగా నిలుస్తున్న రక్తదాత సామల సంతోష్ రెడ్డి ని సన్మానించడం జరిగింది. ఈ రక్తదాన శిబిరంలో 51 యూనిట్ల రక్తాన్ని సేకరించడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ బాలు, ఎర్రం చంద్రశేఖర్ లు మాట్లాడుతూ గ్రామ సర్పంచ్ షేక్ ఉమర్,ఉప సర్పంచ్ లు,యువ పాలకవర్గం తలసేమియా వ్యాధి చిన్నారుల ప్రాణాలను కాపాడడం కోసం రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి కామారెడ్డి జిల్లాకే ఆదర్శంగా నిలవడం జరిగిందని, వారందరికీ కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది. ఈ చిన్నారులకు ప్రతి 15 రోజులకు రక్తం జీవితాంతం అవసరం ఉంటుందని వారి ప్రాణాలను కాపాడాల్సిన బాధ్యత సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరి పైన ఉన్నదని అన్నారు. రక్తదానం చేసిన రక్తదాతలకు ప్రశంస పత్రాలను, స్టీల్ వాటర్ బాటిల్ లు,టిఫిన్ బాక్స్ లను అందజేసిన దాతలు కమ్మరి ప్రవీణ్,దోమకొండ శ్రీనివాస్,మందుల రామచంద్రం లను ప్రత్యేకంగా అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐవిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దొంతి సుధాకర్,కోశాధికారి కస్వ వెంకన్న,ఎల్లంకి సుదర్శన్,నంగునూరి కాశీనాథం గ్రామ యువత పాల్గొనడం జరిగింది.

# కామారెడ్డి రూరల్ సీఐగా శ్రీధర్ గౌడ్




**కామారెడ్డి ప్రతినిధి ఏప్రిల్ 01. (ప్రజాజ్యోతి)** కామారెడ్డి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా శ్రీధర్ గౌడ్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం, జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, ని మర్యాదపూర్వకంగా కలిశారు.

### గంగారం తండా నూతన
# గ్రామపంచాయతీకి భూమి పూజ



**ఇందల్వాయి ( ప్రజా జ్యోతి ) ఏప్రిల్. 1** ఇందల్వాయి మండలంలోని గంగారం తండా గ్రామపంచాయతీ పరిధిలో పంచాయతీ భవన నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ సంగీత దిలీప్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉప సర్పంచ్ ధూమతో పాటు వార్డ్ మెంబర్లు బుజ్జి, మమత, బాబూలాల్, సుధారాణి. గణేష్ పాల్గొన్నారు. అలాగే గ్రామ పెద్దలు, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, కారోబార్ శీను, సిబ్బంది గోపి, పంతులు తదితరులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గ్రామ అభివృద్ధికి పంచాయతీ భవనం కీలకమని, భవనం నిర్మాణంతో గ్రామ ప్రజలకు పరిపాలనా సేవలు సులభంగా అందుబాటులోకి వస్తాయని సర్పంచ్ సంగీత దిలీప్ తెలిపారు. గ్రామ అభివృద్ధికి అందరూ సహకరించాలని ఆమె కోరారు.

### పదవి విరమణ పొందిన
# సీనియర్ అసిస్టెంట్‌కు ఘన వీడ్కోలు



**మెండోరా:ఏప్రిల్ /01 (ప్రజాజ్యోతి):** మెండోరా మండలంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసిన సాయగౌడ్ బుధవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా కార్యాలయంలో అధికారులు, సిబ్బంది కలిసి ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు. శాలువాలతో సన్మానిస్తూ సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, సాయగౌడ్ ఉద్యోగ జీవితంలో నిబద్ధతతో, నిజాయితీగా పనిచేసి శాఖకు విశేష సేవలందించారని అభినందించారు. ఆయన సేవలు అందరికీ ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప తహసీల్దార్ శ్రీనివాస్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ వేణుగోపాల్ చారి, జూనియర్ అసిస్టెంట్లు నాగరాజ్, లక్ష్మణ్, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

### జిపిఓలతో సమావేశం
# ఏర్పాటు చేసిన ఎమ్మార్వో బాలయ్య



**ఇందల్వాయి( ప్రజా జ్యోతి) ఏప్రిల్. 1** ఇందల్వాయి మండల కేంద్రంలోని ఎమ్మార్వో కార్యాలయంలో సంబధిత జిపిఓ ల సమావేశం నిర్వహించి ఈ క్రింది విషయాల పై చర్చించడం జరిగింది 1 రేపు జరగబోయే గ్రామసభల యందు ప్రభుత్వం చేపడుతున్నా సంకేశమా పథకాలు ప్రజలకు వివరించుట కళ్యాణ లక్ష్మి/షాదీ ముబారక్/కొత్త రేషన్ కార్డులు/మహాలక్ష్మి/ఇందిరమ్మ ఇండ్లు/పెన్షన్స్/గ్యాస్ సిలిండర్/ భూభారతి/ఎలక్టోరోల్ తక్షణమే ఎంక్వయిరీ చేసి ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేయాలి అని జిపిఓలతో. ప్రజల సమస్యలు తెలుసుకోవాలని ఎమ్మార్వో వారికి చెప్పడం అయినది. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో జి బాలయ్య. ఆర్ ఐ కిషన్ డీపీటీ మేడం సీనియర్ అసిస్టెంట్ చరణ్ సిబ్బంది పాల్గొన్నారు

### పిహెచ్‌సీలో హెచ్
# పివి టీకా కార్యక్రమం ప్రారంభం
### – 14 నుండి 15 సంవత్సరం ఆడపిల్లలకు టీకా తప్పనిసరి
### – డాక్టర్ పల్స హరీష్ సూచన

**సదాశివనగర్, ఏప్రిల్ 01(ప్రజాజ్యోతి)** సదాశివనగర్ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం హెచ్ పివి టీకా కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ శ్రీమతి వంకాయల శిరీష, ఉపసర్పంచ్ ప్రవీణ్, మార్కెట్ కమిటీ చైర్మన్ వడ్ల రాజేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ 14-15 సంవత్సరాల వయస్సు గల ఆడ పిల్లలు ఈ టీకాను తప్పనిసరిగా వేయించుకోవాలని, ఈ టీకా గర్భాశయ క్యాన్సర్ నివారణకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా 14 సంవత్సరాల వయస్సు గల బాలికలకు టీకాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పల్సా హరీష్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నాగరాజు, పిహెచ్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# ఉపసర్పంచ్ చొరవ - ఎమ్మెల్యే స్పందన

– మెరుగైన వైద్యం కోసం రూ.2 లక్షల 50 వేల ఎల్‌ఓసీ విడుదల



**వెల్దుర్తి ప్రజాజ్యోతి ఏప్రిల్ 01:** వెల్దుర్తి పట్టణానికి చెందిన గజం పవన్ కుమార్ అనారోగ్యంతో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఉండగా, కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంది. ఈ పరిస్థితిలో వెంటనే స్పందించిన వెల్దుర్తి ఉపసర్పంచ్ కమ్మరి శ్రవణ్ కుమార్, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ని సంప్రదించి సహాయం కోరారు. మానవత్వంతో ముందుకు వచ్చిన ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, ఆలస్యం చేయకుండా రూ.2 లక్షల 50 వేల ఎల్‌ఓసి మంజూరు చేసి బాధితుడికి అండగా నిలిచారు. ఈ సహాయం వల్ల గజం పవన్ కుమార్ చికిత్సకు పెద్ద ఊరట లభించింది. ఈ సేవలో కీలక పాత్ర పోషించిన ఉపసర్పంచ్ శ్రవణ్ కుమార్ కృషిని ఎమ్మెల్యే ప్రశంసిస్తూ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

# అక్రమ తవ్వకాలు - రంగంలోకి దిగిన అధికారులు

– యావాపూర్ శివారులో అక్రమ మట్టి దందాపై రెవెన్యూ అధికారుల దాడి



**తూప్రాన్ ప్రజాజ్యోతి ఏప్రిల్ 01:** మెదక్ జిల్లా తూప్రాన్ మండలం యావాపూర్ గ్రామ శివారులో అక్రమంగా మట్టి తరలింపులు జరుగుతున్నాయనే సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు వెంటనే రంగంలోకి దిగారు. తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్స్పెక్టర్ ప్రేమ్ కుమార్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఘటన స్థలానికి చేరుకున్న అధికారులు, ఎలాంటి అనుమతులు లేకుండా ప్రభుత్వ భూమిలో జేసీబీలతో మట్టి తవ్వకాలు చేసి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్న దృశ్యాలను గుర్తించారు. వెంటనే చర్యలు తీసుకుని జేసీబీలు, ట్రాక్టర్లను పట్టుకుని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వాహనాలను తూప్రాన్ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు రెవెన్యూ ఇన్స్పెక్టర్ ప్రేమ్ కుమార్ వెల్లడించారు. అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని అధికారులు హెచ్చరించారు.

# ప్రతిఫలాన్ని ఆశించకుండా ఇవ్వడం దీని ప్రత్యేకత

– ఉదారత చాటుకున్న ఉపాధ్యాయుడు సుంకరి కృష్ణ



**మెదక్ ( ప్రజాజ్యోతి ) ఏప్రిల్ 01 :** నిండు చూలాలతో ఉన్న గర్భిణీకి తన రక్తం అందించి ఉపాధ్యాయుడు దాతృత్వాన్ని చాటుకున్నాడు. వివరాల్లోకి వెళితే జిల్లాలోని పాపన్నపేట మండలం ఎల్లాపూర్ గ్రామానికి చెందిన నేరెళ్ల శిరీష ప్రసూతి నిమిత్తం మెదక్ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రికి వెళ్ళింది. ఆమెకు అత్యవసరంగా ఏ నెగటివ్ రక్తం అవసరమని డాక్టర్లు తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు సోమవారం సోషల్ మీడియాలో ఏ నెగటివ్ రక్తం అత్యవసరం అని మెసేజ్ పోస్ట్ చేయడంతో, విషయం గమనించిన టేక్మాల్ మండలం బొడ్మట్ పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న సుంకరి కృష్ణ తక్షణం స్పందించి తనది ఏ నెగటివ్ రక్తం అని రక్తదానం చేస్తానని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. బుధవారం మెదక్ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో నేరెళ్ల శిరీష కు రక్తదానం చేశారు. ఉపాధ్యాయుని ఉదారత పట్ల కుటుంబ సభ్యులు అభినందించి, ధన్యవాదాలు తెలియజేశారు. అంటే నిస్వార్థంగా, దయతో ఇతరులకు సహాయం చేయడం, సమయం, డబ్బు లేదా వస్తువులను ధారాళంగా పంచడం. ఇది విశాల హృదయం, పరోపకారం మరియు దాతృత్వాన్ని సూచిస్తుంది,

# వరి ధాన్యం కొనుగోళ్లకు సమగ్ర ఏర్పాట్లు చేయాలి

– జిల్లా కలెక్టర్ హైమావతి



**సిద్ధిపేట ప్రతినిధి, ఏప్రిల్ 01 , (ప్రజాజ్యోతి):** రబీ సీజన్ వరి ధాన్యం కొనుగోళ్లను సజావుగా నిర్వహించేందుకు అన్ని కొనుగోలు కేంద్రాల్లో ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆదేశించారు. బుధవారం ఐడిఓసి సమావేశ మందిరంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం అధికంగా వచ్చే అవకాశం ఉన్నందున కేంద్రాల్లో తాగునీరు, టెంట్లు, టార్పాలిన్లు, మాయిశ్చర్ మీటర్లు వంటి సదుపాయాలు కల్పించాలని సూచించారు. రైతులు ధాన్యాన్ని బాగా ఆరబెట్టిన తర్వాత మాత్రమే తీసుకురావాలని, రోడ్లపై ఆరబెట్టవద్దని తెలిపారు. మిల్లుల సామర్థ్యానికి అనుగుణంగా ధాన్యం తరలింపు, నిల్వ ఏర్పాట్లు సమర్థంగా చేయాలని, ఎఫ్ఏక్యూ ప్రమాణాల్లో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ జయదేవ్ ఆర్య, సివిల్ సప్లై అధికారి తనూజ, డీఎం సివిల్ సప్లై అధికారి గోపీకృష్ణ, ఎల్డీఎం హరిబాబు, మార్కెటింగ్ అధికారి నాగరాజు, అడిషనల్ డీఆర్డీఏ సుధీర్ బాబు, మెప్మా పీడీ హన్మంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ధర్మమే చివరికి విజయం సాధిస్తుంది

– మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు



**సిద్దిపేట రూరల్, ఏప్రిల్ 01 ,(ప్రజాజ్యోతి):** సమాజంలో ప్రతి ఒక్కరూ ధర్మాన్ని అనుసరించాలని, చివరికి ధర్మమే గెలుస్తుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. సిద్దిపేట రూరల్ మండలం చింతమడక గ్రామంలోని శ్రీ పట్టాభి రామాలయంలో ఇటీవల నిర్వహించిన ధ్వజస్థంభ ప్రతిష్టా కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, ధ్వజస్థంభం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం మండలంలోని పలు గ్రామాలను సందర్శించి ఇటీవల మరణించిన వారి కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. చింతమడకలో మాజీ సర్పంచ్ బిక్షపతి తల్లి, పార్టీ కార్యకర్త పిట్ల యాదగిరి తల్లి కుటుంబాలను పరామర్శించారు. రావూరుకుల గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్ మధు తల్లి, కార్యకర్త యాదయ్య కుటుంబాలను పరామర్శించారు. బుస్సాపూర్ గ్రామంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మాజీ గ్రామ పార్టీ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి కుటుంబంతో పాటు, ఎర్ర పెద్ద మల్లయ్య కుటుంబాన్ని కూడా పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమములో సుడా మాజీ ఛైర్మన్ మారెడ్డి రవీందర్ రెడ్డి, నాయకులు ఎర్ర యాదయ్య , రాంచందర్ రావు, హంస కేతన్ రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్ లు తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్‌ను పరామర్శించిన వంగ రాజేశ్వర్ రెడ్డి



**నంగునూర్, ఏప్రిల్ (ప్రజా జ్యోతి):–** మండల పరిధిలో ని సిద్దన్నపేట గ్రామ సర్పంచ్ సంగు పురెందర్ ఇటీవల అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న పురేందర్ ను బుధవారం నాడు వంగ రాజేశ్వర్ రెడ్డి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకొని మళ్ళీ ప్రజా సేవలో చురుగ్గా పాల్గొనాలని అన్నారు.

# బీజేపీ రాష్ట్ర స్థాయిలో తూప్రాన్‌కు ప్రత్యేక గుర్తింపు

– కార్యవర్గ సభ్యునిగా ఎంపికైన వర్గంటి రామ్మోహన్ గౌడ్‌కు ఘన సత్కారం



**తూప్రాన్ ప్రజాజ్యోతి ఏప్రిల్ 01:** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా ఎంపికైన వర్గంటి రామ్మోహన్ గౌడ్‌కు తూప్రాన్ మున్సిపల్ బీజేపీ శాఖ ఆధ్వర్యంలో ఘన సత్కారం నిర్వహించారు. మున్సిపల్ శాఖ అధ్యక్షుడు భూమన్నగారి జానకిరామ్ గౌడ్ నాయకత్వంలో శాలువాతో సత్కరించి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ చందా అశోక్, మన్నే స్వామి, జనరల్ సెక్రటరీ బసంపల్లి సంపత్ గౌడ్, యువమోర్చా అధ్యక్షుడు వంగలి నవీన్ యాదవ్ సహా పలువురు కీలక నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జానకిరామ్ గౌడ్ మాట్లాడుతూ, రాష్ట్ర పార్టీతో పాటు మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు ఆశీస్సులతో పార్టీకి కట్టుబడి పనిచేసే నాయకుడిగా రామ్మోహన్ గౌడ్‌కు ఈ బాధ్యత దక్కిందన్నారు. ఈ అవకాశానికి రాష్ట్ర నాయకత్వానికి, ఎంపీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గతంలో వైస్ ఎంపీపీగా సేవలందించిన రామ్మోహన్ గౌడ్ ఇప్పుడు రాష్ట్ర స్థాయిలో బాధ్యతలు చేపట్టడం తూప్రాన్‌కు గర్వకారణమని అన్నారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి మూడు స్థానాలు సాధించడంలో కార్యకర్తలు, యువత చేసిన కృషిని కొనియాడారు. రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ, అసెంబ్లీ ఎన్నికల్లో కార్యకర్తలు మరింత ఉత్సాహంతో పని చేసి పార్టీ విజయానికి కృషి చేయాలని, యువత పెద్ద సంఖ్యలో ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

# ఆలయాల్లో హనుమాన్ జయంతి సందడి

– 250 మంది భక్తులతో ఇరుముడి శోభాయాత్ర








**తూప్రాన్ ప్రజాజ్యోతి ఏప్రిల్ 01:** మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలోని పెద్ద చెరువు కట్టపై ఉన్న వీరాంజనేయ స్వామి ఆలయం వద్ద హనుమాన్ జయంతి సందర్భంగా భక్తి పారవశ్యంతో ఇరుముడి శోభాయాత్ర వైభవంగా జరిగింది. మాలాధారణ చేసిన సుమారు 250 మంది భక్తులు ఇరుముడి ధరించి, ఎండను లెక్కచేయకుండా భారీ పాదయాత్రగా పాల్గొన్నారు. ఆలయ పూజారి గురుస్వామి ఆత్రేయ శర్మ మార్గదర్శకత్వంలో జరిగిన ఈ శోభాయాత్రలో జై శ్రీరామ్, జై హనుమాన్ నినాదాలు మార్మోగి పట్టణం అంతా భక్తి వాతావరణంతో నిండిపోయింది. ఇందులో భాగంగా ఆత్రేయ శర్మ మాట్లాడుతూ,గత నాలుగు దశాబ్దాలుగా ఈ ఆలయంలో హనుమాన్ జయంతి ఉత్సవాలు విశేషంగా నిర్వహిస్తున్నామని, తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయంతో సమానంగా ఈ ఆలయానికి ప్రత్యేక స్థానం ఉందని, సంతానం, వివాహం, వ్యాపారం, ఉద్యోగం వంటి కోరికలు నెరవేర్చే క్షేత్రంగా భక్తులు విశ్వసిస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉదయం పుణ్యవచనం, హోమాలు నిర్వహించగా, రేపు గురువారం ఆంజనేయ స్వామికి చందనాభిషేకం, లక్ష ఆకుపూజ, లక్ష పుష్పార్చన, సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు జరగనున్నాయని, అనంతరం మహా అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి ఆశీస్సులు పొందాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

# కొండాపూర్ టీజీఐఐసీ పారిశ్రామికవాడలో అర్ధరాత్రి

అనుమతి లేకుండా అక్రమ మట్టి తరలించే ప్రయత్నం.

- సంబంధిత అధికారులతోనే అక్రమ మట్టికి అండదండలు
- ఏండ్లు గడుస్తున్న బదిలీలు శూన్యమైనవి అధికారులపై
- మనోహరాబాద్ మండలంలో అధికారుల ది ఇష్టారాజ్యం
- జిల్లా కలెక్టర్ గారు అధికారుల బదిలీల సంగతేంటి?
- అక్రమాల వెనుక అండదండల అధికారులు కాబట్టి ఫోన్ చేసిన లిఫ్ట్ చేయకపోవడం శోచనీయం



**మనోహరాబాద్, ఏప్రిల్ 01 ( ప్రజా జ్యోతి )** మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలంలోని రెండవ పారిశ్రామిక ప్రాంతంగా చెప్పుకోబడుతున్న కొండాపూర్, టి జి ఐ ఐ సి పారిశ్రామిక వాడలో అర్ధరాత్రి వేళలో ట్రాక్టర్ తో టిప్పర్ లారీలతో ఇష్టగోషంగా అధికారులు అండదండలతోనే పరిశ్రమలకు అక్రమంగా మట్టి తరలిస్తున్నారు. ఈ విషయంపై పలువురు ప్రశ్నిస్తే వారిపై దాడులకు దిగుతున్నారు. వాల్టా చట్టానికి ఎదెచ్చగా గండికోడుతూ ప్రభుత్వ ఆదాయాన్ని దుర్వినియోగం చేస్తున్న మనోహరాబాద్ మండలంలోని అధికారులు వారి వారి మూల్యం తీసుకొని ఇష్టాగోషంగా అక్రమ మట్టి రవాణా పై చర్యలు లేకుండా వ్యవహరిస్తున్నారని పలువురు ప్రజలు ఆరోపిస్తున్నారు. జిల్లా కలెక్టర్ మండలంలోని తిష్ట వేసి ఏళ్ళు గడుస్తున్న అధికారులపై బదిలీలు రేటు ఎందుకు వేయడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ అధికారైన మూడు సంవత్సరాలు మాత్రమే ఉండాల్సి ఉన్న ఏళ్లు గడుస్తున్నా ఇక్కడ క్లిష్ట వేసి నేనే రాజు నేనే మంత్రి అనే విధంగా ఒకవైపు మాత్రమే అధికారులు వత్తాసు పలుకుతున్నారని పలు గ్రామాల ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులపై జిల్లా కలెక్టర్ బదిలీ వేటు వేయాలని పలువురు ఆంకాక్షిస్తున్నారు. అధికారులు న్యాయం చేయాల్సిన పని ఒకవైపే హిస్టారీతిన వ్యవహరిస్తున్నారని మండలంలోని అధికారులతో మాకు న్యాయం జరగడం లేదని పలు మహిళా సంఘాలు పలు గ్రామాల వ్యక్తులు మీడియాతో గోడుమంటున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి సంబంధిత అధికారులపై బదిలీ వేటు వేసి వారిని బదిలీ చేయాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఇదిలా ఉంటే అక్రమ మట్టి రవాణా టి జి ఐ ఐ సి కొండాపూర్ పారిశ్రామిక వాడలో డివైడర్లు ఏర్పాటు చేసి ఏళ్ళు గడుస్తున్నా డివైడర్లపై పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి డివైడర్లపై ఏర్పాటు చేసిన వీధి వెలిగించకుండా ఏళ్ల తరబడి శూన్యంగానే చూస్తున్నారని పారిశ్రామిక ప్రాంత ప్రజలు సదర్ కాంట్రాక్టర్ నిర్లక్ష్యమే అని ఆరోపిస్తున్నారు. రోడ్లు డివైడర్లు వీధిలైట్లు వేసి కాంట్రాక్టర్ తన బిల్లు డ్రా చేసుకోవడం జరిగిందని పలువురు విమర్శిస్తున్న ఇప్పటివరకు దీపాలు వెలగడం లేదు డివైడర్ల పై పిచ్చి మొక్కలు దర్శనమిస్తూ కనిపిస్తున్నాయని డివైడర్లపై పూల మొక్కలు పెట్టి వాటికి ట్యాంకర్ల ద్వారా నీరు అందించేలా చూసే బాధ్యత లేదా అని కొండాపూర్ గ్రామ ప్రజలు కాంట్రాక్టర్ పై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు కాంట్రాక్టర్ ఈ పనులు చేయకపోవడం వెనక పై అధికారుల చేతివాటం ఎంతుందో అందుకే ఇలాంటి పనులు చేయలేకపోతున్నాడని పలువురు విమర్శిస్తున్నారు.



# సిద్దిపేట నుంచి హనుమాన్ దీక్షా రథయాత్ర

– యాత్రను ప్రారంభించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు



**సిద్ధిపేట ప్రతినిధి, ఏప్రిల్ 01 , (ప్రజా జ్యోతి) :** సిద్ధిపేట భూమి మరోసారి ఆధ్యాత్మిక చైతన్యంతో నిండిపోయింది. హనుమాన్ దీక్షా మహిమను గ్రామాల వారీగా విస్తరించేందుకు పీఠాధిపతులు శ్రీ శ్రీ దుర్గాప్రసాద్ స్వామీజీ చేపట్టిన 108 గ్రామాల రథయాత్ర బుధవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ రథయాత్రను సిద్ధిపేట పంచముఖ హనుమాన్ దేవాలయం వద్ద మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సిద్ధిపేట నుంచి ప్రారంభమైన ప్రతి ఆధ్యాత్మిక సంకల్పం సఫలమవుతుందనే నమ్మకం ప్రజల్లో బలంగా ఉందన్నారు. హనుమాన్ దీక్ష, భిక్షా కార్యక్రమాలు, కోటి హనుమాన్ చాలీసా పారాయణం వంటి మహత్తర కార్యక్రమాలు ఈ నేల నుంచే ప్రారంభమై విశేష స్పందన పొందాయని గుర్తుచేశారు. విజయవాడ తర్వాత హనుమాన్ తెప్పోత్సవం సిద్ధిపేటలోనే నిర్వహించడం ఈ ప్రాంత ఆధ్యాత్మిక వైభవానికి నిదర్శనమన్నారు. ప్రతి సంవత్సరం స్వామీజీ కొత్త సంకల్పాలతో ముందుకు వస్తూ, వాటిని విజయవంతం చేసేందుకు అహర్నిశలు శ్రమిస్తారని అన్నారు. ముఖ్యంగా గిరిజన తండాలు వంటి వెనుకబడిన ప్రాంతాల్లో హనుమాన్ మాల, దీక్ష గొప్పతనాన్ని పరిచయం చేయడం సమాజానికి ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ఈ రథయాత్ర ద్వారా రాష్ట్రవ్యాప్తంగా భక్తి భావాన్ని పెంపొందించడమే లక్ష్యమని, ప్రజల్లో ఆంజనేయ స్వామిపై విశ్వాసం మరింత బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. స్వామీజీ ఆశీస్సులతో ఈ యాత్ర విజయవంతంగా కొనసాగాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి రథయాత్రకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమములో కౌన్సిలర్ లు కోండం సంపత్ రెడ్డి , అరవింద్ రెడ్డి, లక్ష్మణ్, పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు నేతి కైలాసం , మురం శెట్టి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# న్యూఢిల్లీలో మెరిసిన సిద్దిపేట ప్రతిభ

**సిద్ధిపేట రూరల్, ఏప్రిల్ 01 (ప్రజాజ్యోతి):** న్యూఢిల్లీ ఆనందాశ్రమంలో నిర్వహించిన అస్మిత యోగాసన నేషనల్ లీగ్ పోటీలలో సిద్ధిపేట జిల్లా ప్రతినిధులు ప్రత్యేక గుర్తింపు పొందారు. తోట సతీష్ జ్యూరీగా, తోట సంధ్య న్యాయనిర్ణేతగా సేవలందించి ప్రశంసలు అందుకున్నారు. యోగాసన భారత్ సెక్రటరీ జనరల్ డా. జైదీప్ ఆర్య వారిని సత్కరించారు. మనీషా, పూజిత, శ్రీ ప్రసన్న జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచారు. యోగాసనానికి దేశవ్యాప్తంగా ఆదరణ పెరుగుతోందని, ఒలింపిక్ స్థాయికి తీసుకెళ్లడం లక్ష్యమని డా. ఆర్య తెలిపారు. మహిళల ఆరోగ్యం, క్రీడా అభివృద్ధికి అస్మిత లీగ్ ఉపయోగకరమన్నారు.




ఈ సందర్భంగాసిద్ధిపేట జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు తోట అశోక్, ప్రధాన కార్యదర్శి నిమ్మ శ్రీనివాస్ రెడ్డి, , తెలంగాణ యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీధర్ రావు, ప్రధాన కార్యదర్శి నందనం కృపాకర్ తదితరులు అభినందనలు తెలిపారు.

## అడ్వకేట్ బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం బాధ్యతలు స్వీకారం

బార్ అసోసియేషన్ అభివృద్ధికి కట్టుబడి ఉంటాను : అధ్యక్షుడు భక్త కుమార్






**పరిగి, ఏప్రిల్ 01 (ప్రజాజ్యోతి):** పరిగి అడ్వకేట్ బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం బుధవారం పదవి బాధ్యతలు స్వీకరించింది. ఎన్నికల అధికారి చేత ప్రమాణ స్వీకారం చేయించబడిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జూనియర్ సివిల్ జడ్జ్ నాగుల శిల్ప హాజరయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు భక్త కుమార్ మాట్లాడుతూ బార్ అసోసియేషన్‌కు అవసరమైన అన్ని వసతులను సమకూర్చేందుకు కృషి చేస్తానని, అలాగే సీనియర్ న్యాయవాదుల సలహాలను తీసుకుంటూ ముందుకు సాగుతానని తెలిపారు. కార్యవర్గంలో జనరల్ సెక్రటరీగా ఈ. రాజేందర్ గౌడ్, వైస్ ప్రెసిడెంట్‌గా ఇ. రవీందర్, జాయింట్ సెక్రటరీగా ఎస్. శ్రీనివాస్ రెడ్డి, లైబ్రేరియన్‌గా రాహత్ హుస్సేన్, ట్రెజరర్‌గా జయలక్ష్మి, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా ఎం.డి. అలిముద్దీన్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా యాదయ్య, ఎం. శ్రీనివాస్, రాజ్ కుమార్ నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అలాగే జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబాలకు అండగా సీఎంఆర్ఎఫ్ చెక్కులు

– చాకల్ పల్లి మాజీ సర్పంచ్ రాములమ్మ శేఖర్



**చౌడాపూర్ మండల్ (ప్రజా జ్యోతి) ఏప్రిల్ 01 :** వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండల పరిధిలో ని చాకల్ పల్లి గ్రామంలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ఆదేశానుసారం చాకల్ పల్లి మాజీ సర్పంచ్ రాములమ్మ శేఖర్ సిఎంఆర్ఎఫ్ చెక్కులను బాధిత కుటుంబాలకు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ సీఎంఆర్ఎఫ్ చెక్కుల ద్వారా పేద కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చెంగు నాయక్,వార్డు సభ్యులు,గ్రామ పెద్దలు,లబ్ధిదారులు ధర్మనాయక్,వడ్డే ఎల్లయ్య,తర్య నాయక్,గాంగ్య నాయక్ తదితరులు పాల్గొనడం జరిగింది.

## ఆసియన్ ట్రాక్ ఛాంపియన్‌షిప్స్‌లో 11 పతకాలు కైవసం చేసుకున్న ఆదిత్య మెహతా ఫౌండేషన్ అథ్లెట్లు



**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 01 (ప్రజాజ్యోతి):** ఫిలిప్పీన్స్‌లోని తగాయ్టే వెలోడ్రోమ్‌లో జరిగిన ఆసియన్ ట్రాక్ ఛాంపియన్‌షిప్స్ 2026లో హైదరాబాద్ కి చెందిన ఆదిత్య మెహతా ఫౌండేషన్ (ఏఎంఎఫ్)లో శిక్షణ పొందిన పారాసైక్లిస్టులు అద్భుత ప్రదర్శన కనబరిచారు. భారత పారాసైక్లింగ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన వీరు మొత్తం 11 పతకాలను సాధించి దేశానికి గర్వకారణంగా నిలిచారు. ఈ పోటీలలో విశ్వ అద్భుత ప్రదర్శన కనబరిచారు. ఒక కిలోమీటర్ టైమ్ ట్రయల్, ఎలిమినేషన్ రేస్, స్ప్రింట్, స్క్రాచ్ రేస్, ఇండివిడ్యువల్ పర్స్యూట్ విభాగాలలో మొత్తం ఐదు రజత పతకాలు గెలుచుకున్నారు. అద్భుతమైన ఆల్ రౌండ్ ప్రదర్శనతో లిషా భారత పతకాల పట్టికను మరింత బలోపేతం చేశారు. ఆమె ఎలిమినేషన్ రేస్, స్ప్రింట్‌లో రెండు రజత పతకాలు, ఒక కిలోమీటర్ టైమ్ ట్రయల్,స్క్రాచ్ రేస్, ఇండివిడ్యువల్ పర్స్యూట్‌లో మూడు కాంస్య పతకాలు సాధించారు. పవన్ కుమార్ ఎలిమినేషన్ రేస్‌లో కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఈ విజయం భారత పారాసైక్లింగ్ క్రీడాకారుల పట్టుదలకు, ఆదిత్య మెహతా ఫౌండేషన్ అందిస్తున్న శిక్షణకు నిదర్శనంగా నిలిచింది. ఆదిత్య మెహతా ఫౌండేషన్ లో శిక్షణ పొందిన అథ్లెట్లు ఏడు రజత, నాలుగు కాంస్య పతకాల సాధించారు. ఈ పోటీల్లో మొత్తం పదకొండు దేశాలు పాల్గొన్నాయి. అంతర్జాతీయ వేదికపై భారత పారాసైక్లింగ్‌కు ఈ అద్భుత విజయం ఒక ముఖ్యమైన మైలురాయి. భాగస్వాములైన అథ్లెట్లు అత్యున్నత స్థాయిలో రాణించడానికి భాగస్వాముల సహకారం ఎంతో ఉంది. ఇన్వెస్కో, ఆల్కాన్, జీఎంఎంసీఓ, ఎన్టీటీ డేటా బిజినెస్ సొల్యూషన్స్, ఫ్లట్టర్ ఎంటర్టైన్మెంట్ ఇండియాకు ఆదిత్య మెహతా కృతజ్ఞతలు తెలిపింది.

# కాంగ్రెస్ పదవులన్నీ కరణ్ కోటకే!

◆ మండల పార్టీ అధ్యక్ష పదవి మార్చే యోచనలో అధిష్టానం ◆ ఇప్పటికే యూత్ కాంగ్రెస్ కు ప్రాతినిధ్యం
◆ 2017కు ముందున్న వారికే పార్టీ పదవులు అమలు జరిగేనా? ◆ దరఖాస్తు చేసుకున్న ఐదుగురులో ఎవ్వరు!
◆ దళితులకు దక్కని అవకాశం ◆ వీరారెడ్డిపల్లి సర్పంచ్‌కు బాధ్యతలు ఇస్తారనే ప్రచారం!



**తాండూరు మార్చ్ 29 ప్రజా జ్యోతి :** కాంగ్రెస్ పార్టీ సంస్థ గత ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసేందుకు పార్టీ అధిష్టానం వేగవంతం చేసే పనిలో పడింది. తాజాగా మండల అధ్యక్ష పదవులను మార్చేందుకు సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే తాండూరు మండలం కరణ్ కోట్ గ్రామానికి చెందిన తుపాకుల అనిల్ కుమార్ తాండూర్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవిలో కొనసాగుతుండగా తాండూరు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడుగా తుపాకుల సుధాకర్ కొనసాగుతున్నారు .ప్రస్తుతం పార్టీ సంస్థకత ఎన్నికలలో భాగంగా మండల అధ్యక్ష పదవి కూడా కరణ్ కోట్ గ్రామ సర్పంచ్ కు ఇచ్చే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. గతంలో కూడా మండల పార్టీ అధ్యక్షుడుగా పనిచేసిన రాజ్ కుమార్ మేజర్ పంచాయతీ అయినా కరన్ కోట్ సర్పంచ్‌గా ఉండడంతో అవకాశం వచ్చే అవకాశం లేదని ప్రచారం కొనసాగుతున్నారు. తాండూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి కోసం పోటీలో ఉన్న నాయకులలో వీరారెడ్డి పల్లి సర్పంచ్ గతంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సేవలందించిన అనుభవం ఉండడంతో పార్టీ అధ్యక్ష పదవి వస్తుందని కాంగ్రెస్ కార్యకర్తలు చర్చించుకుంటున్నారు.

పార్టీ అధ్యక్ష పదవి మార్చే యోచనలో అధిష్టానం ఉండడంతో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష పదవి కోసం కొత్లాపూర్ గ్రామం ఎస్సీ సామజిక వర్గానికి చెందిన కోతి గోపాల్,బీసీ వర్గానికి చెందిన జెన్నె నాగప్ప, కే జగదీష్,రెడ్డి వర్గానికి చెందిన వీరారెడ్డిపల్లి సర్పంచ్ పురుషోత్తం రెడ్డి, కరణ్ కోట్ గ్రామ సర్పంచ్ రాజ్ కుమార్ పార్టీ పదవిని ఆశిస్తున్న వారిలో ఉన్నారు. ఏది ఏమైనా మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేసే బలమైన నాయకుడికి పార్టీ పగ్గాలు అప్పగించే అవకాశాలే మెండుగా ఉన్నాయని ప్రచారం సాగుతుంది. అదేవిధంగా ఎంపిటిసి జడ్పిటిసి ఎన్నికలకు కూడా రానున్నడంతో మండల పార్టీ అధ్యక్ష పదవి కీలకంగా మారనుంది. మరోవైపు 2017 కు ముందున్న కార్యకర్తలకి కాంగ్రెస్ పార్టీ పదవులకు అర్హులు అని గతంలో తీవ్రంగా చర్చ జరిగింది. మరి ఏ విధంగా స్పందిస్తారనేది అధిష్టానం నిర్ణయం కోసం కార్యకర్తలు ఎదురుచూస్తున్నారు.

## చౌడాపూర్ మండల కేంద్రంలో వికారాబాద్ జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

– పదవ తరగతి విద్యార్థులు 100% ఉత్తీర్ణత సాధించాలి
– ప్రతి విద్యార్థికి ప్రతి సబ్జెక్టు పై పూర్తి అవగాహన కలిగి ఉండాలి
– వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి








**చౌడాపూర్ మండల్ (ప్రజా జ్యోతి) ఏప్రిల్ 01 :** వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండల కేంద్రంలో బుధవారం జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా పర్యటించి ఫర్టిలైజర్ దుకాణం,గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యవసర అమ్మక కేంద్రం,ప్రభుత్వ ప్రాథమిక,ఉన్నత పాఠశాల,అంగన్వాడీ కేంద్ర సందర్శనతోపాటు వివిధ నిర్మాణ దశల్లో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా పదవ తరగతి పరీక్షలు జరుగుతున్న సందర్భంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న భౌతిక శాస్త్రం (ఫిజిక్స్) ప్రత్యేక తరగతిలో ఉపాధ్యాయుల బోధన విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. విద్యార్థులందరికీ ప్రతి సబ్జెక్టు పైన పూర్తి పట్టును సాధించేలా విద్యాబోధన చేయాలన్నారు. ముఖ్యమైన ప్రశ్నలకు తర్ఫీదు ఇస్తూనే,గత సంవత్సరం వచ్చిన ప్రశ్నాపత్రాలకు సమాధానాలు విద్యార్థుల ద్వారా రాబట్టే విధంగా విద్యాబోధన చేయాలని కలెక్టర్ సూచించారు. ఇప్పటికే జాతీయ ఉపాధి హామీ కింద మంజూరైన కిచెన్ షెడ్,బాత్ రూమ్ లను వెంటనే నిర్మాణం చేపట్టాలని గ్రామ సర్పంచ్, అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి మధ్యాహ్న భోజనానికి సంబంధించిన వంటలను పరిశీలించి,మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టిక ఆహారాన్ని అందించాలని టీచర్ కు సూచించారు. గర్భిణి,బాలింతల వివరాలపై ఆరా తీస్తూ బాలామృతం అందరికీ ఇవ్వాలని సూచిస్తూ స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా సామ్ మామ్ పిల్లలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పౌష్టిక ఆహారాన్ని అందించాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకనుగుణంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని హౌసింగ్ పీడీకి కలెక్టర్ సూచించారు. ఇళ్ల నిర్మాణాల్లో ఏమైనా సాంకేతిక సమస్యల ఉంటే సరిచేసి లబ్ధిదారులకు సహకరించాలని పంచాయతీ కార్యదర్శులకు కలెక్టర్ తెలిపారు. ముందుగా ఫర్టిలైజర్,రేషన్ డీలర్ షాపులను ఆకస్మికంగా తనిఖీ చేసి డీలర్ల వద్ద ఉన్న స్టాక్ వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. డీలర్ల వద్ద ఎరువులు పూర్తిగా అయిపోక ముందే ముందస్తుగా ఇండెంట్ పెట్టి యూరియాను తెప్పించుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ పర్యటనలో జిల్లా విద్యాధికారి రేణుకా దేవి, జిల్లా వ్యవసాయ అధికారి రాజా రత్నం, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో సోమలింగం, ఎంఇఓ రామచందర్, సర్పంచ్ నవీన్ వివిధ అధికారులు ప్రజా నాయకులు తదితరులు ఉన్నారు.

## హనుమాన్ జయంతి శోభా యాత్ర సందర్భంగా ట్రాఫిక్ ఆంక్షలు

– భారీ శోభా యాత్ర నేపథ్యంలో కీలక రహదారులపై ట్రాఫిక్ నియంత్రణ
– 12 కిలోమీటర్ల హనుమాన్ యాత్ర – వాహనదారులకు పోలీసుల సూచనలు




**బోయిన్ పల్లి, ఏప్రిల్ 01 (ప్రజా జ్యోతి) :** హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఏప్రిల్ 2,న నిర్వహించనున్న "శ్రీ వీర హనుమాన్ విజయ యాత్ర" దృష్ట్యా భక్తుల సౌకర్యార్థం, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం మల్కాజిగిరి ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. యాత్ర వివరాలు:ప్రధాన శోభా యాత్ర గురువారం ఉదయం 11:30 గంటలకు గౌలిగూడ రామ్ మందిర్ నుండి ప్రారంభమై రాత్రి 8:00 గంటలకు తడ్బండ్ శ్రీ హనుమాన్ దేవాలయం వద్ద ముగుస్తుంది. సుమారు 12 కిలోమీటర్ల మేర ఈ యాత్ర కొనసాగనుంది. ఇందులో సుమారు 2 కిలోమీటర్ల మేర మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఉంటుంది. అలాగే కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయం సహా వివిధ ప్రాంతాల నుండి 14 ఉప యాత్రలు ప్రధాన శోభా యాత్రలో కలుస్తాయి. అదనంగా కమిషనరేట్ పరిధిలో మరో 92 స్థానిక ఊరేగింపులు నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు.

**ట్రాఫిక్ ఆంక్షలు -- మళ్లింపులు :** యాత్ర సాగే మార్గాల్లో వాహనాల రాకపోకలను తాత్కాలికంగా నియంత్రించడం లేదా మళ్లించడం జరుగుతుంది. ముఖ్యంగా భారీ వాహనాలు, ఆర్టీసీ బస్సులు, సరుకు రవాణా వాహనాలపై ప్రత్యేక ఆంక్షలు అమలులో ఉంటాయి. ఊరేగింపు జరిగే మార్గాల్లో పార్కింగ్‌కు అనుమతి ఉండదు. నిబంధనలు ఉల్లంఘించిన వాహనాలను టోయింగ్ చేస్తామని పోలీసులు హెచ్చరించారు.

**రద్దీ ఉండే అవకాశం ఉన్న ప్రధాన ప్రాంతాలు :** సీటీవో -- తడ్బండ్ దేవాలయం మార్గం, మల్కాజిగిరి -- ఆనంద్‌బాగ్ రోడ్, సఫిల్‌గూడ -- నేరెడ్‌మెట్, ఈసీఐఎల్ -- ఏఎస్ రావు నగర్, సైనిక్‌పురి -- యాప్రాల్, హస్మత్‌పేట్, తార్నాక -- హబ్సిగూడ మార్గాలు, కర్మన్‌ఘాట్ దేవాలయం పరిసరాలు మరియు ఎన్జీవోస్ కాలనీ నుండి ఎల్‌బి నగర్ వరకు ఉన్న రహదారులపై ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉంది.

**భక్తుల కోసం పార్కింగ్ ఏర్పాట్లు (తడ్బండ్ వద్ద) :**
- ధోబీ ఘాట్
- హనుమంత రెడ్డి కాంప్లెక్స్, తడ్బండ్ ఎక్స్ రోడ్స్
- కార్ఖానా వద్ద ఇంపీరియల్ గార్డెన్స్ ముందు ఉన్న ఖాళీ స్థలం

ప్రజలకు విజ్ఞప్తి: ప్రజలు ఊరేగింపు సమయాలను గమనించి తమ ప్రయాణాలను ముందుగానే ప్లాన్ చేసుకోవాలని, ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని అధికారులు కోరారు. అత్యవసర పరిస్థితుల్లో 112 కు కాల్ చేయవచ్చు. అలాగే మల్కాజిగిరి ట్రాఫిక్ హెల్ప్‌లైన్ నంబర్లు 8712662999, 8712662850 ను సంప్రదించవచ్చు.

## ప్రజల సమస్యల పరిష్కారానికై ఇంటింటికి సిపిఐ

– విరాళాలు ఇవ్వండి! పాలమకుల జంగయ్య సిపిఐ జాతీయ సమితిసభ్యులు



**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 01 (ప్రజాజ్యోతి) :** భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ పిలుపుమేరకు ఇంటింటికి సిపిఐ కార్యక్రమం బుధవారం శేరిలింగంపల్లి నియోజకవర్గంలో కొత్తగూడ చౌర లో ప్రారంభించి. కొండాపూర్ వరకు మాస్ క్యాంపెనింగ్ లో పాల్గొన కామ్రేడ్ పాలమాకుల జంగయ్య. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....ప్రజల కష్టాలు పెరుగుతున్న ఈ సమయంలో కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయి. రోజురోజుకీ పెరుగుతున్న ధరలు,నిరుద్యోగం, రైతుల సమస్యలు,పేదల బతుకులు కష్టాల్లో కూరుకుపోతున్నా ప్రభుత్వాలు మాత్రం మూగనటకమే ఆడుతున్నాయి. ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత గల పాలకులు కార్పొరేట్ శక్తుల ముందు తలవంచి ప్రజలను నిర్లక్ష్యం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (సిపిఐ) ప్రజల పక్షాన పోరాటాన్ని మరింత బలపర్చేందుకు సిద్ధమైంది. ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకుంటూ, వాటి పరిష్కారం కోసం ఉద్యమాలను ఉధృతం చేయడానికి ఆర్థిక సహకారం అత్యవసరం. అందుకే ప్రతి కార్మికుడు, రైతు, యువకుడు, మహిళ ముందుకు వచ్చి ఇంటింటికి సిపిఐ ప్రజా సమస్యల పరిష్కారానికి విరాళాలు ఇవ్వండిఅనే పిలుపునకు స్పందించాలి. ప్రభుత్వాల వైఫల్యాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి ధరల నియంత్రణలో పూర్తిగా విఫలం నిరుద్యోగ సమస్యపై నిర్లక్ష్యంరైతులకు న్యాయం చేయడంలో విఫలంగ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో ప్రజలపై భారాలు ఈ దోపిడీ పాలనకు చెక్ పెట్టేది ప్రజల ఐక్యతే. సిపిఐ ఆధ్వర్యంలో జరుగుతున్న పోరాటాలకు బలంగా నిలబడేందుకు ప్రతి ఒక్కరూ విరాళాలు అందించి ఉద్యమాన్ని బలోపేతం చేయాలి. ఈ కార్యక్రమంలో కామ్రేడ్ టి రామకృష్ణ. రాష్ట్ర సమితి సభ్యులు శేరిలింగంపల్లి సిపిఐ పార్టీ కార్యదర్శి కే చందు యాదవ్,ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు కూన సుధాకర్,సహాయ కార్యదర్శి జెట్టి శ్రీనివాస్,ఏఐటిసి అధ్యక్షులు టి రాములు,ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి కె శివకుమార్,కే ఖాసీం ఆఫీస్ పెట్ ఇన్చార్జి బి నారాయణ,టెలికం నగర్ కార్యదర్శి చంద్రమ్మ, రఘు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పరిగి సబ్ జైలులో ఖైదీలకు ఉచిత వైద్య శిబిరం



**పరిగి, ఏప్రిల్ 01 (ప్రజా జ్యోతి) :** తెలంగాణ ప్రభుత్వ 99 రోజుల ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా పరిగి సబ్ జైలులో బుధవారం వికారా బాద్‌కు చెందిన శ్రీ సాయి డెంటల్ హాస్పిటల్ అండ్ కాలేజ్ సహకారంతో జైలు సూపరిం టెండెంట్ రాజ్ కుమార్ ఆధ్వ ర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జైలులోని ముద్దాయిలకు అలాగే సిబ్బందికి వైద్యులు సమగ్ర ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి జైలు సూపరింటెండెంట్ రాజ్ కుమార్ మాట్లాడుతూ ఖైదీల ఆరోగ్య పరిరక్షణ ప్రాథమిక బాధ్యత అని, ఇలాంటి కార్యక్రమాలకు ప్రైవేటు ఆసుపత్రులు ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు. ఈ శిబిరంలో శ్రీ సాయి డెంటల్ హాస్పిటల్ పిఆర్ఓ రవీందర్ గౌడ్, వైద్యులు వివేక్, శిశ్య ప్రియ, కేజియా, గాయత్రీ దేవి, జైలు హెడ్ వార్డర్ జి.బి. విశ్వనాథ రావు, వార్డర్లు శ్రీను, హరికృష్ణ తదితరులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు గౌతాపూర్ రానున్న ఎమ్మెల్యే

– ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక బహిరంగ సభ



**తాండూరు ఏప్రిల్ 1 ప్రజా జ్యోతి :** తాండూరు మండలం గౌతాపూర్ గ్రామంలో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం రోజు గ్రామ సర్పంచ్ సృజన అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జెన్నె నాగప్ప ఒక్క ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గౌతాపూర్ గ్రామంలో నిర్వహించే గ్రామ సభకు తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి హాజరుకానున్నారని చెప్పారు. ఇట్టి సభ స్థానిక గ్రామపంచాయతీ వద్ద ఉదయం 10గంటల 30 నిముషాలకు నిర్వహించే గ్రామ సభకు స్థానిక వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు అధికారులు హాజరు కానునట్లు చెప్పారు.

## ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అవర్చుకోవాలి

– రాష్ట్ర యువజన నాయకులు రాగం అనిరుధ్ యాదవ్



**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 01 (ప్రజాజ్యోతి) :** శేరిలింగంపల్లి డివిజన్... రాజీవ్ గృహకల్పలో శ్రీశ్రీశ్రీ మాధవనంద సరస్వతి స్వామి వారి దివ్య ఆశీస్సులతో మాజీ స్టేట్ సోషల్ వెల్ఫేర్ బోర్డు ఛైర్పర్సన్ రాగం సుజాత యాదవ్, శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ దంపతుల సొంత ఖర్చులతో నూతనంగా నిర్మాణం చేపట్టిన శ్రీ షిర్డీ సాయినాథ, మార్కండేయ స్వామి,సంతాన నాగదేవత అమ్మవారి ఆలయంలో విగ్రహా ప్రతిష్టాపన మహోత్సవం జరిగి 41 రోజులు పూర్తయిన సందర్భంగా వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించిన మండల పూజా, లక్ష్మీ గణపతి నవగ్రహ స్థాపిత దేవత మూల మంత్ర హోమాలు, ప్రధాన కలశ స్థాపన పూజ కార్యక్రమంలో రాష్ట్ర యువజన నాయకులు రాగం అనిరుధ్ యాదవ్ గారు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాగం అనిరుధ్ యాదవ్ మాట్లాడుతూ.. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రజలందరూ తమ కుటుంబాలతో సుఖశాంతులతో.. జీవించాలని ఈ సందర్భంగా ఆ దేవదేవులను ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ సీనియర్ నాయకులు, యువ నాయకులు,మహిళా నాయకురాళ్లు, ఆలయ కమిటీ సభ్యులు,భక్తులు తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి జన్మ నక్షత్ర ఉత్తర ఫల్గుణి పూజలో పాల్గొన్న మిరియాల ప్రీతమ్



**శేరిలింగంపల్లి, ఏప్రిల్ 01 (ప్రజాజ్యోతి) :** చందానగర్‌లోని జగద్గురు శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయము, పి.జె.ఆర్ ఎంక్లేవ్ రోడ్, దీప్తి శ్రీ నగర్ వద్ద శ్రీ అయ్యప్ప స్వామి జన్మ నక్షత్రం (ఉత్తర ఫల్గుణి) సందర్భంగా నిర్వహించిన పూజా మహోత్సవం కార్యక్రమంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మిరియాల ప్రీతమ్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరకపూడి గాంధీ ,మియాపూర్ మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, హైదర్ నగర్ మాజీ కార్పొరేటర్ నార్ని శ్రీనివాస్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు రఘునాథ్ రెడ్డి,ప్రసాద్ గురుస్వామి పాల్గొన్నారు. అలాగే ఆలయ కమిటీ సభ్యులు, భారీ సంఖ్యలో భక్తులు హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామి ఆశీస్సులు పొందారు. కార్యక్రమం భక్తి వాతావరణంలో విజయవంతంగా నిర్వహించబడింది.

# కేంద్రమంత్రి బండి సంజయ్ క్షమాపణ చెప్పాలి

## బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 1 (ప్రజాజ్యోతి ): నగర మున్సిపల్ బడ్జెట్‌పై బీఆర్ఎస్ పార్టీ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. బడ్జెట్ సమావేశం అనంతరం నిర్వహించిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ, కేంద్రమంత్రి బండి సంజయ్ నగర ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.మేయర్ పదవి ఇస్తే కేంద్ర నిధులు తీసుకొచ్చి నగరాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చిన బండి సంజయ్, తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేంద్రం నుంచి వచ్చే నిధులను ఎందుకు చూపలేదని ప్రశ్నించారు. ప్రత్యేక అధికారుల పాలనలో రూపొందించిన పాత బడ్జెట్‌ను కాపీ పేస్ట్ చేసి ప్రవేశపెట్టారని ఆరోపించారు.బడ్జెట్‌లో నిధుల సమీకరణపై స్పష్టత లేకపోవడం హాస్యాస్పదమన్నారు . పండుగల ఖర్చులను తగ్గిస్తూ, అవసరం లేని ఉద్యోగుల నియామకాలు, వాహనాలపై వృథా ఖర్చులను తగ్గించాల్సిందిగా సూచించారు.నగరంలో సుమారు 18 వేల ఇండ్లపై పెంచిన ఆస్తి



పన్నును తగ్గించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఆదాయం కేవలం ఆస్తి పన్ను ద్వారానే కాకుండా ప్రకటనలు, వినోద రంగాల ద్వారా కూడా వస్తుందని పేర్కొన్నారు. ప్రజలపై పన్నుల భారం మోపకూడదని అన్నారు.ప్రజలను మోసం చేసి గెలిచామని బండి సంజయ్ అంగీకరించి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ కార్పొరేటర్లు అధికారంలో ఉండి కూడా కుక్కలు, కోతుల సమస్యలపై నిరసనలు వ్యక్తం చేయడం విచారకరమన్నారు.గృహప్రవేశం అనంతరం అక్రమ కట్టడాల పేరుతో నోటీసులు ఇస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, కాంగ్రెస్, బీజేపీ కమిషన్ల కోసం ఇలా చేస్తున్నారని ఆరోపించారు. పర్మిషన్ లేని ఇండ్లను కూల్చుతారా అని ప్రశ్నించారు.
డంప్ యార్డ్ ఏర్పాటు, నగర అభివృద్ధిపై విఫలమైనందుకు బండి సంజయ్ క్షమాపణ చెప్పాలని మళ్లీ డిమాండ్ చేశారు. మున్సిపల్‌కు ఆదాయం పెరగాలంటే అనధికార లేఅవుట్లను రెగ్యులరైజ్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కచ్చు రవి, నగర ప్రధాన కార్యదర్శి గడ్డం ప్రశాంత్ రెడ్డి, మైనార్టీ అధ్యక్షుడు షౌకత్, ప్రధాన కార్యదర్శి వాజిద్, యూత్ ప్రధాన కార్యదర్శి గంగాధర చందు, డివిజన్ అధ్యక్షులు ఆరె రవి గౌడ్, చేతి చంద్రశేఖర్, తౌంటి రాజేందర్, మంతెన కిరణ్, గూడెల్లి రాజకుమార్, యువ నాయకులు నారదాసు వసంతరావు, సత్తినేని శ్రీనివాస్, సుంకేపాక విద్యాసాగర్, మిడిదొడ్డి నవీన్, నాయకురాలు గంటల రేణుక, సయఫ్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించిన సర్పంచ్

గంగాధర ఏప్రిల్ 01:(ప్రజా జ్యోతి) గంగాధర మండలం రంగారావుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఈజీఎస్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను బుధవారం సర్పంచ్ దాసరి



శంకరయ్య ప్రారంభించారు. గ్రామాభివృద్ధికి నిధులు కేటాయించిన చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యానికి ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ద్యావ బహదూర్ రెడ్డి, కార్యదర్శి మౌనిక, పంచాయతీ పాలకవర్గ సభ్యులు బండ అంజయ్య, బోనాల లావణ్య, న్యాతరి లింగయ్య, గాలి లక్ష్మీదేవి, గాలి వర్షిత, జక్కుల ప్రశాంత్, దుమాల అరుణ కాంగ్రెస్ నాయకులు కమలాకర్, రామ్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, లక్ష్మారెడ్డి మొండయ్య స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# నారాయణపూర్‌లో కుట్టుమిషన్ శిక్షణ కేంద్రం ప్రారంభం

సుల్తానాబాద్ ఏప్రిల్ 1 (ప్రజా జ్యోతి) సుల్తానాబాద్ మండలం నారాయణపూర్ గ్రామంలో గ్రామ స్వరాజ్య సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ సతీష్ బుధవారం ప్రారంభించారు. గ్రామీణ మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు ఆత్మనిర్భరంగా మారేందుకు ఇలాంటి శిక్షణలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కుట్టుమిషన్ శిక్షణ ద్వారా మహిళలు స్వయం ఉపాధిని ఏర్పరచుకుని కుటుంబ



ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎర్రవెల్లి రామారావు వార్డు సభ్యులు సభ్యులు కల్లెపెల్లి దేవేందర్ మండల సదానందం గర్వంద రజిత సతీష్ బాల్సాని సుజాత రమేష్ గాజుల శ్రీకాంత్ బాల్సాని రజిత రమేష్ రేచవేని శ్రీనివాస్ పంచాయతీ కార్యదర్శి, మంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ ధనలక్ష్మి, మండల ట్రైనర్ బండారి మమతతో పాటు మారేడుగుండ సది గ్రామ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 15 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం

సుల్తానాబాద్ ఏప్రిల్ 1 (ప్రజా జ్యోతి) : సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లి గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధికి మరో అడుగు పడింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు ఆదేశాల మేరకు



ఎన్ఆర్ఈజీఎస్ పథకం నిధులతో రూ.15 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. గ్రామంలోని గీకూరు శకుంతల ఇంటి నుంచి బిజిలి మల్లేశం ఇంటివరకు ఈ సీసీ రోడ్డు నిర్మాణాన్ని చేపడుతున్నారు. ఏళ్లుగా రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్న స్థానికులు పనులు ప్రారంభమవ్వడంతో ఆనందం వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే కు వారు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్థానిక నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వీరగోని రమేష్ గౌడ్, ఉపసర్పంచ్ నవీన్, వార్డ్ సభ్యులు, గ్రామ పెద్దలు పలువురు పాల్గొన్నారు.

# మండేపల్లిలో దొడ్డి కొమరయ్య విగ్రహ ప్రతిష్టాపనకు భూమి పూజ

తంగళ్ళపల్లి ఏప్రిల్ 1(ప్రజా జ్యోతి) : తంగళ్ళపల్లి మండలం మండేపల్లి గ్రామంలో తొలి తెలంగాణ సాయుధరైతంగా పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య విగ్రహా ప్రతిష్టాపన మండేపల్లి గ్రామంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ గాధగోని సాగర్ మాట్లాడుతూ నిజం సర్కార్ కు విష్ణూర్ రామచంద్ర రెడ్డి దొరలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో తొలి అమరవీరుడు దొడ్డి కొమురయ్య అని అతని త్యాగ ఫలితం వల్లనె తెలంగాణ సాయుధ రైతంగా పోరాటం మరింత పుంజుకుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో



గొల్ల కురుమ సంఘ సభ్యులు కాసాని శ్రీనివాస్ ముద్దాల,పరుశరాములు,అమర గౌండ మొండయ్యా,ఎనుగుల మహేష్,ఒగ్గు దేవయ్య,జగ్గాని జెలందర్,అమర గౌండ ప్రభుదాస్,గుంటి శ్రీను, అమర గౌండ ప్రశాంత్,ఏగుర్ల ఎల్లయ్య,బండి రాజు,రాగి పల్లి రఘుపతి రెడ్డి,రాగిపల్లి ప్రతాపరెడ్డి,రాగిపల్లి కృష్ణారెడ్డి,నక్క రవి,అసని మైపాల్ రెడ్డి,కొండయ్య, పెద్దయ్య,శశి, ఆనంద్,మల్లవ్వ,బాబాయ్, కృష్ణ,తదితరులు పాల్గొన్నారు.

# ఏప్రిల్ 15లోపు హెచ్ఎల్‌బీ బ్లాక్ నిర్ధారణ పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, ఏప్రిల్ 01( ప్రజాజ్యోతి ): జనగణన 2027 కార్యక్రమంలో భాగంగా హెచ్ఎల్‌బీ (హౌస్ లిస్టింగ్





బ్లాక్) నిర్ధారణ ప్రక్రియను ఏప్రిల్ 15లోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జనగణన 2027పై నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె. అరుణ శ్రీతో కలిసి అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జనగణన 2027 రెండు దశల్లో నిర్వహించబడుతుందని తెలిపారు. ప్రస్తుత సంవత్సరం మే 10 నుంచి హౌస్ లిస్టింగ్ కార్యక్రమం ప్రారంభమవుతుందని, ప్రతి ఇంటికి సంబంధించిన 35 ప్రశ్నల వివరాలను నెల రోజులలో సేకరించాలని సూచించారు. ఫిబ్రవరి 2027లో హౌస్ లిస్టింగ్ ఆధారంగా జనాభా వివరాల సేకరణ జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతి 300 ఇండ్లు లేదా 800 జనాభాను ఒక హెచ్ఎల్‌బీగా గుర్తించి బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఫీల్డ్ సర్వేలో అంచనాలకు మించి ఇండ్లు ఉండే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకొని 15 శాతం అదనంగా ఎన్యుమరేటర్లను నియమించాలని ఆదేశించారు.పట్టణ ప్రాంతాల్లో హెచ్ఎల్‌బీ ల సంఖ్య పెరిగే అవకాశం ఉందని, గ్రామాలు మరియు మున్సిపల్ వార్డుల వారీగా హెచ్ఎల్‌బీ వివరాలను పేపర్‌పై సిద్ధం చేసి అనంతరం ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రతి బ్లాక్ పరిధిలో ఇండ్లు, ఆలయాలు, ప్రార్థనా మందిరాలు, ఆటస్థలాలు, ఆసుపత్రులు తదితర వివరాలను సమగ్రంగా ప్రణాళికలో చేర్చాలని చెప్పారు. హెచ్ఎల్‌బీ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహిస్తే రాబోయే 1.5 సంవత్సరాల పాటు జనగణన కార్యక్రమం సజావుగా సాగుతుందని కలెక్టర్ తెలిపారు. తహసీల్దారులు, పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ కమిషనర్లు సమన్వయంతో రాబోయే 10 రోజుల్లో హెచ్ఎల్‌బీ విభజన పూర్తి చేయాలని ఆదేశించారు. 200 నుంచి 300 ఇండ్లు ఉన్న చిన్న గ్రామాలు, వార్డుల హెచ్ఎల్‌బీ వివరాలను కూడా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. హెచ్ఎల్‌బీ తుది నిర్ధారణను ఏప్రిల్ 15లోపు పూర్తి చేసి, ఆన్‌లైన్ ఎంట్రీలో జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. జనగణన 2027 అత్యంత కీలకమైన కార్యక్రమమని, ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయరాదని హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా హౌస్ లిస్టింగ్ కోసం సుమారు 1400 ఎన్యుమరేటర్లు అవసరమని అంచనా వేయగా, ప్రతి గ్రామం, మున్సిపాలిటీ పరిధిలో అవసరమైన సిబ్బంది వివరాలను సమర్పించాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్డీవోలు బి. గంగయ్య, సురేష్, ఎంపీడీవోలు, తహసీల్దారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# వార్డు సభలు విజయవంతంగా నిర్వహించాలి :కమిషనర్ ప్రఫుల్ దేశాయ్

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 1 (ప్రజాజ్యోతి ): ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం నగరవ్యాప్తంగా వార్డు (డివిజన్) సభలను విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఆదేశించారు. బుధవారం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో ఇంజనీరింగ్, సానిటేషన్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వార్డు సభల నిర్వహణకు అవసరమైన ప్రణాళిక, ఏర్పాట్లు, జనసమీకరణ, ముఖ్య అతిథుల ఆహ్వానం తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు.నగరంలోని 66 డివిజన్లలో ఉదయం 10 గంటలకు వార్డు సభలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైన చోట టెంట్లు, కుర్చీలు, తాగునీటి సదుపాయం కల్పించాలని ఆదేశించారు. ప్రతి డివిజన్‌కు





ఇంచార్జ్ అధికారులను నియమించినట్లు తెలిపారు. వార్డు అధికారులు, పాలకవర్గ సభ్యుల సహకారంతో ప్రజలను భారీగా సభలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, మెప్మా మహిళా సంఘాలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, యువత, అంగన్వాడీ, ఆశ వర్కర్లు, సంక్షేమ పథకాల లబ్ధిదారులు తప్పనిసరిగా పాల్గొనేలా చూడాలని సూచించారు. విద్యుత్, విద్య, వైద్యం, రెవెన్యూ తదితర శాఖల అధికారులు కూడా హాజరుకావాలని ఆదేశించారు. సభల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, లబ్ధిదారుల పేర్లు చదివే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి, గృహజ్యోతి, పెన్షన్లు, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, మహిళాశక్తి, రైతు భరోసా, మహిళా సంఘాల రుణాలు తదితర పథకాలపై సంబంధిత అధికారులు వివరాలు ఇవ్వాలని సూచించారు. అలాగే ఆస్తి పన్ను, నల్లా పన్ను, ట్రేడ్ లైసెన్స్ పన్నుల వసూళ్లు, డివిజన్ల వారీగా చేపట్టిన అభివృద్ధి పనులు, చేయాల్సిన పనులపై వివరాలు వెల్లడించాలని అన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు, అభ్యంతరాలు స్వీకరించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సభల్లో ప్రజలను భాగస్వాములను చేసి కార్యక్రమాలను పూర్తి స్థాయిలో విజయవంతం చేయాలని కమిషనర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్లు ఖాదర్ మొహియుద్దీన్, వేణు మాధవ్, ఎంహెచ్ఓ, డీఈలు, ఏఈలు, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, సానిటేషన్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

### అయ్యప్ప స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు

కాల్వ శ్రీరాంపూర్ ఏప్రిల్ 1 (ప్రజా జ్యోతి): కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని. పాండవుల గుట్ట సమీపంలో గల. నూతనంగా నిర్మించిన అయ్యప్ప



దేవాలయంలో. అయ్యప్ప జయంతి ఉత్సవాలలో భాగంగా. మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్ .బుధవారం రోజున ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు. గా జన వేణ.స దయ్య.సర్పంచ్ లు అరెల్లి.రమేష్. బంగారు రమేసు. మాజీ సర్పంచులు.సర్పంచులు మాదాసి సతీష్ .ఓరుగంటి కొమురయ్య. తదితరులు పాల్గొన్నారు.

# వందేళ్లుగా ప్రజా సమస్యల పై సి పి ఐ ఎనలేని పోరాటం

## సిపిఐ నేత, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 1( ప్రజాజ్యోతి ): సమాజంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం నిరంతరం భారత కమ్యూనిస్టు పార్టీ పనిచేస్తుందని



అలాంటి పార్టీకి ప్రజలే వెన్ను దన్నుగా నిలవాలని వందేళ్లుగా ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తున్న సిపిఐ కి విరివిగా ఆర్థిక సహాయాన్ని అందించాలని సిపిఐ సీనియర్ నాయకులు,మాజీ శాసనసభ్యులు చాడ వెంకటరెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర సమితి పిలుపుమేరకు ఏప్రిల్ 1వ తేదీ నుండి 10వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే ఇంటింటికి సిపిఐ సామూహిక నిధి,విరాళాల సేకరణ కార్యక్రమాన్ని బుధవారం స్థానిక గణేష్ నగర్ కమాన్ చౌరస్తాలో సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ తో కలిసి చాడ వెంకటరెడ్డి ప్రారంభించారు.
ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ సమాజంలో అంతరాలు లేని సమ సమాజ స్థాపన కోసం,వర్గ దోపిడీకి వ్యతిరేకంగా,శ్రమనే నమ్ముకొని జీవిస్తున్న కార్మిక వర్గ శ్రేయస్సు కోసం, ప్రపంచ మానవాళికి అన్నం పెట్టే అన్నదాతలకు అండగా నిలవడం కోసం, పేద బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి కోసం భారతదేశంలో 1925 డిసెంబర్ 25న సిపిఐ ఆవిర్భవించిందని, నాటినుండి నేటి వరకు వందేళ్లుగా ప్రజా సమస్యలే తమ సమస్యలుగా భావించి పో కేవలం ఒక్క కమ్యూనిస్టు పార్టీయే నని అన్నారు.
దేశంలో కమ్యూనిస్టు పార్టీ వల్లనే ప్రజలకు మేలుజరుగుతుందని, రాజభరణాల రద్దు, బ్యాంకుల జాతీయకరణ,భూ సంస్కరణల చట్టం,అనేక కార్మిక చట్టాలు, గ్రామీణ ఉపాధి హామీ పథకం,సమాచార హక్కు చట్టం ఇలా అనేక ప్రజా ఉపయోగకర చట్టాలు తీసుక రావడం కోసం సిపిఐ అనేక పోరాటాలు చేసిందని, దేశంలో వారివారి స్వలాభం కోసం,అధికారం కోసం పుట్టుకొచ్చిన పార్టీలు ఎన్నో ఉన్నాయి,కొన్ని పార్టీలు కాలగర్భంలో కలిసి పోయాయి కానీ వందేళ్లుగా ప్రజల కోసమే పనిచేస్తున్న,పోరాడుతున్న పార్టీ కేవలం సిపిఐ మాత్రమేనని,ఎన్నో ప్రజోద్యమాలు నిర్వహిస్తున్న భారత కమ్యూనిస్టు పార్టీ ని ఈ దేశంలో కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని,కార్యక్రమాల,కార్యాలయాల నిర్వహణ కోసం కమ్యూనిస్టు శ్రేణులకు ఆర్థిక సహాయం అందించి వారికి అండగా నిలవాలని ప్రజలకు వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి,జిల్లా కార్యవర్గ,కౌన్సిల్ సభ్యులు కసిరెడ్డి సురేందర్ రెడ్డి,కొయ్యడ సృజన్ కుమార్,బోయిని అశోక్ గూడెం లక్ష్మి,టేకుమల్ల సమ్మయ్య,నాగెల్లి లక్ష్మారెడ్డి,పిట్టల సమ్మయ్య, బోయిని తిరుపతి,న్యాలపట్ల రాజు,పైడిపల్లి రాజు,కటికరెడ్డి బుచ్చన్న యాదవ్,బండ రాజిరెడ్డి,చొక్కల్ల శ్రీశైలం,మావురపు రాజు,మచ్చ రమేష్,బావండ్లపెల్లి యుగేందర్,కొట్టె అంజలి, బూడిద సదాశివ,నగర సిపిఐ నాయకులు బాకం ఆంజనేయులు,నగునూరి రమేష్,కసిరెడ్డి సందీప్ రెడ్డి.మౌలానా తదితరులు పాల్గొన్నారు.

### మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాల
# స్టూడెంట్ అచీవ్మెంట్ ఎగ్జిబిషన్
– జూనియర్ కళాశాల విద్యార్థుల సందర్శన



**మధిర ప్రజాజ్యోతి** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్టూడెంట్ అచీవ్మెంట్ ఎగ్జిబిషన్ మరియు కాలేజీ ఓపెన్ డే కార్యక్రమాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం. రవీంద్ర రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు తయారు చేసిన వివిధ ప్రాజెక్టులు, మోడల్స్, సైన్స్ ఎగ్జిబిట్స్ మరియు సృజనాత్మక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కళాశాల సిబ్బంది, విద్యార్థులతో పాటు సమీప జూనియర్ కళాశాలల నుండి వచ్చిన విద్యార్థులు ఈ ప్రదర్శనను ఆసక్తిగా వీక్షించారు. జూనియర్ కళాశాల విద్యార్థులకు డిగ్రీ స్థాయి విద్య, అందుబాటులో ఉన్న సదుపాయాలు, ప్రయోగశాలలు, లైబ్రరీ, మరియు భవిష్యత్ అవకాశాలపై అవగాహన కల్పించారు. కళాశాల క్యాంపస్‌ను సందర్శించిన విద్యార్థులు అక్కడి సౌకర్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జూనియర్ కళాశాల విద్యార్థులు తమ సందేహాలను అడిగి నివృత్తి చేసుకున్నారు. ఫ్యాకల్టీ సభ్యులు వారికి తగిన మార్గదర్శకత్వం అందించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ఉన్నత విద్యపై ఆసక్తి పెంపొందించడంతో పాటు, ఎన్రోల్మెంట్ అవగాహన కార్యక్రమంగా కూడా ఉపయోగపడిందని నిర్వాహకులు తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ జి. అరుణ అధ్యాపకులు డా. ఎస్. ఇందిర డా. పి. సుజాత, డా. వి. నాగరాజు డా. కె. రామకృష్ణ, పి. శ్రీనివాస్ పి. లక్ష్మీనారాయణ షేక్. ఇమ్రాన్ కె. వెంకటేష్ పి. మాధురి ఎం. హారిక ఎస్. జ్యోతి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### నాగవరప్పాడు ఎంపీ యుపిఎస్
# పాఠశాలలో ఘనంగా వీడ్కోలు వేడుకలు

**మధిర ప్రజా జ్యోతి** మండల పరిధిలోని యుపిఎస్ నాగవరప్పాడు పాఠశాలలో వీడ్కోలు వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించడం నిర్వహించారు . ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పురం సంగారావు మాట్లాడుతూ క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తే భవిష్యత్తులో ఎన్నో విజయాలు సాధించవచ్చు మనం అనుకున్న లక్ష్యాలను నెరవేర్చాలంటే చదువు ఎంతో అవసరం చదువు అనేది మానవునికి మూడో కన్ను లాంటిది అందుకే అందరూ చదవాలి అందరూ ఎదగాలి అనే నినాదంతో ముందుకు వెళ్తున్నాం కాంప్లెక్స్ హెచ్ఎం సిహెచ్ శ్రీహరి మాట్లాడుతూ వినయ విధేయతలు కలిగి ఉండి క్రమశిక్షణతో విజయం సాధించవచ్చని తెలియజేశారు షేక్ ఇబ్రహీం మాట్లాడుతూ రాజు రాణి కథ చెప్పి కష్టపడి చదివి పైకి ఎదగాలని కోరారు ఉపాధ్యాయులు సిహెచ్ వి రవికుమార్ డి లింగయ్య వి వి ఎన్ రాజు మాట్లాడుతూ పట్టుదల కృషి నిరంతర శ్రమ ఉంటే ఏదైనా సాధించవచ్చని తెలియజేశారు, తర్వాత ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు పాల్గొని నృత్య ప్రదర్శన ఏకపాత్రాభినయం ప్రదర్శించారు ఈ కార్యక్రమంలో తోక కృష్ణయ్య (రిటైర్డ్ టీచర్) సర్పంచ్ శ్రీమతి భీమన బోయిన ఈశ్వరమ్మ ఉప సర్పంచ్ తోక వీరస్వామి అంగన్వాడీ టీచర్ అక్కి కృష్ణవేణి ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు

# కోతుల బెడదను తొలగించిన మహేంద్ర బాషా



**సత్తుపల్లి ఏప్రియల్01(ప్రజా జ్యోతి)** పట్టణంలోని 11వ వార్డు లో కోతులు బెడద ఎక్కువగా ఉండటంతో, వార్డు ప్రజలు కౌన్సిలర్ మహేంద్ర బాషా దృష్టికి తీసుకువెళ్లారు. గమనించిన వార్డు కౌన్సిలర్ కోతులు చేసే పనులు చూసి, బుధవారం కోతులను పట్టించి వార్డు ప్రజలకు కోతుల నుండి విముక్తి కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండ్ల పైకి ఎక్కటం, ఆహార పదార్థాలను లాక్కోవడం, చిన్నపిల్లలను భయపెట్టడం వంటివి చేస్తున్నాయని, స్థానికులు తీవ్రంగా ఇబ్బంది పడుతూ ఉండటంతో వారికి నా బాధ్యతగా, నా కర్తవ్యం గా కోతులు బాధల నుండి విముక్తి కల్పించాను. వార్డు ప్రజల కోసం ఏమి చేయటానికి అయినా నేను సిద్ధంగా ఉన్నానని అన్నారు.

# పట్టణ పరిశుభ్రతే ప్రధాన ధ్యేయం రెహానా కమల్
– డ్రైనేజీ క్లీనింగ్ పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్ పర్సన్





**సత్తుపల్లి ఏప్రియల్01(ప్రజా జ్యోతి)** స్థానిక మున్సిపల్ ఎలక్షన్ అయిన నాటి నుండి, పదవి ప్రమాణ స్వీకారం చేసిన మున్సిపల్ చైర్ పర్సన్ రెహానా కమల్ ప్రతిరోజు, నిత్యం ప్రజలతో ఉంటూ, ఏదో ఒక కార్యక్రమంలో పాలుపంచుకుంటున్నారు. బుధవారం పట్టణంలోని 10 వ వార్డులో డ్రైనేజీ క్లీనింగ్ పనులు జరుగుతుండగా ఆమె దగ్గరుండి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలోని పరిశుభ్రత ప్రధాన ధ్యేయంగా, కాంగ్రెస్ పార్టీ ఉందని, పట్టణ ప్రజల ఆరోగ్యమే ముఖ్య ఎజెండా అని, బ్లీచింగ్, డ్రైనేజీ క్లీనింగ్ పనులను చేయిస్తున్నామని, ప్రజలందరూ నమ్మకంతో గెలిపించుకున్న నన్ను ప్రజల కోసం వారి యోగక్షేమాలు కోసం, పనిచేయటానికి సిద్ధంగా ఉన్నానని అన్నారు. అంతేగాకుండా ప్రజలు కూడా వ్యక్తిగత పరిశుభ్రత పై అవగాహన పెంచుకోవాలని తెలియజేశారు. ఏదైనా సమస్య ఉంటే నా దృష్టికి తీసుకురావాలి అని, సమస్యలు లేని సత్తుపల్లి మున్సిపాలిటీ తీర్చిదిద్దుతాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో గోపాలరావు, భాస్కరరావు, వార్డు ప్రజలు, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

### యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ పాఠశాలలు, ఏటీసీ కళాశాలల స్థల సమీకరణ, అనుమతుల పురోగతిపై సమీక్ష
– జిల్లా కలెక్టర్ అంకిత్





**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 1, ప్రజా జ్యోతి** జిల్లాలో యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ పాఠశాలలు , ఏటీసీ కళాశాలల నిర్మాణానికి సంబంధించి స్థల సమీకరణ, అవసరమైన అనుమతుల పురోగతిపై జిల్లా కలెక్టర్ అంకిత్ సంబంధిత శాఖల అధికారులతో ఐడీఓసీ కార్యాలయంలో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ విద్యాసంస్థల ఏర్పాటుకు సంబంధించిన స్థల సమీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని, ఎలాంటి జాప్యం లేకుండా అవసరమైన అన్ని అనుమతులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. విద్యా రంగ అభివృద్ధికి ఈ సంస్థలు ఎంతో కీలకమని అన్నారు . అనుమతుల జారీ ప్రక్రియలో ఎలాంటి ఆటంకాలు లేకుండా శాఖల మధ్య సమన్వయం పెంపొందించాలని, ప్రతి దశలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను వెంటనే పరిష్కరించి పనులను ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. సంబంధిత భూముల విషయంలో ఎలాంటి వివాదాలు లేకుండా సమగ్ర పరిశీలన జరిపి చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ఉన్నతాధికారులతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు . ఈ సమావేశంలో ఇల్లందు తాసిల్దార్ రవికుమార్, అశ్వరావుపేట తాసిల్దార్ రామకృష్ణ , ఈ సెక్షన్ సూపరింటెంట్ స్వర్ణలత, రామవరం ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### పోరాడి సాధించుకున్న
# కార్మిక చట్టాలను రద్దు చేస్తే సహించేది లేదు
– జిల్లా సిఐటియు నాయకులు మద్దాల ప్రభాకర్ రావు





**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి** కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేస్తే సహించేది లేదని సిఐటియు జిల్లా నాయకులు మద్దాల ప్రభాకరరావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మండల కేంద్రమైన ఎర్రుపాలెం రింగ్ సెంటర్ నందు కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని దేశవ్యాప్త ఏప్రిల్ ఒకటిన నిర్వహించిన బ్లాక్ డే కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికులు ఆశా కార్యకర్తలు మధ్యహాన భోజన కార్మికులు వివిధ రంగాలకు సంబంధించిన పలువురు కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడులను ఏప్రిల్ ఒకటవ తేదీ నుండి దేశవ్యాప్తంగా అమలు పరచాలని సిద్ధం చేసిందని దానికి వ్యతిరేకంగా ధర్నా నిర్వహించినట్లు తెలిపారు. కేరళ రాష్ట్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడులను తమ ప్రభుత్వం అమలు జరపపోదని అసెంబ్లీలో తీర్మానం చేసిందని అన్నారు. ఆ రీతిలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా అసెంబ్లీలో లేబర్ కోడ్ లను వ్యతిరేకిస్తూ తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. బిజెపి ప్రభుత్వం లేబర్ కోడ్ లను అమలుపరచాలా, వద్దా అనే నిర్ణయం రాష్ట్ర ప్రభుత్వాలకు వదిలేసిందని అన్నారు. నాలుగు లేబర్ కోడ్ లను అమలు జరపకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని లేనిపక్షంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ రానున్న కాలంలో కార్మిక వర్గాన్ని సమీకరించి పెద్ద ఎత్తున పోరాటంలోకి దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కో ఆర్గనైజేషన్ దూదిగం బసవయ్య, బేతి శ్రీనివాసరావు, గంతాల నాగేశ్వరావు, నంద్రు సుధారాణి, హైమావతి విజయలక్ష్మి, వేల్పుల కుమారి కొత్తపల్లి వరలక్ష్మి దూదిగం శ్రీను, రామకృష్ణ, నక్క పుల్లారావు, చిన్నా, నగేష్, ఈశ్వరమ్మ, మల్లేశ్వరి, వివిధ సంఘాలకు సంబంధించిన కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మహిళల ఆర్థిక పరిపుష్టే కాంగ్రెస్ లక్ష్యం: ఎమ్మెల్యే రాగమయి
– 230కోట్ల మహిళలుకు మహాలక్ష్మి పథకం ఉపయోగం



**సత్తుపల్లి ఏప్రియల్01(ప్రజా జ్యోతి)** మహిళలు ఆర్థికంగా పరిపుష్టిగా, అభివృద్ధి చెందాలని కాంగ్రెస్ పార్టీ ప్రధాన అజెండా అని సత్తుపల్లి శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. బుధవారం ఏప్రిల్ 1వ తేదీ నాటికి ఆర్టీసీకి రూ.10వేల కోట్ల రూపాయలు చార్జీలను చెల్లించామని అన్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ డిపోలో పదివేల కోట్లు చెల్లించిన సందర్భంగా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా ఆమె హాజరైనారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి, 48 గంటల్లోపు మహాలక్ష్మి పథకాన్ని మాట ఇచ్చిన ప్రకారం, అమలు చేసిన ఘనత సీఎం రేవంత్ రెడ్డి కే దక్కిందని అన్నారు. మహిళల పట్ల మక్కువతో గృహజ్యోతి, సోలార్ పవర్ ప్లాంట్, రేషన్ కార్డులు, సన్న బియ్యం, అమ్మ ఆదర్శ పథకం, ఇందిరమ్మ ఇండ్లు వంటి కార్యక్రమాలు మహిళలకు మాత్రమే అందిస్తే, వారు ఆర్థికంగా ఉంటారన్న ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి పథకాలను మహిళలకు అందించిందని అన్నారు. ఆర్టీసీ బస్సులు కొరతగా ఉందంటే 115 బస్సులను అందించామని, సత్తుపల్లి ఆర్టీసీ డిపో అభివృద్ధికి త్వరలో నిధులు మంజూరు చేపిస్తామని, మహాలక్ష్మి పథకం వలన చిరుద్యోగులకు, షాపులలో పనిచేసే వారికి, ప్రయాణం చేసే వారికి ఎంతగానో దోహదపడుతుందని, ఒక్కొక్క కుటుంబానికి మూడు నుండి నాలుగు వేలు ఆదా అవుతున్నాయని, దీని ద్వారా ఆర్థిక అభివృద్ధి పెరుగుతుందని తెలియజేశారు. అనంతరం ఆర్టీసీ డిపో ఆవరణలో మహిళా మణులకు ఆమె ఆధ్వర్యంలో సత్కారాలు చేసి, బహుమతులు అందజేశారు. అనంతరం ఆర్టీసీ డిఎం లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గతంలో ఆర్టీసీ ఉంటుందో ఊడుతుందో తెలియని పరిస్థితుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం చేయూతగా ఉందని, దీని ద్వారా సత్తుపల్లి ఆర్టీసీ డిపో రూ.. 84 కోట్ల రూపాయల ఆదాయ మార్గంలోకి వచ్చిందని, బస్సులు కూడా పెరిగాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ రెహానా కమల్, వార్డ్ కౌన్సిలర్లు విరివాడ అపర్ణ, దూదిపాల రాంబాబు, జగన్నాథం శ్రీను, ఉప్పు నాగమణి, నసీమా షరీఫ్, ఆర్టీసీ ఆనంద్, కందిబండ సంధ్యారాణి, కాంగ్రెస్ నాయకులు గాదె చెన్నారావు తదితరులు ఉన్నారు.

# మార్కెట్ స్పెషల్ గ్రేడ్ కార్యదర్శి తీరుపై విచారణ
– అధికారులు సిబ్బందితో లిఖితపూర్వక అభిప్రాయాలు
– రాష్ట్ర మార్కెటింగ్ డైరెక్టర్‌కు నివేదికను అందిస్తాం: మార్కెటింగ్ డీయం



**నేలకొండపల్లి, ఏప్రిల్ 1 ప్రజా జ్యోతి :** స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటి స్పెషల్ గ్రేడ్ కార్యదర్శి పంతులు పై జిల్లా మార్కెటింగ్ అధికారి మహ్మమ్మద్ అబ్దుల్ ఆలీమ్ బుధవారం విచారణ చేపట్టారు. శనివారం మద్యం మత్తులో విధులకు హాజరైన కార్యదర్శి పంతులు వ్యవహారం పై సమగ్ర విచారణ చేపట్టారు. మార్కెట్ కార్యదర్శి, సూపర్వైజర్ లతో ప్రత్యేక సమావేశం ను నిర్వహించారు. వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అదే విధంగా జూనియర్ మార్కెట్ సూపర్వైజర్స్. కార్యాలయం సిబ్బంది లను విడి విడిగా పిలిచివారి అభిప్రాయాలను సేకరించారు. కార్యాలయంకు తరుచూ మద్యం సేవించి వస్తారా..లేక కార్యాలయంలోనే మద్యం - సేవిస్తాడా....ఏవరి వద్ద నుంచైనా డబ్బులు వసూలు చేస్తారా...సిబ్బంది పట్ల ఆయన తీరు ఎలా ఉంటుంది. ఆఫీస్ కు సమయపాలన పాటిస్తున్నాడా... ఇలా పలు విషయాలకు సంబంధించి అందరిని వివరాలు అడిగి వారి అభిప్రాయాలను లిఖిత పూర్వకంగా తీసుకున్నారు. అదే విధంగా చెక్పోస్టు సిబ్బంది...ఔట్ సోర్సింగ్ సిబ్బంది ని సైతం వివరాలు అడిగి తెలుసుకున్నారు... దాదాపు మూడు గంటల పాటు సమగ్ర విచారణ చేపట్టారు. కార్యాలయం లో సిబ్బంది మధ్య సమన్వయం లేకపోవటం... జిల్లా అధికార యంత్రాంగం దృష్టి సారించకపోవటం... కార్యాలయం లో వర్గపోరు తీవ్రంగా నడుస్తుంది. కనీసం పాలకవర్గం కూడ పట్టించుకోకపోవటం పట్ల పలు విమర్శలు వినవస్తున్నాయి. ఈ విషయం పై మార్కెటింగ్ డీయం ఏం.ఏ.ఆలీమ్ ను వివరణ కోరగా..... మద్యం సేవించి కార్యాలయం కు వచ్చిన ఘటన పై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సమగ్ర విచారణ చేపట్టాం. అధికారులను, సిబ్బంది అభిప్రాయాలు తెలుసుకున్నారు. నివేదికను రాష్ట్ర మార్కెటింగ్ డైరెక్టర్ కు అందించనున్నట్లు తెలిపారు. తదుపరి వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

# అపదలో ప్రాణ రక్షకులు
– అత్యవసర వైద్య సేవల నిపుణుల దినోత్సవం సందర్భంగా అభినందనలు
– అపద సమయంలో ఆపన్నహస్తం
క్షణాల్లో చేరుకుని ప్రాణాలను కాపాడే 108 సేవల సిబ్బంది సేవలు ఆదర్శం










**అన్నపురెడ్డిపల్లి, ఏప్రిల్ 1, ప్రజా జ్యోతి:** ప్రతి సంవత్సరం ఏప్రిల్ 2న జరగనున్న అత్యవసర వైద్య సేవల నిపుణుల దినోత్సవం నేపథ్యంలో ప్రాణాపాయ పరిస్థితుల్లో క్షణాల్లో స్పందిస్తూ సేవలు అందిస్తున్న 108 సిబ్బంది కృషి ప్రశంసలు అందుకుంటోంది. ప్రమాదాలు, అనారోగ్య అత్యవసరాలు ఎక్కడ జరిగినా వెంటనే చేరుకుని బాధితులకు ప్రథమ చికిత్స అందించడం ద్వారా అనేక కుటుంబాలకు ఆశాకిరణంగా మారుతున్నారు. అన్నపురెడ్డిపల్లి నూతన మండలంలో 2019 సంవత్సరం నుండి 108 సేవలు నిరంతరం కొనసాగుతూ మండల ప్రజలతో పాటు పరిసర మండలాల ప్రజలకు కూడా కీలక సేవలు అందిస్తున్నాయి. ఈ సేవల్లో అత్యవసర వైద్య సాంకేతిక నిపుణులు కనపర్తి కళాధర్, పద్మ, పైలట్ సురేష్, పైలట్ రాజా తమ కృషితో ప్రత్యేక గుర్తింపు పొందుతున్నారు. వర్షం, ఎండ, రాత్రి, పగలు అనే తేడా లేకుండా ఎప్పుడైనా సేవలకు సిద్ధంగా ఉండే ఈ సిబ్బంది నిజమైన సేవా దృక్పథంతో పనిచేస్తున్నారు. ప్రమాద స్థలాలకు వేగంగా చేరుకుని బాధితులను ఆసుపత్రికి తరలించే క్రమంలో చూపుతున్న చురుకుదనం అనేక ప్రాణాలను కాపాడుతోంది. బాధితులకు ధైర్యం చెప్పడం, అత్యవసర చికిత్స అందించడం, సమయానికి ఆసుపత్రికి చేర్చడం వంటి సేవలతో ఈ సిబ్బంది ప్రజల గుండెల్లో స్థానం సంపాదించారు. గ్రామంలో మంచి పేరు తెచ్చుకుని అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. అత్యవసర సేవల్లో క్రమశిక్షణ, సమయపాలన ఎంతో ముఖ్యమని నిరూపిస్తూ ప్రతీ ఘటనను సవాల్‌గా తీసుకుని తమ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. ప్రాణాలకు విలువ తెలిసిన ఈ సిబ్బంది సేవాభావం యువతకు ఆదర్శంగా నిలుస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలను అందుబాటులోకి తీసుకురావడంలో వారి పాత్ర కీలకంగా మారింది. ప్రజలు కాల్ చేసిన ప్రతిసారీ ఆలస్యం చేయకుండా స్పందించడం ద్వారా విశ్వాసాన్ని గెలుచుకున్నారు. సమాజానికి అంకితభావంతో పనిచేస్తున్న ఈ బృందం నిజంగా అభినందనీయులు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 108 సేవలు కోఆర్డినేటర్ డి. మనోహర్ ఆధ్వర్యంలో సేవలు సమర్థవంతంగా ముందుకు సాగుతున్నాయి. ఆయన మార్గదర్శకత్వంలో ప్రతి మండలంలో 108 సేవలు మరింత బలోపేతం అవుతున్నాయి. సిబ్బందికి అవసరమైన సూచనలు అందిస్తూ సేవల నాణ్యతను పెంచడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన స్పందన కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా 108 సేవలు ప్రజలకు నమ్మకమైన ఆరోగ్య రక్షక వ్యవస్థగా నిలవడంలో ఆయన కృషి ప్రశంసనీయం. రేపు (ఏప్రిల్ 2) జరగనున్న ఈ దినోత్సవాన్ని పురస్కరించుకుని కనపర్తి కళాధర్, పద్మ, సురేష్, రాజా వంటి సేవాభావం కలిగిన సిబ్బందితో పాటు కోఆర్డినేటర్ డి. మనోహర్ సేవలను ప్రజలు అభినందిస్తూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవలు కొనసాగించాలని ఆకాంక్షిస్తున్నారు.

## జిఎస్టీ వసూళ్లలో 8.8శాతం వృద్ధి

మార్చిలో రూ.2 లక్షల కోట్ల మేర వసూళ్లు

హైదరాబాద్,ఏప్రిల్1(ప్రజాజ్యోతి): దేశంలో జిఎస్టీ వసూళ్లు నెలనెలా భారీగా వసూలు అవుతున్నాయి. దీంతో కేంద్రానికి భారీగా ఆదాయం సమకూరుతోంది. దేశంలో స్థూల వస్తు, సేవల పన్ను వసూళ్లు భారీగా నమోదయ్యాయి. మార్చి నెలకు గానూ 8.8 శాతం వృద్ధితో రూ.2 లక్షల కోట్ల మేర వసూళ్లు నమోదయ్యాయి. దేశీయంగా విక్రయాలు పెరగడం, దిగుమతుల కారణంగా పన్ను వసూళ్లు ఈస్థాయిలో పెరిగినట్లు ప్రభుత్వ గణాంకాలను బట్టి తెలుస్తోంది. గతేడాది మార్చిలో జీఎస్టీ వసూళ్లు రూ.1.83 లక్షలుగా నమోదయ్యాయి. దేశీయంగా విక్రయాల ద్వారా 5.8 శాతం వృద్ధితో రూ.1.46 లక్షల కోట్ల మేర జీఎస్టీ ఆదాయం సమకూరగా.. దిగుమతుల రూపంలో 17.8 శాతం వృద్ధితో రూ.53,861 కోట్ల వసూళ్లు నమోదయ్యాయి. రిఫండ్ల సర్దుబాటు అనంతరం నికరంగా జీఎస్టీ వసూళ్లు రూ.1.78 లక్షల కోట్లుగా నమోదైనట్లు కేంద్రం వెల్లడించింది. 2025-26 ఆర్థిక సంవత్సరం మొత్తానికి 8.3 శాతం వృద్ధితో జీఎస్టీ వసూళ్లు రూ.22.27 లక్షల కోట్లుగా నమోదైనట్లు కేంద్రం వెల్లడించింది.

## తెలంగాణ పంచాయతీలకు ప్రతిష్టాత్మక గుర్తింపు

రెండు పంచాయితీలకు వికాస్ పురస్కారాలు

హర్షం వ్యక్తం చేసిన మంత్రి సీతక్క

న్యూఢిల్లీ,ఏప్రిల్1(ప్రజాజ్యోతి): గ్రామీణాభివఅద్ధి, సుస్థిర పరిపాలనలో విశిష్ట ప్రతిభ కనబరిచిన తెలంగాణ పంచాయతీలకు జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మక గుర్తింపు లభించింది. కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ ప్రకటించిన 'దీన్ దయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్ పురస్కారాలు' రాష్ట్రంలోని రెండు గ్రామ పంచాయతీలను వరించాయి. వికారాబాద్ జిల్లా కోటేపల్లి మండలానికి చెందిన మోతుకుపల్లి గ్రామ పంచాయతీ 'గుడ్ గవర్నెన్స్' విభాగంలో జాతీయ అవార్డును దక్కించుకోగా, సంగారెడ్డి జిల్లా సంగారెడ్డి మండల పరిధిలోని ఫసల్వాడి గ్రామ పంచాయతీ 'విమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ' విభాగంలో అత్యుత్తమ పురస్కారాన్ని సాధించింది. గ్రామ స్థాయిలో అత్యంత పారదర్శకమైన పరిపాలన అందించడం, అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వామ్యం చేయడం , మహిళా సాధికారత, భద్రత, సంక్షేమ కార్యక్రమాల అమలులో చూపిన అసాధారణ కృషికి గుర్తింపుగా ఈ అవార్డులు లభించాయి. జాతీయ స్థాయిలో తెలంగాణ పంచాయతీలకు ఈ గౌరవం దక్కడం పట్ల రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. గ్రామీణాభివృద్ధి, పారదర్శక పాలన , మహిళా సాధికారత దిశగా తమ ప్రభుత్వం తీసుకుంటున్న పటిష్టమైన చర్యలకు ఈ అవార్డులే నిదర్శనమని ఆమె పేర్కొన్నారు. ఈ అద్భుత విజయాన్ని సాధించిన మోతుకుపల్లి, ఫసల్వాడి గ్రామ పంచాయతీల ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థాయి సిబ్బంది , గ్రామస్థులకు ఆమె హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఇలాంటి విజయాలు రాష్ట్రంలోని ఇతర పంచాయతీలకు గొప్ప ప్రేరణగా నిలుస్తాయని, భవిష్యత్తులో మరిన్ని గ్రామాలు అభివృద్ధి బాటలో నడిచి జాతీయ స్థాయిలో తెలంగాణ కీర్తిని చాటాలని మంత్రి సీతక్క ఆకాంక్షించారు.

## రెండు నెలలకు సరిపడా ముడి చమురు నిల్వలు

పెట్రోలియం శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ

న్యూఢిల్లీ,ఏప్రిల్1(ప్రజాజ్యోతి): రాబోయే రెండు నెలలకు సరిపడా ముడి చమురు నిల్వలు దేశంలో ఉన్నాయని పెట్రోలియం శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ బుధవారంనాడు తెలిపారు. రిఫైనరీలు పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయని, రిటైల్ అవుట్‌లెట్‌లలో ఇంధనం అందుబాటులో ఉందని, ఎలాంటి ఇంధన కొరత లేదని చెప్పారు. అంతర్జాతీయ ధరల ట్రెండ్‌ను ప్రస్తావిస్తూ, రెండు నెలల క్రితం వరకూ బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 70 డాలర్లు ఉండగా, అది ఇప్పుడు 100 డాలర్లు దాటిందని చెప్పారు. ధరల్లో పెరుగుదల ఉన్నప్పటికీ దేశీయ వినియోగదారులకు పెట్రోల్, డీజిల్ ధరలు పెంచలేదని తెలిపారు. 2022 ఏప్రిల్ 6 నుంచి పెట్రోల్, డీజిల్ ధరలు పెంచలేదని, 2024 మార్చిలో ధరలు రూ.2 చొప్పున తగ్గించామని, ఇప్పటికీ అదే అమల్లో ఉందని వివరించారు. అంతర్జాతీయ ధరల్లో అస్థిరత నుంచి దేశీయ వినియోగదారుల పరిరక్షణకు భారత ప్రభుత్వం ఎక్సైజ్ డ్యూటీ తగ్గించిందని, తద్వారా ధరల్లో ఎలాంటి పెరుగుదల లేకుండా చర్యలు తీసుకుందని చెప్పారు. దేశీయ మార్కెట్‌లో ఏటీఎఫ్, డీజిల్ లభ్యత కోసం ఎగుమతులపై సుంకం విధించినట్టు చెప్పారు. పెట్రోల్, డీజిల్ తగినంతగా అందుబాటులో ఉన్నాయని, ఎవరూ ఆందోళన చెందవద్దని, ప్యానిక్ కొనుగోళ్లకు పాల్పడవద్దని కోరారు. గృహావసరాలు, సీఎన్‌జీ ట్రాన్స్‌పోర్ట్‌కు 100 శాతం సరఫరాకు భరోసా ఇచ్చారు. విస్తరణ ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయని అన్నారు. మార్చిలో 3,25,000 కనెక్షన్లకు నేచురల్ గ్యాస్ సరఫరా చేశామని, 2,85,000 కొత్త కనెక్షన్లు ఇచ్చామని, 3,50,000 కొత్త వినియోగదారులు కనెక్షన్ కోసం రిజిస్టర్ చేసుకున్నారని చెప్పారు. ల్పీజీకి సంబంధించి 60 శాతం దిగుమతులపై మనం ఆధారపడి ఉన్నామని చెప్పారు. అంతర్జాతీయంగా ఎల్పీజీ ధరలు 522 డాలర్ల నుంచి 780 డాలర్లకు పెరిగిందన్నారు. అయినప్పటికీ డొమెస్టిక్ వినియోగదారుల ఎల్‌పీజీ సిలెండర్ల ధరలను పెంచలేదని చెప్పారు. ధరల్లో పెరుగుదల వల్ల తలెత్తిన నష్టాన్ని తట్టుకునేందుకు ఆయిల్ మా÷-గ్గ÷టింగ్ కంపెనీలకు ప్రభుత్వం సపోర్ట్ అందిస్తోందన్నారు. 2023లో ఓఎంసీలకు రూ.22,000 కోట్లు కేటాయించగా, 2025-26లో సుమారు రూ.30,000 కోట్లకు ఆమోదం తెలిపామని చెప్పారు. ఏ ఒక్క గ్యాస్ ఏజెన్సీ నుంచి స్టాకు లేదనే సమాచారం లేదని, మంగళవారంనాడు కూడా 60 లక్షల సిలెండర్ల పంపిణీ జరిగిందని చెప్పారు.

## కొండగట్టు ఆలయంలో అపశృతి

జగిత్యాల,ఏప్రిల్1(ప్రజాజ్యోతి): జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆంజన్న ఆలయంలో అపశ్రుతి నెలకొంది. ఆలయం వద్ద వేసిన చలువ పందిరి కూలి 15 మంది భక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనపై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాసిరకంగా ఏర్పాట్లు చేయడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని ఆరోపిస్తున్నారు. హనుమాన్ చిన్న జయంతి సందర్భంగా నేటి నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో హనుమాన్ మాల విరమణ కోసం భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. ఈ క్రమంలో ఆలయంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులకు తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎండ తీవ్రత దృష్ట్యా ఆలయ పరిసరాల్లో చలువ పందిళ్లు కూడా వేశారు.

# రాష్ట్రం నిప్పుల కొలిమిలా..



మొదటిపేజీ తరువాయి..

ఉష్ణోగ్రతలు అధికంగా నమోదుకానున్నాయి. దేశంలోని మిగిలిన ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం లేదా అంతకంటే తక్కువగా నమోదవుతాయి. ఈ మూడు నెలల్లో ఎక్కువ రోజులు వడగాడ్పులు వీయనున్నాయి. ఏప్రిల్‌లో సగటున మూడు, నాలుగు రోజులు, మే, జూన్ నెలల్లో పది, అంతకంటే ఎక్కువ రోజులు వడగాడ్పులు వీస్తాయి. రాత్రి వాతావరణం కూడా వేడిగానే ఉండనుంది. దేశంలోని 95 శాతం ప్రాంతాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు సగటు కంటే ఎక్కువగా నమోదవుతాయి. ఎక్కువ రోజులు వడగాడ్పులు వీస్తాయి. ఏప్రిల్‌లో రాష్ట్రంలోని గోదావరి జిల్లాలు తప్ప మిగిలిన ప్రాంతాల్లో పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు సగటు కంటే ఎక్కువగా

మొదటిపేజీ తరువాయి..

నమోదవుతాయి. ఇక ఏప్రిల్‌లో ఈశాన్య రాష్ట్రాలు తప్ప దేశంలోని అనేక ప్రాంతాల్లో సగటు కంటే ఎక్కువ వర్షపాతం నమోదుకానుంది. మార్చిలో సాధారణ వర్షపాతం 29.9 మిల్లీమీటర్లకుగాను 33.7 మిల్లీమీటర్లు నమోదైంది. 1901 నుంచి ఇప్పటి వరకు మార్చిలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోద వడం ఇది 32వ సారి. పసిఫిక్ మహాసముద్రంలో లానినా చివరిదశకు చేరుకుంది. కొద్దిరోజుల్లో తటస్థ పరిస్థితులకు చేరుకునే అవకాశం ఉందని అంతర్జాతీయ మోడల్స్ వెల్లడిస్తున్నాయి. దీనికి అనుగుణంగా ఏప్రిల్ నుంచి జూన్ వరకు తటస్థ పరిస్థితులు కొనసాగుతాయని, జూన్(నైరుతి రుతుపవనాల ప్రారంభం) నుంచే ఎల్‌నినో మొదలవుతుందని ఐఎండీ అంచనా వేసింది.

# అమరావతి బిల్లుకు లోక్‌సభ ఆమోదం

**సభలో బిల్లు ప్రవేశ పెట్టిన నిత్యానంద రాయ్**

**చర్చలో పాల్గొన్న 11 పార్టీల ఎంపిలు**

**ఏకగ్రీవంగా ఆమోదించిన లోక్‌సభ**

**అమరావతి ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీక**

**రాజధానిపై ఉన్న సందిగ్ధతకు ఇక తెరపడినట్లే**

**ఎక్స్ వేదికగా సిఎం చంద్రబాబు హర్షం**

న్యూఢిల్లీ,ఏప్రిల్1 :

ఏపీ రాజధాని అమరావతికి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఏపీ పునర్విభజన చట్ట సవరణ పేరుతో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ లోక్‌సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టారు. అనంతరం సుమారు రెండు గంటలపాటు దీనిపై చర్చ జరిగింది. తెదేపా, భాజపా, జనసేన, కాంగ్రెస్, వైకాపా, సమాజ్‌వాదీ సహా పలు పార్టీల ఎంపీలు చర్చలో పాల్గొన్నారు. అనంతరం బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపినట్లు స్పీకర్ స్థానంలో ఉన్న తెన్నేటి కృష్ణప్రసాద్ ప్రకటించారు. ఈ బిల్లు గురువారం రాజ్యసభ ముందుకు రానుంది. లోక్‌సభలో ఆమోదం పొందిన అనంతరం ఈ బిల్లు రాజ్యసభకు వచ్చినట్లు సెక్రటరీ జనరల్ ప్రకటించారు. గురువారం కేంద్ర మంత్రి నిత్యానంద రాయ్ దీన్ని రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మొదలు దాదాపు గంటసేపు బిల్లుపై చర్చ జరిగే అవకాశం ఉంది. అమరావతి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలపడంతో ఈ బిల్లుకు ఆమోదం లభించింది. వైసీపీ మినహా మిగిలిన పార్టీలు బిల్లుకు మద్దతు తెలిపాయి. అమరావతి బిల్లుపై చర్చలో 11 పార్టీలకు చెందిన 18 మంది ఎంపీలు పాల్గొన్నారు. చర్చ తర్వాత అమరావతి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపినట్లు స్పీకర్ ప్రకటించారు. అమరావతి రైతుల త్యాగం అపారమైందని పలువురు ఎంపిలు అన్నారు. లోక్‌సభలో ఎంపీ మాట్లాడుతూ.. రైతుల త్యాగం ప్రపంచ చరిత్రలో నిలిచిపోతుందని తెలిపారు. రైతు భూమి కేవలం ఆస్తి కాదని, అది వారి జీవితంతో సమానమన్నారు. తండ్రికి బిడ్డతో ఉండే అనుబంధం ఎలా ఉంటుందో రైతుకు భూమితో బంధం ఉంటుందని వివరించారు. నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాణం కోసం, భావితరాల భవిష్యత్తు కోసం రైతులు తమ వ్యక్తిగత ప్రయోజనాలను పక్కన పెట్టి సుమారు 33 వేల ఎకరాల భూమిని రాజధాని నిర్మాణానికి స్వచ్ఛందంగా ఇచ్చారన్నారు. ఈ త్యాగం చరిత్రలో



చిరస్థాయిగా నిలుస్తుంది తెలిపారు. వైసీపీ నేతలు అమరావతిని తక్కువ చేసి మాట్లాడారని మండిపడ్డారు. అమరావతి అంశంపై పార్లమెంట్‌లో చర్చ జరుగుతున్న సమయంలో వైసీపీ సభ్యులు వాక్‌అవుట్ చేయడం దురదృష్టకరమన్నారు. ఇది రాష్ట్ర ప్రజల భావోద్వేగాలను అవమానించినట్లే పలువురు ఎంపిలు తెలిపారు. లోక్‌సభలో అమరావతి చట్టబద్ధత బిల్లు ఆమోదం పొందడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించారు. అమరావతి భవిష్యత్తుపై ఉన్న సందిగ్ధతకు తెరపడిందన్నారు. లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందడం ఆంధ్రులకు దక్కిన గౌరవంగా పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర నిర్మాణంలో ఇది ఒక కీలక మైలురాయని సోషల్ మీడియా ఎక్స్‌లో సీఎం పోస్ట్ చేశారు. ప్రజా రాజధాని అమరావతి ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీక అని సీఎం అన్నారు. ఈరోజు లోక్‌సభలో అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లు ఆమోదం పొందడం ఆంధ్రులకు దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు తెలిపారు. గత పాలనలో ఎదురైన చీకట్లు తొలగిపోయి, అమరావతి భవిష్యత్తుపై ఉన్న సందిగ్ధతకు శాశ్వతంగా తెరపడిందని సీఎం పేర్కొన్నారు. రైతుల త్యాగానికి, ప్రజల ఆకాంక్షలకు దక్కిన గౌరవం ఇదన్నారు. స్వర్ణాంధ్ర నిర్మాణంలో ఇది ఓ కీలక మైలురాయన్నారు. అమరావతి ఇక అజేయం.. అజరామరం అని అన్నారు సీఎం. రాజధానిని విశ్వనగరంగా తీర్చిదిద్ది ప్రపంచ పటంలో నిలుపుతామని స్పష్టం చేశారు. సహకరించిన కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోదీకి, హోం మంత్రి అమిత్ షాకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. లోక్‌సభలో బిల్లుకు మద్దతు పలికిన అన్ని పార్టీలకు ఆంధ్రప్రదేశ్ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తూ సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు.

# దోచుకోవడానికే అమరావతి ప్లాన్

**అబద్దాలు, అడ్డగోలు సంపాదన బాబు నైజం**

**రాష్ట్రానికి రాజధాని అన్నది ఎక్కడా లేదు**

**కేంద్రానికి మాత్రమే రాజధాని అవసరం**

**మావిగన్ అంటూ కొత్త ఆలోచన ప్రకటించిన జగన్**

అమరావతి,ఏప్రిల్1 ):

చంద్రబాబు లాంటి వ్యక్తి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండటం ఏపీ ప్రజలు చేసుకున్న దురదృష్టమని మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వ్యాఖ్యానించారు. అమరావతి పేరుతో దోపిడీకి రంగం సిద్దం చేశారని మండిపడ్డారు. అబద్దాలు, అడ్డగోలు సంపాదన చంద్రబాబుకు తెలిసిన విద్య అని అన్నారు. చంద్రబాబుకు నిజాయితీ, చిత్తశుద్ధి లేవని, ఆయన దృష్టిలో పరిపాలన అంటే కేవలం అవినీతి, దోపిడీ మాత్రమేనని జగన్ దుయ్యబట్టారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై జగన్ నిప్పులు చెరిగారు. గత వారం శాసనసభలో అమరావతిపై ప్రవేశపెట్టిన తీర్మానం



కేవలం ప్రజలను పక్కదోవ పట్టించే ప్రయత్నమని జగన్ విమర్శించారు. అసలు రాజ్యాంగంలో రాష్ట్రానికి 'రాజధాని' అనే పదమే లేదని, కేవలం దేశానికి మాత్రమే రాజధాని ఉంటుందని స్వయంగా మంత్రి పార్థసారధి చెప్పిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం కూడా రాజధాని అనేది రాష్ట్రాల ఇష్టమని హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసిందని, ఉత్తరాఖండ్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాలు తమ రాజధానులను తామే నిర్ణయించుకున్నాయని తెలిపారు. అలాంటప్పుడు చంద్రబాబు ప్రభుత్వం ఈ తీర్మానాల పేరుతో ఎందుకు డ్రామాలు ఆడుతోందని జగన్ ప్రశ్నించారు. అమరావతి నిర్మాణ వ్యయంపై జగన్ పలు ఆసక్తికరమైన ప్రశ్నలు సంధించారు. గతంలో 50 వేల ఎకరాల్లో మౌలిక సదుపాయాలకు లక్ష కోట్లు అవుతుందని చెప్పిన చంద్రబాబు, ఇప్పుడు అదనంగా మరో 50 వేల ఎకరాలు ఎందుకు అడుగుతున్నారని నిలదీశారు. చదరపు అడుగుకు రూ. 11 వేల నుండి రూ. 14 వేల వరకు ఖర్చు అవుతుందని చెప్పడం వెనుక భారీ కుంభకోణం దాగి ఉందని ఆయన ఆరోపించారు. ఏ స్కాములు లేకపోతే అంత ఖర్చు ఎందుకు అవుతుంది? అభివృద్ధికి అవసరమైన రెండు లక్షల కోట్లు ఎక్కడి నుండి వస్తాయి? ఈ ప్రాజెక్ట్ ఎన్నేళ్లకు పూర్తవుతుందని ఆయన ప్రశ్నించారు. ఐదున్నర గంటల పాటు జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఇలాంటి కీలక ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా, కేవలం తనను , వైసీపీని దూషించడానికే సభను వాడుకున్నారని జగన్ మండిపడ్డారు. ఒకవైపు అసెంబ్లీని పిలిచిన ప్రభుత్వం, అదే చట్టసభలో భాగమైన కౌన్సిల్‌ను ఎందుకు పిలవలేదని ప్రశ్నించారు. కౌన్సిల్‌లో చంద్రబాబు అవినీతిని సభ్యులు కడిగిపారేస్తారనే భయంతోనే బాబు ఈ నిర్ణయం తీసుకున్నారని ఎద్దేవా చేశారు. భవిష్యత్తులో ఎవరూ రాజధానిని మార్చకుండా చట్టం తెస్తామన్న చంద్రబాబు వ్యాఖ్యలపై జగన్ స్పందిస్తూ.. అసెంబ్లీలో చట్టసవరణలు చేసే అధికారం సభకు ఉంటుందన్న విషయం బాబుకు తెలియదా అని ప్రశ్నించారు. తన అవినీతిని కప్పిపుచ్చుకోవడానికి, ప్రజల్లో సానుభూతి పొందడానికే చంద్రబాబు ఇటువంటి విన్యాసాలు చేస్తున్నారని, ఆయన అసలు రంగు ప్రజలందరికీ తెలుసని జగన్ స్పష్టం చేశారు. అమరావతి విషయంలో చంద్రబాబు ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును తప్పుబడుతూ జగన్ చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి.

మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మాత్రం రాజధాని అమరావతిపై మరోసారి అక్కసు వెళ్లగక్కారు. పార్లమెంట్‌లో రాజధాని అమరావతిపై కీలక చర్చ జరిగే సమయంలో తాడేపల్లి ప్యాలెస్‌లో వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. మావిగన్ ప్లాన్-బి అంటూ ఏపీ రాజధానిపై మరోసారి జగన్ గందరగోళ ప్రకటన చేశారు. ఏపీ కోసం ప్రాక్టికల్‌గా ఆలోచించే వారికి మాత్రమే తాను చెప్పేది అర్థమవుతుందని అన్నారు. ప్లాన్-బి ప్రకారం విజయవాడ, మచిలీపట్నం, గుంటూరు ప్రాంతాలను కలిపి రాజధాని చేయాలని జగన్ అన్నారు. దీనికి మావిగన్ అని పేరు పెట్టాలన్నారు. అమరావతికి పెట్టే రూ.2 లక్షల కోట్లలో 10 శాతం పెడితే మావిగన్ భవిష్యత్తులో మంచి నగరం అవుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ తీరును తప్పుపట్టారు వైసీపీ అధినేత. రాష్ట్ర రాజధాని అనేది పూర్తిగా ఆయా రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని అంశమని చెప్పుకొచ్చారు.

## సోషల్ మీడియా వేదికగా వ్యతిరేక పోస్టులపై ఆంక్షలు

మొదటిపేజీ తరువాయి..

చేయనుంది. అలాగే ఆ పోస్ట్‌ను షేర్ చేసే వారిపై సైతం కఠిన చర్యలు తీసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఉపక్రమిస్తోంది. అందుకోసం దేశ భద్రత పేరిటి కొత్త ప్రతిపాదనలను కేంద్రం తీసుకు వస్తుంది. అందుకోసం



ఐటీ రూల్స్ సవరణకు కేంద్రం ఇప్పటికే సిద్ధమైంది. దాంతో కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై సోషల్‌మీడియా ఖాతాలో ఏదైనా వ్యతిరేక పోస్టు పెడితే ఇక చట్ట పరమైన శిక్షలు తప్పవు. ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, ఫేస్‌బుక్ వంటి సోషల్‌మీడియా వేదికల ద్వారా ఇకపై ఏదైనా పోస్ట్ చేస్తే, ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాడ్‌కాస్టింగ్ మంత్రిత్వ శాఖల నుంచి నోటీసులు అందుకునే అవకాశం ఉంది. ఇక ఆన్‌లైన్ వేదికలపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే యూజర్ల, కంటెంట్ క్రియేటర్లు, సోషల్ మీడియా ఇన్ఫ్లూయెన్సర్లను సైతం న్యూస్ పబ్లిషర్లుగానే ఇకపై కేంద్రం చూడబోతున్నదన్నది స్పష్టం కానుంది. మైనా అభ్యంతరకర పోస్టులు పెడితే.. నేరుగా యూజర్లకే నోటీసులు పంపాలనే సమాలోచన కేంద్రం చేస్తోంది. ఈ మేరకు ఐటీ నిబంధనలతోపాటు 2021లో కొన్ని సవరణలు ప్రతిపాదిస్తూ సోమవారం కేంద్రం ముసాయిదా నిబంధనలను విడుదల చేసింది. దీనిపై ఏప్రిల్ 14వ తేదీ నాటికి అభిప్రాయాలు తెలియజేయాల్సి ఉందని కేంద్రం స్పష్టం చేసింది.

## మంగళ్‌హాట్ గోదాముపై దాడి

మొదటిపేజీ తరువాయి..

మెరుపు దాడులు నిర్వహించి సుమారు 10 టన్నుల కుళ్లిన మాంసాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గోల్కొండ టాస్క్‌ఫోర్స్, హెచ్-ఫాస్ట్, జీహెచ్‌ఎంసీ అధికారులు సంయుక్తంగా ఈ ఆపరేషన్ నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు మంగళ్‌హాట్‌లోని గోదాములపై దాడులు నిర్వహించగా, నిల్వ ఉంచిన భారీ మొత్తంలో ఈ కుళ్లిన మాంసం బయటపడింది.ఈ దందా వెనుక అఫ్రోజ్ అనే వ్యక్తి కీలలక సూత్రదారిగా వ్యవహరిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. నిందితుడు జమ్ముకశ్మీర్, మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్ వంటి రాష్ట్రాల నుంచి చనిపోయిన మేకలను తక్కువ ధరకు తెప్పించి, ఇక్కడ నిల్వచేస్తున్నట్లు విచారణలో తేలింది. ఈ కుళ్లిన మాంసాన్ని నగరంలోని వివిధ హోటళ్లు, బిర్యానీ సెంటర్లకు సరఫరా చేస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో ప్రధాన నిందితుడు అఫ్రోజ్‌తో పాటు మొత్తం నలుగురిని అదుపులోకి తీసుకున్నారు పోలీసులు. ఈ ఘటనలో సదరు గోదాములను సీజ్ చేసిన అధికారులు.. నమూనాలను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపారు. నిందితులపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇటీవల నగరంలో వరుసగా బయటపడుతున్న ఇలాంటి కల్తీ దందాల పట్ల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బయట ఆహారం తినేటప్పుడు, మాంసం కొనుగోలు చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967